ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు

27-2-52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



గోర్కీ శిలాప్రతిమను నిర్మిస్తున్న రష్యన్ శిల్పకారుడు వాసిలి అకిమోవ్

(వెనుకవైపు లోపలివైపున మరొక చిత్రం చూడండి)


నేడే చూడండి
భారతలక్ష్మీ వారి
ప్రియురాలు
డి.యల్. నారాయణ, బొల్ల సుబ్బారావు
యస్. రాజేశ్వరరావు, అద్దేపల్లి రామారావు
టి.వి.యస్. శర్మ, అనిసెట్టి సుబ్బారావు
డైరెక్షన్....
గోవిందన్.
ప్రొడ్యూసర్
కె.కృష్ణమూర్తి.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము **44**
సంచిక **25**
27-2-52

ఖర సంవత్సర ఫాల్గుణ శుద్ధ విదియ బుధవారము

విషయానుక్రమణిక 1952 ఫిబ్రవరి 27

★ మద్రాస్ డైరీ ★

ఈమారు ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రసక్తి వచ్చిన వేళావిశేషమేమిటో గాని చెన్నపట్నంలో చినుకుపడింది. శివరాత్రితో 'శివశివా' అంటూ చలిపోతుం దంటారు. చలిని సాగనంపడానికొచ్చి నట్లు వచ్చిందివర్షం. ఫిబ్రవరిలో వర్షాలు చెన్నపట్నానికి కొత్త గాదు. ఆంధ్రదేశం 1949 ఫిబ్రవరిలో గాలివానల్ని మరిచిపోదు.

* * *

రాయలసీమ ప్రాంతమంతా కరువుతో, నీటికొరవతో కటకటలాడుతోంది. ప్రాజెక్టుల పరిశీలనకోసం ప్లానింగ్ కమిషన్ పంపిన టెక్నికల్ కమిషన్ సభ్యులు పరిస్థితుల్ని స్వయంగా చూస్తున్నారు. రాయలసీమలో నీటికరువెలా ఉంటుందో చెన్నపట్నంలో ఉండేవారు ఊహించడం కష్టం. అయితే వారుకూడా స్వయంగా రుచిచూసే రోజులు వస్తున్నాయనిపిస్తుంది. మే నెలలోగా గట్టిగా కొన్నిరోజులపాటు కుంభవర్షమో, పెద్ద గాలివానో వస్తేగాని ఇప్పుడిస్తున్నట్లయినా నీరు ఇవ్వడం వీలుపడదని కార్పొరేషన్ కమిషనర్ గారంటున్నారు. (అంటే పొద్దుట రెండున్నర గంటలూ సాయంకాలం అరగంటా సప్లైచేస్తారు: కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రివేళ అందరూ మాటుమణిగినతర్వాతగాని కుళాయి పలకదు.)

గాలివానలు రావడం అపురూపంకాదు గాని, వచ్చేది పంటలుపండే కోస్తాజిల్లాల మీదికొస్తుందిగాని నీళ్లు కావలసిన చెన్నపట్నానికి రావడం అరుదు. కోస్తాజిల్లాల్లో గాలివాన వొచ్చినప్పుడు చెన్నపట్నంలో మబ్బులూ ఉక్కా, విగిలి చినుకుపడేది కాదు. ఈ మాటుమాత్రం శివరాత్రి చినుకు చెన్నపట్నంలోనే పడింది. కాని వర్షాలకోసం అంగలారుస్తున్న కార్పొరేషన్ అధికారుల్ని వెక్కిరించినట్లు రెండు చినుకులు చినికి ఊరుకుంది. దేశంలో మాత్రం చినుకుపడలేదని వినికిడి.

* * *

రాయలసీమవాసులికి నీటి కరువులూ తిండికరువులూ నిత్యానుభవాలు. పెట్టుబడీ పరిశ్రమా ఉంటే అందరికంటే కళకళలాడవలసిన దేశం వకవకలాడిపోతోంది. ప్రాజెక్టులద్వారా నీటివసదుపాయమే కాకుండా విద్యుచ్ఛక్తి కూడా సప్లైచేసినప్పుడుగాని రాయలసీమకి తగిన ఆధారం లభించదు. విద్యుచ్ఛక్తి లభించినప్పుడు ఇతర ప్రాంతాలకంటె మేలుగా రాయలసీమ దేశీయసంపద ఉత్పత్తిచేస్తుంది.

* * *

టెక్నికల్ కమిషన్ చాల శ్రద్ధగా పరిస్థితులు పరిశీలించవలసి ఉంటుంది. ఇక్కడ ప్రాజెక్టుల విషయం రాజకీయాల రభసలో పడిపోయింది. ఆంధ్రదేశానికి అన్యాయం జరుగుతున్నదనీ, రాయలసీమను కోస్తా ప్రాంతాలవారు వంచిస్తున్నారనీ ఇలాటి అభిప్రాయాలు ప్రజలలో ప్రబలంగా ఉన్నాయి. మద్రాసుప్రభుత్వం సమర్పించిన కార్యక్రమం ఆంధ్రదేశంలో అనుమానాలకు తావుతీసింది. అందువల్ల ప్రాజెక్టుల సమస్యను మొదటినుంచీ తుదివరకూ సమగ్రంగా పరిశీలిస్తేగాని ప్రజల అనుమానాలు తీరడం కష్టం. ప్రజల తోడ్పాటు సహకారం లేక ఈనాడు ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా కొనసాగవనేమాటను ఎవరూ మరిచిపోకూడదు.

* * *

అసలున్న సమస్య ఏమిటంటే గోధుమకంటె బియ్యానికి కరువు అధికంగాఉంది. కృష్ణా గోదావరీ నదుల జలాలే కాకుండా ఆంధ్రదేశంలోని చిన్న చిన్న నదులు వాగుల నీరు కూడా పంటల కుపయోగపడ్డంలేదు. ఈనదుల నీటిని మళ్లించి ఆహారధాన్యాలు పండించడానికి తగినంత నేలవుంది. ఈ నీటిలో ఏకొంతైనా మరికొంత వినియోగపడితే దక్షిణాదిని కరువనేది ఉండదు. తరవాత రెండో ముఖ్యవిషయమేమిటంటే, విద్యుచ్ఛక్తినికూడా తగినంత ఉత్పత్తిచేస్తే

(48-వ పేజీ చూడండి)

మరేపుదాన

చుట్టపు చూపుగా వచ్చిన చుట్టాలు చూరుపట్టుకు వేళ్లాడితే రేవరు మాత్రం పెట్టగలరు చెప్పండి. అందులో యీ రోజుల్లో! వూరులో వున్న రేషను కార్డన్నీ ముష్టెత్తినా వాళ్లని మేపడం బ్రహ్మతరం కాదు. ఇల్లా అంటే వస్తుంది నాకు మా ఆవిడకి వోయుద్ధం. రెండు మూడు రోజులు యిద్దరి మధ్య మౌనం. తర్వాత షరక మామూలే వుండనే వుందిగా.

రేపటి ఆదివారానికి వాళ్లవాళ్లొచ్చి నెల పూర్తవుతుంది అంటే నాలెక్క ప్రకారం. ఇక మా ఆవిడకి లెక్కంటూ లేనేలేదు. "మా వాళ్లు రానేరారు వస్తే పట్టుమని పది రోజులైనా వుండరు. అంతలో నేరాద్ధాంతాలు సిద్ధాంతాలు వచ్చిపడతాయి" అంటుంది. అదేం వరసో దానికే తెలియాలి.

నా పోరు పడలేక మా ఆవిడ వాళ్ల వాళ్లతో చెప్పిందో యేమో, దశమి మంగళవారం ప్రయాణ ముహూర్తం నిర్ణయించారు. ఆ వార్త విని పరమానంద భరితుణ్ణయ్యాను. మరో విషయం—యిటు వంటి ముహూర్తాలు యిదివరకెన్నో వెళ్లినాయి. ఈ ముహూర్తానికి వెళ్లక తప్పిందికాదు వాళ్లకి. ఎందుకంటే మా పెద్ద తోడల్లుడు 'వెంటనే బయల్దేరి రమ్మని' మద్రాసు నుంచి ఎక్స్ప్రెస్ టెలిగ్రాం యిచ్చాడు.

ఆ వేళ శుక్రవారం. బంధువులు మమ్మల్ని కటాక్షించి అప్పటికి రెండు రోజులయింది. అది మూడవ రోజు మా ఆవిడ నాతో మాట్లాడటం మానేసి. సామాన్యంగా మా ఆవిడ యెంత పట్టుదల వహిస్తుందో అంత తేలికగా తేలిపోతుంది.

ఉదయం వరండాలో వాలు కుర్చీలో కూర్చున్నాను. యేదో ఆలోచిస్తూ. మా ఆవిడ కప్పుతో కాఫీ పట్టుకొస్తూ (నాతో రాజీపడాలని కాబోలు) నెమ్మదిగా "అది కాదండీ..." అని యేదో చెప్పబోవడం కొస్తలీలగా తెలుసు.

ఎందుకో నవ్వొచ్చింది. నవ్వాను.

దాంతో మా ఆవిడకి మరింత వొళ్లు మండిందేమో ఆ కాఫీ కప్పు కొస్త విసురుగా నా ప్రక్కనున్న బల్ల మీద పెట్టి రుస రుస మంటూ చెర చెర యింట్లోకి వెళ్లిపోయింది.

మనసు మారడానికి వొక్క క్షణం చాలు. 'నవ్వు నాలుగు విధాల చేటు' అన్న ఆర్యోక్తి అక్షరాలా నిజం.



రవణ

శ్రీ నేరెళ్ల లక్ష్మణరావు

అసలు కారణం లేందే కార్యం లేదన్నట్లుగా నా నవ్వు కూడా కారణం లేక పోలేదు.

నిజంగా ఆలోచన యెంత గొప్పది! నన్ను వొక్క సారిగా పదిహేను సంవత్సరాల వెనక్కి లాక్కుపోయింది. అవి నేను మిడిల్ స్కూల్లో చదువుకునే రోజులు. ఇంకా నాకు బాగా జ్ఞాపకం. నేను మా రవణ కలిసి మెలిసి తిరుగుతూ వుండే వాళ్లం. వొకే కంచంలో భోజనం, వొకే మంచంలో నిద్ర. అన్యోన్య బాంధవ్యం అనిర్వచనీయంగా మా పసి హృదయాల్లో కరడుకట్టుకు పోయింది. రవణ లేందే నాకు క్షణం గడువదు, నేను లేకపోయినా రవణకంతే.

ముమ్మాటికి ఆ రోజు దుర్దినమనే చెప్పాలి. ప్రాణ మిత్రుల మధ్య ప్రణయ కలహం ఆ రోజు. కలలోనైన తలవని తలంపు. అసలు ఆ కలహానికి కారణం నాకీ రోజుకీ అర్థం కాలేదు.

పాపం యీ నాడు రవణ యెక్కడున్నాడో? యేం చేస్తున్నాడో? నలుగురికి పెట్టి తాను తినే భాగ్యం వుందో లేదో? ఈ రోజు వాడికి నేను గుర్తున్నానో లేనో? అసలు రవణ బతికున్నాడో లేడో? తలచుకుంటే గుండె చెరువవుతూంది! పదిహేను వేసంగులు వెర్రి వెర్రిగా దొర్లిపోయాయి.

తరువాత హైస్కూలు మిత్రులు, కాలేజీ మిత్రులూ అనేకులు వచ్చి వెళ్లిపోయారు. కాని...రవణకు రవణే సాటి. అతడ్ని మరిచిపోలేను.

మా యింటి యెదురుగుండా వో మిడిల్ స్కూలువుండేది. నేను మా రవణ యింకా కొంత మంది కలిసి వోజట్టుగా బడికిపోతూ వస్తూ వుండే వాళ్లం.

ఆ వేళ శుక్రవారం. ఆ రోజు బాగా గుర్తుండడానికి కారణం ఆ తరువాతి రెండు రోజులు బడికి శెలవు.

కొంత మంది ముఠాకి మా మైత్రి కంటకమైంది. మా రవణని నాకు తెలియకుండా చేరదీసి నా మీద యేవో లేనిపోని పోటీలు చెప్పేవారు. ఈ తతంగం చాలా కాలం సాగింది. రోజు రోజుకీ రవణకీ నాకు సంబంధ బాంధవ్యాలు దూరమవుతూ వచ్చేయి. ఎన్నోసార్లు రవణని ఖంగించి అడిగినా సమాధానం చెప్పేవాడు కాదు. చివరికి విసిపేసి నేనే అడగడం మానేసేను.

ముందు వెనకలు ఆలోచించ లేనంత చిన్న వయస్సులు మావి. మా యిద్దరిలోకీ కాస్త నయం నేను. అయినా పసి హృదయాలకి కసి యెక్కువ.

మా బడికి వెనుక భాగంలో వో చెడుగుడు మైదానం వుంది అందులో ఆ రోజు మేమిద్దరం కుస్తీ పట్టవలసిందిగా మా ముఠా వారు యేకగ్రీవంగా తీర్మానించారు. సమయం—బడి వదలగానే. అప్పటికే ముఠాలో విభజన యేర్పడింది. ఒక ముఠా నా పక్షం మరొకటి రవణ పక్షం. ఆ వేళ నాకేం తోచలేదు. ఇంటి నుండి బడికి వెళ్లాను కాని, క్లాసులో మాత్రం కూర్చోలేక పోయాను. రవణని నన్నూ బంధించిన ప్రేమ పాశాలు నూలు పాశాలు కావు స్వర్ణపాశాలు. వాటిని కూడ తెగ తెంపులు చేయ సాహసించింది సంఘం.

ఆ రోజు రవణ స్థితీ అంతలోనే వుంది. ఒకవైపు ముఠా ప్రోద్బలం మరొకవైపు ప్రాణమిత్రునిపై ప్రేమ అతని అమాయకపు హృదయాన్ని ఆరాటపరుస్తున్నాయి.

బడిలో యింటిగంట మ్రోగింది. క్లాసులోంచి పిల్లలు కట్టతెగిన యేరులా పరుగు తీస్తున్నారు మైదానంలోకి.

అయిదు నిమిషాల్లో అనుకున్నకంటే యెక్కువమంది ప్రేక్షకులు హాజరయ్యారు. మైదానానికి నా పార్టీవారు కుడి ప్రక్కన మా రవణపార్టీవారు ఎడమ ప్రక్కన నిలువబడ్డారు. యుద్ధసన్నాహాలు పూర్తిఅయ్యేసరికి పదకొండయింది. ప్రచండ మార్తాండుడు మా వీపులని మాడ్చేస్తున్నాడు. బడివదిలి అప్పటికి అరగంట యిందేమో ఆ పరిసరాల్లో వొక్క అధ్యాపక పురుగైనా లేదు. ప్రేక్షకులు తమ ఉత్సాహాన్ని వెలిబుచ్చుతూ యీలలు, కేకలు వెయ్యటం ప్రారంభించారు.

పదకొండున్నరయింది. ఆ వుత్తేజ పూరిత నినాదాలలో రవణ నేనూ చేతులు చేతులు కలుపుకున్నాం.

ఎండలో తళతళ మెరిసే యిసుకలో మైమరచి పిల్లి మొగ్గలు వేస్తున్నాం. ఆ క్రోధావేశంలో, ఆ పట్టుదలలో, ఆ విజయ కాంక్షలో మాకు దెబ్బలే తగిలేయో, ముణుకుచిప్పలే విరిగేయో, వీపులే మాడినాయో యేమీ తెలియలేదు.

రవణమీద నేను నామీద రవణ సవారీలు చేసుకున్నాం. రవణమీద నేనున్నప్పుడు మాముఠావాళ్లు నామీద రవణఎక్కినప్పుడు రవణ ముఠావాళ్లు గోలచేస్తూనే వున్నారు. మాకవేమీ వినబడటంలేదు. మా పట్టుదలలు మావే.

చివరకి నా మెడ రవణకి రవణకాళ్లు నాకు దొరికేయి. వొక్కసారి నా బలమంతా వుపయోగించి రవణకాళ్ళని ముందుకు లాగేశాను. దాంతో రవణ వెనక్కి వెల్లికిలల పడిపోయాడు. మెడ పట్టు వదిలేశాడు. దాంతో వాడిమీదెక్కి బలంగా కూర్చున్నాను. పాపం రవణ నిస్సహాయుడయ్యాడు. మళ్లా నన్నెత్తేంత బలం లేకపోయింది. రవణ 'దీన్' అయిపోయాడు. విజయం నాది! కనుక తీర్మానం ప్రకారం ముందు రవణ నాతో మాట్లాడాలి.

పాపం రవణకి పట్టరాని దుఃఖం వచ్చింది. ప్రయత్నంమీద చాలాసేపు అణచుకున్నాడు. కాని యింక అతని వశం కాలేదు. బాగా దెబ్బలు తగిలాయి, యిసుకలో దొర్లడం మూలంగా వొళ్లంతా తలంతా యిసకే. వేసవికాలపు వేడియిసుక వొళ్లంతా మాడ్చింది. ఇవన్నీ కాక రవణకి తీరని అపజయం కలిగింది. రవణ ముఠా వాళ్లు మొహాలు వేలేశారు. మా ముఠా ఆనందం చెప్పతరం కాదు. మా ముఠావారు రవణని వేళాకోళం చెయ్యడం ప్రారంభించారు. రవణకి పట్టరానికోపం వచ్చింది. లేచి యిసుక దులుపుకుని, కళ్లల్లో పడుతూన్న నెంట్రుకలను వెనక్కు తీసుకుంటూ నావైపు ఒక్కసారి క్రూరంగా చూసి పరుగెత్తుకుంటూ యింటికి వెళ్లిపోయాడు.

రవణిల్లు మాయిల్లు కలిసేవున్నాయి.

(48-వ పేజీ చూడండి)

ఏ చిలక్కి

మేనల్లుడు శంకరం తనను చూడగానే కొంగెక్కి ఎంతో ఇదిగా ఆదరిస్తాడని, ఇంకా ఏమిటేమిటో ఊహించుకుంటూ గుమ్మం మెట్లెక్కుతున్న సీతారామయ్యను వరండాలో పేపరు చదువుకుంటున్న శంకర్రావు కటువుగా ప్రశ్నించాడు.

"ఏం! ఇంకా ఏముందని వచ్చావు?"

ఈ ప్రశ్నతో సీతారామయ్య గతుక్కుమన్నాడు. వెనకనుంచి ఎవ్వరో తన వీపుమీద దభీమని చరచి మెడపట్టుకుని వెనక్కు లాగినట్లయింది. మెట్లెక్కుతున్న ముందడుగు దానికదే ఆగిపోయింది. 'నిజంగా తన మేనల్లుడు శంకరమేనా ఈ ప్రశ్న వేసింది? ఒకవేళ తన కర్ణకుహరాలు ద్రోహం చేస్తున్నాయా?' అతనిలో ఎడతెరిపి లేని ఆలోచనలు ఎన్నో. అనుభూతులు మెల్లిగా స్మృతి వీధిలో మెరసి మాయమయ్యాయి. పూర్తిగా ఆవేశపూరితుడయ్యాడు. ఏదో అనాలనుకున్నాడు. అయినా ఏభై ఏళ్ళ జీవితానుభవం కలవాడవ్వడంవల్ల వచ్చిన ఆగ్రహాన్ని ఇట్టే చంపుకుని మెల్లిగా జవాబిచ్చాడు.

"అబ్బే ఏం లేదురా! అందరితోపాటు అలవాటు ప్రకారం ఈ సంవత్సరంకూడా నీకు సంక్రాంతికి బట్టలు కుట్టించా. ఎవరితోనైనా పంపిస్తే అసలే కోపంగా వున్న నీవు తీసుకుంటావో లేదో అని పరిస్థితులు ఎలా వున్నా తెగించి స్వయంగా నేనే తీసుకువచ్చాను. ఇదుగో" కాగితం చుట్టిన బట్టలకట్టను అందించాడు.

ఆ అందిస్తున్న బట్టల్ని అందుకోడానికి ఏ విధమైన ప్రయత్నమూ చెయ్యకుండా మౌనంగా సీతారామయ్యను అదో విధంగా చూస్తూ శంకరం గదిలోకి వెళ్ళిపోయాడు.

వెంటనే లోపలనుంచి ఆదిలక్ష్మి గట్టిగా కేకలు వేస్తుంది. "పొమ్మనలేక పోయావా? బట్టలు తెచ్చాడా! ఏ ముఖం పెట్టుకుని వచ్చాడు? సిగ్గులేని ముఖానికి నవ్వే శృంగారమని...... తెచ్చిన వాటిని అందుకుని ముఖాన్ని వేసి కొట్టలేక పోయావా? పాపం! ఎంత ప్రేమ! ఏం అభిమానం? ఇదంతా లోకాన్ని మెప్పించి మోసం చెయ్యడానికి. ఇంత ప్రేమాభిమానా లున్నవాడు ఆడపిల్ల ఆస్తి అపహరించి అంత అఘాయిత్యానికి ఎలా వడిగట్టుకున్నాడో? ఆ న్యాయమేదో కోర్టు తీరుస్తుంది. మనం కోర్టులో దావా వేస్తామని తెలియగానే ఏదో మంచి చేసుకుని మనిషినీ మారేడుకాయ చేద్దామనుకుంటున్నాడు. ఆ పప్పులు వుడకవని చెప్పు. ఒక్క శంకరమే అనుకుంటున్నాడేమో! ఆదిలక్ష్మికూడా వుందని తెలుసుకోమను. తలుపులు వేశావా? లోపటికి రాగలడు. శరీరంలో చీమూ నెత్తురూ వుంటేగా సిగ్గు వెయ్యడానికి..."

ఇంకా ఏమిటేమిటో అలా గట్టిగా అరుస్తూనే వుంది. పైన నిలబడిన సీతారామయ్యకు స్పష్టంగా వినబడుతున్నాయి. ఇక అక్కడ నిలబడలేకపోయాడు. ఇంటి స్వంతదారుకు లేనప్పుడు పైవాడెవ్వడో తాళం వేసి ఆ ఇంటిలో జొరబడి స్వంతదారుకు రాగానే కొట్టుపైకి నెట్టివేసినట్లనిపించింది. వెంటనే వెనక్కి గిరుక్కున తిరిగాడు. ఎందుకో చేతిలో వున్న బట్టల పొట్లాం బరువుగా కనిపించింది. కోపంగా వరండాలోకి విసిరాడు. తిరిగి మాటాడకుండా చరచరా నడచి వెళ్ళిపోయాడు.

వరండాలో 'నబ్' మని పడిన పొట్లాం శబ్దానికి శంకర్రావు ఆదిలక్ష్మిలు ఏమయిందోనని గబగబా గదిలోనుంచి బయటకు వచ్చారు. ఎదురుగా చుట్టిన కాగితం విడి ఇటూ అటూ చెదరిన లేత ఆకుపచ్చ చారల రెండు సిల్కు కమీజులు రెండు గ్లాస్కో పంచలు మగ్రాళ్ళకు తలో రెండేసి సిల్కు కమీజులు ఆదిలక్ష్మికి మంచి నాణ్యమైన రెండు చీరలు మొత్తం కుటుంబానికి సరిపడ్డ బట్టలు కనిపించాయి. నిజంగా శంకర్రావుకు ఆకుపచ్చచారల బట్టలంటే ఎంతో ఇష్టం. ఓ సంవత్సరం అంటే శంకరం పదేళ్ళవాడిగా వున్నప్పుడు ఆ రంగు కమీజులు లేవని అల్లరిపెడితే అప్పటికప్పుడు బండ్రోతుని వూరంతా తిప్పి పంపుగని ముకాళ్ళ మారి ఎక్కడో పేకాట ఆడుకుంటున్న సాహుకారుని పట్టుకుని బట్ట తీసి అరడజను కమీజులు కుట్టించి ఇచ్చాడు సీతారామయ్య.

క్రిందపడిన కమీజులు చూడగానే శంకర్రావు హృదయంలో ఏదో తెలియని తీవ్రాందోళన ప్రారంభమయింది. చెదరిన బట్టలను ఒక దగ్గరకు చేర్చి టేబిలుమీద పెట్టాడు. తనలో అనుకున్నాడు 'మామ! అన్యాయం చేస్తున్నానా? పాపం! వచ్చిన వాడిని మెడపట్టుకు గెంటినట్టు......ఎంత బాధపడుతున్నాడో? ఆలోచిస్తూనే బట్టలను తిరిగి పొందికగా కాగితంలో చుట్టాడు.

"ఎంతో ప్రేమతో మామ ఇచ్చాడుకదా అని జాగ్రత్తగా కాగితం చుట్టావు? నేను అనుకుంటూనే వున్నా ముసలినక్క ఏదో తంత్రం చేస్తాడని. అనుకున్నట్టు అప్పుడే సోపానం వేశాడు. ఏంబాబూ! పాపం ముఖం అప్పుడే అలా చిన్నబోయిందే! చూశావా క్షణంలో నీ మనస్సు ఎలా మారిపోయిందో. అప్పుడే ఏమిటేమిటో ఆలోచిస్తున్నావు. గతాన్ని ఇట్టే మరిచావు. నాతో ఏమిటన్నావో జ్ఞాపకం తెచ్చుకో.

శ్రీ శ. పైడారావు

ఆ పలుకు

ఎందుకో మొదటినుండీ నీవంటే నాకు నమ్మకం లేదు. సీతారామయ్య ఒక్క నీ తల్లి తోబుట్టువే కాదు. నా తండ్రి తోబుట్టువనికూడా తెల్సుకో. న్యాయంగా ఆలోచిస్తే అతను నీకంటే నాకే ఎక్కువ ఆంతరంగికుడు. ఇకనైనా జాగ్రత్తపడు. తల్లిలేని నీ బిడ్డల ముఖమైనా చూడు. వాళ్ల భవిష్యత్తుకై ఆలోచించు" ఏదో పెద్దతప్పు చేసినట్టు బాధపడుతున్న శంకర్రావుని ఆదిలక్ష్మి హెచ్చరిక చేసింది.

సీతారామయ్య తిన్నగా ఇంటికి వచ్చాడు. అందరూ అప్పుడే సందడిగా కొత్తబట్టలు కట్టుకుని ఎంతో హడావుడిగా వున్నారు. హాల్లో ఓ ప్రక్క పేకాట జోరుగా సాగిపోతుంది. మెల్లిగా అక్కడకు జేరాడు. ఎన్నడూ ఆ పరిసర ప్రాంతానికిరాని తమ తండ్రి ఆనాడు అలా తమ ఆటదగ్గరకు రాగానే కొడుకులిద్దరూ ఆశ్చర్యపోయారు. పెద్దకొడుకు రామం అడిగాడు. "ఏమండీ! మా అవసరం ఏమైనా వుందా?"

"అబ్బే ఏం లేదోయి. అనుకోండి. వట్టినే వచ్చాను." లేని ప్రశాంత తను ముఖంలో కనబరుస్తూ మెల్లిగా తన గదిలోకి వెళ్లిపోయాడు. వెంటనే మనుమలూ మనుమరాండ్రూ, 'తాతయ్య-తాతయ్య' అంటూ అతని చుట్టూ మూగారు పండుగ డబ్బు లివ్వమన్నారు. ఆ మాట వాళ్లు అనడంతోనే అతని నరాల్లోని రక్తచలనం ఒక్కపర్యాయం ఆగినట్లయింది. అప్రయత్నంగా అతని నయన ద్వయంలో నీరూరింది. అప్పట్లో ఆకుర్రాళ్ళంతా ముప్పై ఏళ్ల క్రిందటి శంకర్రావు ఆదిలక్ష్మిల్లా కనిపించారు. చుట్టూ మూగిన కుర్రాళ్ళందర్నీ ఒక్కొక్కర్నే హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు. తాత చేస్తున్న ఈ పనికి ఆ పసిహృదయాలకు అప్పట్లో ఆశ్చర్యం కలిగి ఆ సెకెండుకాలం విస్తుపోయినా కొత్తబట్టల సరదాలో అప్పటికప్పుడే ఆ చంచల హృదయాలు ఆ విషయాన్ని ఇట్టే మరువగల్గేరు.

బంగారం కాసుల్లా మెరుస్తున్న కొత్త కాసులు తలాఒక్క రూపాయివి సీతారామయ్య అందరికీ పంచాడు ఎగిరి గంతులు వేసుకుంటూ కుర్రాళ్ళంతా వెళ్లిపోయారు. సీతారామయ్య మెల్లిగా గోడలనున్న ఫోటోలువంక చూచాడు. అన్నింటికంటె శంకర్రావు చిన్ననాటి ఫోటో సీతారామయ్యను బాగా ఆకర్షించింది. దాన్ని పైకి తీసి తదేకదీక్షతో చూడడం మొదలు పెట్టాడు. శంకర్రావు తనయందు అంత విముఖత చూపించడానికి కారణం ఏమిటో? చెల్లెలు చనిపోతూ 'అన్నయ్యా ఇదుగో-నీవంటి మేనమామ చేతుల్లో పెరగబోతున్నవాడు ఎంతైనా అదృష్టవంతుడు. పొత్తిళ్లలోని పసికందును తన చేతుల్లో పెట్టింది. తనూ ఏ ఒక్క రోజూ శంకరాన్ని కళ్లెఱ్ఱ జేయకుండా పెంచాడు. తన ప్రథమ కుమారు డనుకున్నాడు. నిజంగా అన్ని హక్కులూ ఇచ్చాడు. అయినా తనేదో ద్రోహంచేసినట్టు శంకరం ఇంతకాలమూ వుండి తుదకు అవసాన కాలంలో తనకు దూరంగా వెళ్లిపోయాడు. శంకర్రావుపట్ల తనేదయినా తెలియని ద్రోహం చేశాడేమో? ఒక్క పర్యాయం శంకర్రావుకూ తనకూ మధ్య జరిగిన జీవిత ఘట్టాల్ని సింహావలోకనం చేసుకున్నాడు. కోణాలు వెదికినా అతనికి ఏవిధమైన తప్పూ కన్పించలేదు. పోనీ ఆదిలక్ష్మిఅంటే చిన్నప్పటినుంచీ శంకర్రావుతో సమానంగా పెంచినా తల్లి సహవాసంవల్ల తనమీద ఈర్ష్యగా వుంది. నిజంగా తన వదినగారికి కూడా తనమీద అంత ద్వేషం కలగడానికి కారణం ఏమిటో?'

అన్నగారు చనిపోగానే వదినగారియందు పూర్వకంటె ఎంతో ప్రేమాభిమానాలు కనబర్చేవాడు. ఇంటి పెత్తనం అంతా ఆమెమీదే వదిలేశాడు. వీలైనంతవరకు వదినగారి అడుగుజాడల్లో నడవడానికి నిశ్చయించుకున్నాడు. అయినా ఆమె ఆస్తిభాగం పంచుకుని వెళ్లిపోయింది. నిజంగా తను అప్పట్లో ఏవిధమైన అడ్డు చేసినా వదినగారికి ఉన్నన్నాళ్లూ తినడానికేగాని ఆస్తి పంచుకునిపోయే హక్కు లేకపోయుండేది. తను చచ్చిన అన్నగారిపట్లగల గౌరవాభిమానంవల్ల కిక్కురుమనకుండా వదినగారి ఇష్టప్రకారం ఆస్తిని పంచి ఇచ్చాడు. ఈ విషయంలో తన అర్ధాంగి అలిగి వస్తులుపడినా లెక్కచేయకుండా గుట్టుపైకి పొక్కకుండా పెట్టుకు వచ్చాడు.

నిజంగా సరస్వతే వుంటే శంకర్రావు ప్రవర్తన ఇంతవరకూ విషమించకుండా వుండేది. ఆమె కూడా అచ్చం తన చెల్లెలులాగే చనిపోతూ 'నాన్నా! ఇదుగో ఇద్దరూను. నువ్వుంటుండగా నా కేవిధమైనా చింతాలేదు' చిరునవ్వుతో కొడుకులిద్దర్నీ తన చేతుల్లో పెట్టింది. ఆ ఇద్దర్నీ హృదయానికి హత్తుకున్నాడు.

ఆదిలక్ష్మి సరస్వతులు సీతారామయ్య అన్నగారి సంతానం. సరస్వతి పుట్టడం అన్నగారు గతించడం ఒక్క పర్యాయం జరిగేయి అప్పటికి ఆదిలక్ష్మికి పదోఏడు శంకరానికి నాల్గోఏడు.

తల్లీ తండ్రిలేని శంకర్రావుతోపాటు తండ్రిలేని సరస్వతీ ఆదిలక్ష్మిల బాధ్యత సీతారామయ్య తనకు తాను నెత్తిమీద వేసుకున్నాడు. అయినా వదినగారు తోబుట్టువులమాట వినీ ఆస్తిపంచుకుని వెళ్లిపోయింది. ఆదిలక్ష్మిని తమ్ముడుకు ఇచ్చి పెండ్లిచేసింది.

'వివాహమైన నాల్గు సంవత్సరాల్లోనూ రెండేళ్లు, భార్యతో కాపురం చేసి, అక్కగారే అత్తగారవ్వడంవల్ల అడ్డుకునే వాళ్ళు లేక ఆమె ఆస్తిని ఇష్టంవచ్చినట్లు ఖర్చుపెట్టి పుట్టెడు సుఖరోగాల్తోపుచ్చి మరీ చచ్చాడు ఆదిలక్ష్మి భర్త.

వదినగారు తననో కందిరీగలాగ చూస్తున్నా ఆదిలక్ష్మి భర్తచచ్చిన రోజున ఎంతో బాధతో సీతారామయ్య కృంగిపోయాడు. 'ఏమిటీ చాదస్తం! స్వంతకూతురు మొగుడు పోయినట్లు ఎందుకాబాధ?' భార్య అన్న మాటల్నికూడా, లెక్కచేయకుండా వదిన

[35-వ పేజీ చూడండి]

ఓటర్ల విచిత్రాలు

ఈ ఓట్ల హడావిడిలో వోటర్లుచేసిన చిత్ర విచిత్ర విపరీతచర్యలు చూస్తున్నా, వింటున్నా భలే గమత్తుగా ఉన్నాయి. యింత అమాయక ప్రజలకు వోటింగు హక్కు యివ్వడం మంచిదేనా? మన హిందూదేశ ప్రస్తుత పరిస్థితుల్లో వయోజన వోటింగు అమలు జరపడం ఎంత వరకు సమంజసము అనేది ఈ క్రింది విశేషాలు చదివాక పాఠకులే నిర్ణయించాలి.

ప్రతిపార్టీవారు మాపార్టీకి శ్రీన్యాసు చేయి అంటే మాపార్టీకి అని మొదలు పెట్టారు. వీళ్ళబాధపడలేక నాకునచ్చిన పార్టీకి ఓట్లకోసం తిరగటం మొదలుపెట్టా. మొట్టమొదటగా మాయింట్లో పనిచేసే మనిషిని పలానా గుర్తుగల పెట్టెలో వెయ్యవే అంటే అది "యేమండోయ్ నన్ను యింకా నాలుకొక్కాలాలపాటు మీమీ యిళ్ళల్లో పన్చేసుకు బతకమంటారా? మరిగంటే జెయిల్లో కూకుంపెమంటారా?" అంది. నీ దుంపతెగ వోటువెయ్యమంటే జెయిలు అంటావేమిటే అంటే "అదంతా యేంటో మా వాడ కట్టోళ్ళంతా కమ్యూనిస్టోళ్ళ కేస్తుండాగు. అళ్ళగాని యెయికోకుంటే కొన్ని కట్టేసి లారిబచ్చులో పడేచి మాడేసిను కొట్లో పడతోత్తారంట" అంటుంది. యింక నేను రోజాపనిగట్టుకొని గంటసేపు వాగినా దాన్ని ఏ పార్టీకి వోటు వేయించలేకపోయా.

మా పక్కంటి పూర్వ సువాసినిని యేమండీ మీ వోటుకాం అని యింకా నేను పూర్తిచేయకుండానే, ఆవిడ "అవునమ్మా, అప్పు వోటు వేసేటప్పుడు మాత్రం మేం కావల్సివస్తాం వగవముండలం, ముష్టి పదమూడుమూళ్ళ ముల్లు గుడ్డకి నానా అగచాట్లుపడి చస్తున్నాం. మాకేం అంచులు కావాలా? జరీలు కావాలా? రంగులు కావాలా? ముడిగుడ్డకోసం సిగ్గు విడిచి వెధవవాళ్ళందరూ నడిబజార్లో కొట్లముందు బరసగ్గా వంచోడం; యింతా యేడిస్తే యే నలుగురికో యిచ్చి లేదు పొమ్మనడం" అని యింకా యింకా తెయ్యి చెరిగేస్తోంది.

శ్రీమతి దశిగ పార్వతి

నన్ను మళ్లా నోరెత్తనియ్యలా.

ఒక గూడేనికివెళ్తే అక్కడ ప్రతివాళ్లు చెప్పిందంతా విని "యేం మీరెన్ని సెప్పినా యినం. మాకులంపెద్ద సెప్పింది సేత్తాం. అయినా వోటేత్తే యెంతిత్తారూ? అనక యింతేయిచ్చినోరు అంటారేమో. యీద వలు పోయిన కూరి మడిసికి అయిదేచి చొప్పునయిత్తే ముద్దనోళ్లు డిగమింగి రెండేసి మూ మొకాల పడేసినారు" అని అక్కడఉన్న మా మాట వోదిలి మధ్యన దిగమింగి వాళ్ళను అన్యాయంచేసిన కుల పెద్దను కుమ్మెత్తడం సాగించారు.

బండీవాడిని యేవయ్యా నీ వోటు కాంగ్రెస్‌కిగాని ప్రజాపార్టీకిగాని వెయ్యవయ్యా అంటే వాడు నన్నొక వింత మృగాన్ని చూసినట్లుచూసి "యిదేంటండీ నేనేమన్నా పిచ్చోణ్ణనుకున్నారా? బలే వారే అవతల మా కమ్యూనిస్టులు తలకొక అయిదేచెకరాలు యిత్తోంటే, దమ్మిడీ యియ్యని ఈళ్ళకెందుకేత్తానండీ" అంటూ నన్నొక పిచ్చిదానిక్రింద జమకట్టేడు.

మా పాలేరుకి ఒకపెద్ద సమస్య యెదురయింది. వాడు యెక్కడో విన్నాట్ట పూరిపాకవాళ్లు చాలాచోట్ల గెలిచారని వెంటనే నాదగ్గరికివచ్చి "అమ్మాయిగోరూ పాకల్లో వాళ్లు పెపంచికాన్ని గెలిశారంటున్నారు, అదెల్గానండి మనూళ్లో పాకలవాళ్ళందరూ మీవోళ్ళని యుద్ధంలో ఓడిత్తున్నారాండి?" అంటాడు. యిహ వాడికేమంచెప్తే అర్థమౌతుంది?

యింక పోలింగు జరిగేచోట చూడాలి, మరీ తమాషాగా ఉంది వ్యవహారం. ఒకావిడ పోలింగు గదిదగ్గరకువచ్చి అక్కడ కూర్చున్న యేజంట్లనీ వాళ్ళనీ చూసి "యేమండోయ్, యిది కాంగ్రెసు కొట్టేనా మరోటా?" అంటుంది. ఆవిడ ఉద్దేశ్యం ఒకక్కళ్ళు పెట్టె ఒకక్క గదిలో పెడ్తారని. యింకో ఆవిడ అన్నిపార్టీలు ప్రచారానికి పంచిపెట్టిన కాగితాలు, ఆవిడ సంబరున్న కాగితాలు ఒక సంచెడు తెచ్చి అవన్నీ బాలెటు పెట్టెలో వేస్తానంటుంది.

ఒకావిడ పూరిపాకగుర్తుగల పెట్టెలో వోటువెయ్యడానికివచ్చింది. యెసెంబ్లీకి వేసి, రెండోది పార్లమెంటుకి వెయ్యకుండా మళ్లా యెసెంబ్లీ బూతులోకి వెళ్తోంది. యిదేమిటమ్మాఅంటే దానిలో పూరిపాక పెట్టేలేదు, నేను దాన్లోతప్ప మరోదాన్లో వెయ్యను. అందుకని దీన్ని కూడా అందులోనే వేస్తానని అక్కడ పంతం. మరో ఆవిడ ఓటు పుచ్చుకొని యెంతసేపటికి లోపలి వెళ్ళదు. ఆఫీసరు వెళ్ళమ్మాఅంటె, నేను నా వోటు గుడిసెలోనే వేస్తాను. నన్నక్కడికి తీసికెళ్ళమంది. యిందులోనే ఉంటుంది వెళ్ళమ్మాఅంటె యేమిటయ్యా! నాకేం మతి లేదనుకున్నావా? యిది డాబాఅయితే గుడిసంటావు. అతి తెలివిపోతారు అదిగో బుల్లెమ్మా నీవైనా తీసికెళ్ళమని అక్కడి అమ్మాయిని అడిగింది. అక్కడివాళ్ళ పొట్టలు పగిలిపోయాయి. మొత్తానికి ఆవిడ వోటువెయ్యనేలేదు. ఒకావిడ "మీ పవిత్రమైన ఓటు" అన్న ప్రచారంవిని ఒక పూలబుట్టలో యిన్ని పూలు, పసుపు, కుంకుమ, అక్షింతలు వగైరా సరంజామా తెచ్చింది. ఓటుని అక్కడ పెట్టెదగ్గిర పెట్టి "ఓం కేశవాయ నమహః" అని ఊరంత గొంతుతో పూజమొదలెట్టింది. యింకో ఆవిడ ఓటు వేసి దణ్ణంపెట్టి ప్రదక్షిణం చేసింది. వీళ్ళని యేమనాలో అర్థంకాలా అక్కడివాళ్ళకు.

ఒక ముసలమ్మ వేలుమీద సిరాచుక్క పెట్టేటప్పటికల్లా తేలుకుట్టినట్లు గిలగిలాడ్డం మొదలుపెట్టింది అంతా కంగారు పడి యేమిటేమిటి అంటె, "ఆవిడ" మావాడు యిందులో యేదో ద్రావకం పోస్తారు. అది మండెత్తుతుందని చెప్పాడు నాయనా నిజమేగాబోసు అనుకున్నా" అని కళ్ళు మిటకరించింది. యిలాంటివి యెన్ని జరిగాయో రాయాలంటే ఒక రామాయణంఅంత అవుతుంది. యిందులో యే మాత్రం అబద్ధం కాని అతిశయం గాని కాదు. జరిగిన విచిత్రాల్లో బహుస్వల్పం మటుకే రాసేను. ★

వడ్లగింజలో బియ్యపుగింజ



'శారదా!'

'.........'

'శారదా!!'

'.........'

'ఏయ్! శారదా!!...'

(వంటయింట్లోంచి) 'ఎందుకండీ?'

'ఎందుకా? ఇంకా పక్కింట్లో కూర్చొని అడుగు ఎందుకని.'

'ఏమొచ్చి పడిందండీ, అలా అరుస్తారు?'

'ఈ స్టాండుకు తగిలించిన తెల్లచొక్కా ఎక్కడ?'

> "మహారాజులా పో, టిక్కెట్టు కూడా కొనిస్తాను. నేనొక్కణ్ణే హాయిగా వుండొచ్చు"

'ఏమో నాకేం తెలుసు?'

'నీకు తెలియకండా ఏమౌతుంది?'

'మరే! నేను తొడుక్కున్నాను!!'

'సరేలే! అడిగిందానికి బదులు చెప్పు. ఎక్కడ ఆ చొక్కా? కాళ్ళొచ్చి పరిగెత్తిందా?'

'లేదు, రెక్కలొచ్చి యెగిరి వెళ్ళింది.'

'నోర్ముయ్! అధిక ప్రసంగం మాని.'

(స్టాండుకు తగిలించివున్న మరో మాసిన చొక్కా ఆమె ముఖమ్మీద విసిరికొట్టాడు.)

'నిన్న స్టాండుకుతగిలించిన చొక్కా ఈ రోజు కనపడదు. నువ్వు యింట్లో కూర్చొని యేం చేస్తున్నట్లు?'

'మీ చొక్కాలు పంచల సంగతి నాకేం తెలుసునండి?'

'నీకు తెలియకండా అది ఎక్కడకు పోతుంది? ఎట్లా పోతుంది? ఊఁ నువ్వున్నచోట ఏది సవ్యంగా వుంటుంది కనక.'

(కళ్ళంబట నీళ్లు రాగా) 'ఔను. నే వున్నచోట ఏదీ సవ్యంగా వుండదు. నేను పోతాలెండి ఎక్కడికైనా మీ కంటికి కనపడకండా.'

'మహారాజులాపో, టిక్కెట్టుకుడా కొనిస్తాను. నే నొక్కణ్ణే హాయిగా వుండొచ్చు.'

'హాయిగా అన్నా వుండండి, ఎలా కావాలన్నా వుండండి. ఒక చొక్కా కనపడనందుకు నామీద ఇలాఎగిరిపడేవాళ్లతో వుండేం ప్రయోజనం? మా అమ్మగారి యింటికెళ్లి హాయిగా వుంటాను.'

'ఆహా, నిక్షేపంలాపో, ఈ సాయంత్రంబండికే వెళ్లు, ఇకనైనా ఈ కొంపలో పెట్టిన సామాను పెట్టినచోట వుంటుంది. నేనూ హాయిగా ఏ సినిమాకో నాటకా

శ్రీ నాగరాజు సాంబశివన్

నికో పోతూ హోటల్లో భోంచేస్తూ సుఖంగా వుంటాను.'

*　　*　　*　　*

2

ప్రియమైన భర్తగార్కి,

శారద అనేక నమస్కారములు. ఇక్కడ అమ్మ, నాన, తమ్ముడు-అందరు క్షేమం-అక్కడ మీరు క్షేమమని తలచెదను.

ఒక చిన్న విషయంకోసం మీపైన కోపించి ఇక్కడికి వచ్చినందుకు మనస్సు ఎంతో కష్టపడింది. అక్కడ మీరు యింటి భోజనంలేక హోటల్లో ఏంబాధ పడుతున్నారోనని తలచుకొన్న కొద్దీ ఎప్పుడు బయల్దేరి వచ్చేద్దామా అని వున్నది.

వచ్చేనెల మా తమ్ముడికి వొడుగు అంతవరకు నన్ను వుండమని పట్టుపడుతున్నారు. నాకు యిక్కడ నిలవుండేందుకు ఎంత మాత్రం యిష్టంలేదు. ఈనెలా ఎలాగో గడిపి వెంటనే వచ్చేదను.

అనేక నమస్కారములు.

తప్పులు క్షమించవలెను.

ఇట్లు

ఎల్లపుడు మిమ్మలనే స్మరించు

శారద.

*　　*　　*　　*

ప్రియమైన శారదకు.

అనే కాశీర్వాదములు. నీ వుత్తరం చూచినవెనుక నా మనస్సుకు చాల కష్టం తోచింది.

ఒక చిన్న విషయంలో నీమీద అనవసరంగా కోపించినందుకు బాధ పడుతున్నాను.

ఇంతకీ అసలు ఆ తెల్లచొక్కా తర్వాత ఎక్కడ కనిపించిందో తెలుసా? మనం వాదించుకుని పోట్లాడుతున్నప్పుడు నేను తొడుక్కొని వున్నది ఆచొక్కాయే!

పొద్దున్న ఆఫీసుకు వెళ్ళే అవసరంలో ఏచొక్కా అనేది గమనించకండా తొడుక్కొని దానిమీద కోటుకుడా వేసుకోవటంవల్ల ఆ చొక్కా తొడుక్కొన్న సంగతి జ్ఞాపకం లేకపోయింది. వడ్లగింజలో బియ్యపుగింజ అన్నట్లు ఇంత చిన్న విషయంలో నీ మనస్సు వృథాగా కష్టపెట్టి నందుకు నాకు చాల విచారంగా వుంది.

హోటలు భోజనం ఏమీ పనిగాలేదు. మీ తమ్ముడి వొడుగు అయిన వెంటనే బయల్దేరి రాగలవు. అంతవరకూ ఎట్లాగో గడుపుకుంటాను.

నీవాడు.

రఘునాథరావు.

3

రెండు నెలల తర్వాత శారద భర్తయింటికి వచ్చింది.

ఒకరోజు రఘునాథరావు ఆఫీసుకు వెళ్ళే తొందర్లో-

'శారదా!'

'ఏమిటీ?'

'ఈ డ్రాయర్లో పెట్టిన పెన్ను ఏమైంది?'

'ఏమో! మీ పెన్నుసంగతి నాకేం తెలుసు?''

'నీకు తెలియదా! నిన్న రాత్రి మీ యింటికి జాబు వ్రాశావా లేదా? నా పెన్ను తియ్యకే అని ఎన్నిసార్లు చెప్పినా నువ్వు వింటేగా. మీయింటికి జాబు వ్రాయటానికి నాపెన్నే దొరకాలా నీకు?''

'ఇదుగో, నేను యింటికి జాబు వ్రాసుకోటం మీ కిష్టం లేకపోతే స్పష్టంగా చెప్పేయండి. అంతేకాని......'

(కళ్లు చెమ్మగిల్లాయి.)

'సరె మొదలెట్టావా? చాలు. పెన్ను పెట్టిన చోట వుండదు. పుస్తకం పెట్టిన చోట ఉండదు. నువ్వున్న చోట ఏది సవ్యంగా వుంటుంద కనక.'

'అవును నేను వుండే చోట ఏదీ సవ్యంగా వుండదు. ఎక్కడికైనా మీ కన్పించని చోటు చూసి...'

'శీఘ్రంగా వెళ్లు. ఈ క్షణమే వెళ్ళు. తర్వాతైనా యీ కొంపలో పెట్టిన సామాను పెట్టినచోట వుంటుంది...' ★

కోడలు

"లక్ష్మణ"

> తండ్రిమాట కాదని తననే పెళ్ళి చేసుకున్నాడు రాము. అయినా వేరు కాపురం పెట్టడం జానకి కిష్టంలేదు. మామగారు కూడా ఒక తండ్రేకదా!

'అట్లా వెళ్ళొస్తాం మామయ్యా!'— రఘురామయ్యగారు శుభ్రంగా ముస్తాబయిన కోడలువైపు చూచారు. గదిలోనుండి కొడుకుకూడా బయటికి వస్తున్నాడు—పక్కనున్న సుభద్రమ్మగారు, 'చీకటి పడకుండా రండి' అని వాళ్ళతో చెప్పి భర్తవేపు తిరిగి అన్నది, "ఎంతసేపూ కొండలూ పొలాలూ అని అఘోరిస్తారు మరీ పసితనం!'' మామగారి కంఠధ్వనికోసం ఎదురుచూచిన జానకి, అట్లాటి దేమీ రాక పోగా తలదించుకుని మెల్లగా భర్తతోటి నడిచి వెళ్ళిపోయింది. తీరా వాళ్లు గుమ్మం దిగినాక, వెళ్లిరామ్మా అనేనా అన్నాను కాదే అని నొచ్చుకున్నాడు రఘురామయ్య!

'అయిందా మామగారి దగ్గరనుంచి పర్మిషన్ తీసుకోవడం!' దోవలో నడుస్తూనే వెక్కిరించాడు రాము. జానకికి నిజంగానే ఒళ్లు మండింది — ఒక్కొక్కసారి భర్తగుణాలేవీ ఆవిడకు నచ్చవు. లోకములో ప్రతి యువకుడికీ సంస్కరణాభిలాషా, లోకాన్నంతా దోమరామత్తుచేసి చరితార్థులు కావాలనీ ఉంటుంది. అది ఉండకూడదని కాదు. అట్లా అని ప్రతి చిన్న విషయానికీ పెద్దవాళ్లతో పోట్లాట పెట్టుకోవడ మెందుకు? సర్దుకునే విషయాలు సర్దుకోవాలనే అంటుంది జానకి—మామగారయినా, కాని జేదీ చెప్పక ట్లనుకో లేకపోయింది ఆవిడ. భూమ్మీద పడ్డదగ్గిర్నుంచీ పెంచి పెద్దవాణ్ణి చేసి అభివృద్ధికి తెచ్చిన కొడుకు దగ్గరనుండి సహాయం కోరడం తండ్రిది తప్పెట్లా అవుతుంది? వాళ్ళ కష్టాలకు ఆసరాగా నిలవకుండా తనే కారణం. తనే రాము జీవితంలో ప్రవేశించకపోతే ఎట్లా ఉండేదో?— ఆలోచనలు గిర్రున తిరిగినయ్ జానకి మెదడులో! అయినా ఇదెట్లా అన్వయించడం! తనలో ఏం ఆకర్షించిందో అతణ్ణి, జానకికి అర్థం కాలేదు. అందమా, ధనమా, అవేవీ లేవు. ఉన్న చదువైనా చెప్పుకోదగ్గది కానే కాదు ఆవిడ అభిప్రాయంలో! ప్రేమ గుడ్డిది అంటుంది లోకం! ఆ మాట అక్షరాలా నిజం కాకపోతే ఈ తలతిక్క సంఘటన లెట్లా సంభవిస్తాయ్? జానకి ముఖంమీద చిరునవ్వు చిందింది. సాయంసూర్యుని ఎఱ్ఱని కిరణాల్లో ఆ నవ్వు మరీ ఎఱుపెక్కి పక్కనున్న భర్తను గిలిగింతలు పెట్టింది

'ఏమో! రాణీగారు కులాసాగా ఉన్నారే!

'ఏమిటే?'

'అహ! తమ రెందుకో నవ్వుతున్నారంటున్నాను!'

'ఏం తప్పా!'

'అమ్మమ్మ!—తప్పుకాదు. నీ యిష్టం వచ్చినంతసేపు నవ్వు!—కాని కాస్త కారణం చెప్తే ఈ అరిపేద కూడా ఆనందిస్తాడు!—'

'చెప్పకపోతే?'

'గట్టిగా అడగడానికి నే నెవర్ని!—కాని పక్కనున్న వాళ్ళకు కారణం తెలియజేయకుండా నవ్వడం భావ్యం కాదు!—'

'పోనీలేవయ్యా! ఈ భావ్యాభావ్యాలు నాకేం తెలుసు?'—మాట తిప్పేసింది. ఇద్దరూ దాదాపు పచ్చని పొలాలగట్ల వరకూ వచ్చేశారు.

చల్లగా పైరుగాలి సాగింది. పొలంలోని జొన్నకంకులు, సాగురేగి, కళ్లువిప్పి లోకాన్ని చూస్తూ ప్రతివారినీ ఆహ్వానిస్తున్నట్లు ఊగుతున్నయ్ ఆ పొలాలు, ఆ మట్టీ ఆ పంట, అవే—వాటినిచూస్తే ఎవరి హృదయం కదలదు?—కాని ఆ కదలిక అప్పుడప్పుడు మాత్రమే. అసలు మనుష్యుడు తనను నిలబెట్టి పోషిస్తున్న దేదో కూడా తెలియకుండా, వాస్తవానికి దూరంగా జీవిస్తాడు—

ఇద్దరూ గట్టుమీద కూర్చున్నారు. చేతి కందిన జొన్న కొడలో ఆకుచీల్చి కొసలు నములుతున్నాడు భర్త జానకి అడిగింది, 'అయితే మన ప్రయాణ మెప్పుడు?'—ఆ కంఠస్వర మేమీ సహజంగా లేదు. ఏదో తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో తొణికిసలాడుతున్నట్లుంది. మట్టి చేతిలో పోసుకుని భర్తముఖం చూడకుండానే దాన్ని అటూ ఇటూ కలబొయ్యడం మొదలు పెట్టింది—రాముకా దృశ్యం ముగ్ధంగా ఉంది. కాని ఆవిడ అడిగిన ప్రశ్నకు మొదలూ తుదా తెలియలేదు. జానకి తత్త్వమేమిటో అతడికి బాగా తెలుసు—ఉన్నట్లుండి పిడుగులు పడ్డట్లు ప్రశ్నల వర్షం కురిపించడం ఆవిడ కలవాటే!—అందుకని ఆ ప్రశ్న అర్థం వెంటనే తెలుసుకోవాలన్న తొందర అతడిలో కలగనే లేదు. 'సరిగా చెప్పండి! దేనిగా రెక్కడకన్నా ప్రయాణం చెయ్యాలనుకుంటున్నారా?'

'దేవిగారను కుంటే మాటా మళ్లే ఎప్పుడో సిద్ధమయ్యేవి! - అనుకోటంలేదు గాబట్టే ఈ పాటంతా!'

'అయితే నేననుకున్నా నన్నమాట! కనీసం ఇప్పుడనుకుంటాను. ఎక్కడికెళ్దాం చెప్పు!' - జానకి మాట్లాడలేదు. మొహం పెడసరంగా తిప్పి కూర్చున్నది. రాముకిదేమీ అర్థంకాలేదు, ఆవిడకు కోపంవచ్చింది. కోపంవచ్చినప్పుడే అట్లా విముఖంగా ఉండి మౌనాన్ని భజించడం జానకి అలవాటు - ఆకోపానికి కారణాన్ని వెతికి వెతికి బుఱ్ఱ పాడు చేసుకోవడం అతనికి ఇష్టంలేదు. అడిగితే ఆవిడే చెప్తుంది. తప్పంటే రెండు ఘాటుమాట లంటుందనుకున్నాడు!

'జానకీ'...

'........'

'పలకావేం!—కోపంవస్తే వచ్చింది. పలకరించినా ఊరుకుంటే ఎట్లా?' - గడ్డాన్ని పట్టుకుని తనవేపు తిప్పుకున్నాడు.

'.........'

'ఎక్కడికి? - నేనెక్కడికీ ప్రయాణం అవుతున్నానని చెప్పలేదనుకుంటానే! బహుశ జ్ఞాపకంలేదేమో! చెప్పరాదూ!' భర్త తీరు చూచి ఇక ఊరుకోబుద్ధిపుట్ట లేదు. అయినా ఏమీ చెప్పకుండా అర్థంతరంగా విషయాన్ని తెస్తే గ్రహించడానికి ఆయనేమన్నా దేవతా? ఆవేళ ఉదయం అత్తగారు చెప్పిన మాటలనుబట్టి తను భర్తమీద కోపం తెచ్చుకున్నది. కోపగించుకోవడానికేనా తను అతని జీవితంలో భాగం పంచుకున్నది! - ఆడవాళ్ళంతా ఇంతే కాబోలు ననుకుని, భర్త కళ్ళల్లోకి సూటిగా చూచి అన్నది.

'మామయ్యతో నీవేమో అన్నావటగా!'

'నేనా?...ఏవిషయం?'—

'ఎక్కడో ఏదో ఉద్యోగం కాచుకూర్చున్నదటగా నీకోసం! దరఖాస్తు పెడతానన్నావట!' - మాట పూర్తి కాకుండానే రాము పకపక నవ్వడం మొదలుపెట్టాడు. ఉక్రోషం ఆపుకోలేక చుఱచుఱమాస్తూ ఉండిపోయింది జానకి!- నవ్వు తమాయించుకుని, భార్య ముఖం చూచి అన్నాడు.

ఇప్పుడక్కడికి కెప్పుడెళ్దామనా నువ్వడిగేది?'

'.........'

'ఈసంగతి నీకు చెప్పలేదని కోపం కూడా తెచ్చుకున్నావా?' అలూలేదు, చూ...'ఇక సహించుకోలేక పోయింది జానకి. అయినా ముఖం ప్రసన్నం చేసుకుని, కోపం సర్దుకుని, మాట మధ్యలోనే శాంపిగా అన్నది!—

'బలే! అమోఘంగా ఉంది తెలివి!—'

'ఏం?'—తెల్లబోయి అడిగాడు రాము!—

'పోనీలేగాని బావా! ఆ ఉద్యోగం నీకు వస్తుందా?'

'ఢంకామీద దెబ్బకొట్టి!'

'వస్తే వెళ్లాల్సిందే నన్నమాట!'

పోదాం—ఏం అట్లా అడుగుతున్నావ్!'

ఇక్కడ నీ ప్రాక్టీసు బాగా సాగటం లేదూ!'

రాము ఆలోచనలో పడ్డాడు. ఏదో పెటకం ఉండబట్టే జానకి ఇన్ని ప్రశ్నలు వేస్తున్నది. తను లాయరేఅయినా విషయ ప్రదర్శన ఇంత డొంక తిరుగుడుగా చెయ్యడం తనకు రాలేదు—ఆరోజు తండ్రికా ఉద్యోగవిషయం చెప్పినప్పుడు కూడా ఆయన ముఖంలో వింతరంగులు కనపడినయ్. తృప్తికరంగాలేదని అప్పుడే అనుకున్నాడు తను. ఇప్పుడు మళ్లీ జానకి ఆవిషయం కలవేసింది!

'ఏమంటావు జానకీ!—ఇక సరిగా చెప్పు!' గంభీరంగా అడిగాడు. జానకి అంతకంటే సీరియస్‌గా మొహంపెట్టి అన్నది!—

'ఇప్పటికే తలిదండ్రుల సహాయానికి రాలేదంటున్నది లోకం!—ఇంకానా బావా?'

'ఇప్పుడు చెయ్యకుండా వేనేం దూరంగా ఉన్నానా?'

'అదికాదు. ఇకముందైనా వాళ్లకు దూరంగా పోవద్దని!'

'పోతేమాత్రం! వాళ్లను మర్చిపోతామా జానకీ! నేను పెద్దకొడుకుని. వాళ్లబాధ్యత నాది కాదూ!—'

'ఆ మహా గొప్పబాధ్యత నెత్తిన వేసుకునే వాడివి బయల్దేరావ్!—'ఇంతవరకూ ఎట్లా అక్కరకు వచ్చావయ్యా నువ్వు? ఒక దౌర్భాగ్యురాల్ని మనస్సులో పెట్టుకుని అఘోరించి అందర్నీ కాదన్నావ్!' ఇక మాట్లాడలేకపోయింది. గొంతులో ఉన్న గద్గదికతో, పెదవులు వణికేతీరూ చూస్తూ కూర్చున్నాడు రాము. స్త్రీహృదయమే అంత! ఎప్పుడూ ఆవిడ త్యాగం చేసే అవకాశాన్ని కోరుకుంటుంది. కనీసం లోకమంతా కాకపోయినా, ఎరిగిన వాళ్ళయినా తన్ను 'త్యాగి' అంటే బాగుండునని గాఢంగా వాంఛిస్తుంది. ఇదేమీ లేకపోగా, పైపెచ్చు ఇంకొకరి కష్టాలకు కారణ మనిపించుకోవడం నిజంగా స్త్రీకి సహించరానిదే! జానకికి సరిగ్గా ఇదే అవస్థ సంభవించింది. కాని తన సర్వస్వమూ అనుకున్న రామును త్యాగంచెయ్యడం ఆవిడకు సులభమనిపించలేదు. అదీ కాక దానివల్ల అతనుకూడా సుఖపడలేడేమో అన్న సందేహంతో ఊరుకున్నది!-మంత్రించిన వాళ్ళకు మల్లే ఇద్దరూ కొంతసేపు మూకంగా కూర్చున్నారు. తరువాత జానకే పోదామన్నది. అతడు అనుసరించాడు. ఇద్దరూ చాలాదూరం నడిచారు. ఇల్లు ఇంకా ఫర్లాంగుదూరం ఉంది!

'పట్నవాసంలో జీవితం అనుకూలంగా ఉంటుందనుకున్నాను జానకీ! - పెద్దవాళ్ల వత్తిడి లేనిచోట ఆశయ నిర్వహణ నిర్విఘ్నంగా జరుగుతుందని కూడా అను

కున్నాను. సరే! ఇప్పుడిక ఆ ప్రయత్నం చెయ్యను!' — పక్కనే నడుస్తున్న భార్య ముఖం చూడకుండానే తూచి తూచి పలికాడు! — భర్త మనస్సులో ఆలోచనలెన్నో, వాటిమీద తన అధికారమెంతో చూచాయగా తెలిసింది ఆవిడకు. భర్త పోయినంత మేరా అడుగులు పడ్డ భూమిని చూస్తూ నడిచివచ్చింది. అందులో ఏదో కాంతి వాకలు కట్టినట్లు పవిత్రత పెల్లుబికినట్లు తోచి, ఆవిడ మనస్సు భక్త్యార్ద్రమైంది.

2

'కాఫీ తెమ్మన్నారా!' ఒదిగి ఒదిగి బయటికివచ్చినట్లుంది కంఠస్వరం! అప్పుడే కోర్టునుంచివచ్చి వంకెకు కోటు తగిలిస్తున్న మామగారు వెనక్కు తిరిగి కోడల్ని చూచారు.

'మీ అత్తమ్మలేదూ!' ప్రతిగా ఒక్క చూపు చూచింది జానకి! అందులో ఏవో వింతఛాయలు తోచి, అట్లా ఎందుకడిగానా అనుకున్నాడు.

'సరే తెచ్చిపెట్టు! మొహం కడుక్కోడానికి నీళ్లు కూడా!' — చెంబుతో నీళ్ళు వరండాలో పెట్టి తువ్వాలు దణ్ణెంమీద వేసి హడావిడిగా లోపలకు వెళ్లింది. కాళ్లు కడుక్కుని, చెంబు కోడలిచేతి కందించి, బల్లముందు కూర్చున్నాడు మొహం తుడుచుకుంటూ. జానకి పక్కన కూర్చున్నది.

'నెయ్యి వేస్తా!' — గిన్నె చేత్తో పట్టుకుని గరిట ఎత్తి మామగారి ముఖంవేపు చూచింది — ఆయన ముఖం చిట్లించుకున్నాడు. 'అన్నీ అక్కడే ఉన్నాయిగా! నే వేసుకుంటాలే! నీవు వెళ్లు!' — జానకి మాట్లాడలేదు. అక్కడనుండి కదలనూ లేదు. మళ్ళీ ఎందుకన్నానా ఇట్లా అని ఆయన కించపడ్డాడు. ఏదో సానుభూతి తెరలి ప్రవహించింది!

'రాము రాలేదూ!' —

'వచ్చి ఎక్కడికో వెళ్లారు! అరగంటలో తిరిగి వస్తానని!'

'మీ అత్తమ్మ!'

'పిన్నిగారింటికి వెళ్లింది!'

'పిల్లమీద అన్నీ వదిలిపెట్టి పెత్తనాలకు పోయింది!' — నవ్వుతూనే అన్నాడు. కాని ఆ నవ్వు వెనకఉన్న భావమేమిటో జానకికి బాగా తెలుసు. తను ఆయన ఇష్టానికి వ్యతిరిక్తంగా కాలు పెట్టింది ఆ యింట్లో — తన మూలంగానే భర్తకూ మామకూ మధ్య అఘాతాలు ఏర్పడినయ్.

'సరళ ఉత్తరం వ్రాసింది' — తల ఎత్తకుండానే అన్నది మెల్లిగా.

'ఏమని?' —

'అంతా క్షేమంగా ఉన్నారట! — వాళ్ళ ఆయనకు ఎక్కడో పనయ్యేట్లుందనీ త్వరలో వాళ్ళిద్దరూ వెళ్లబోతారని కూడా వ్రాసింది!' — రఘురామయ్యగారి ముఖ చిహ్నాలు మారిపోయినయ్. అది కనిపెడ్తూనే ఉన్నది కోడలు — మనిషి అసహజంగా కుంధించుకుని, కఠినంగా అన్నాడు 'అయితే మీ వంతెప్పుడు?' —

అత్తగారు చెప్పిన విషయాన్నిబట్టి ఇట్లాంటి ప్రశ్న వచ్చినా సిద్ధంగా ఉండగలిగింది. చాలా ప్రశాంతంగా, దృఢంగా పలికింది:

'మాకేం అవసరం మామయ్యా!'

'అందరికీ ఏదో అదే! — పోయేవాళ్ళను ఉండమంటే ఆగరు, ఉన్న వాళ్ళను పొమ్మంటే పోరు.'

'మీ రట్లా అనుకోవాకండి! తల్లినీ తండ్రినీ వదిలిపోవాల్సిన ఖర్మమేం?'

ఈమాటతో రఘురామయ్య ఆశ్చర్యపడ్డాడు. జానకి ఆయింటికివచ్చి అది మూడో నెల! కొత్తకోడలట్లా మాట్లాడుతుందా? అంతకుముందే రాముకూ తనకూ ఈవిషయంలో వాదన జరిగింది. ఇంకొక ఊళ్ళో ఏదో ఉద్యోగం ఉందనీ ఎప్లై చేస్తాననీ సలహా అడిగాడు. రఘురామయ్యగారికి కొడుకట్లా ఎందుకడుగుతున్నాడో అర్థం కాలేదు. ఉన్న ఊళ్ళో పనివదులుకుని పోవడమేమిటి? — బహుశ జానకి నూరిపోసిందని అపోహ పడ్డాడు! ఆ ఊహకూ ఇప్పటి కోడలి మాటలకూ అన్వయం కుదరలేదు. మెల్లిగానే అడిగాడు.

'మీ ఆయన ఇక్కడనుండి కదలాలన్నట్లున్నాడే!'

'ఆ! ఆయనకో తిక్క!' చాలా సులువుగా కొట్టి పారేసింది. అనుకున్నదేమీ సరిగా రాబట్టలేక అసంతృప్తితో ఫలహారం ముగించి చెయ్యి తోడుచుకుంటూ బయటకు నడిచాడు మామగారు. జానకి బల్లమీది ఖాళీపళ్ళెమూ ఇతర వస్తువులూ తీసి శుభ్రంచేసి బయటికి వచ్చింది. మామగారు కూర్చున్న కుర్చీకి దగ్గరగా మరో కుర్చీ లాక్కుని కూర్చుంది.

కోడలు తీసుకుంటున్న ఈ చనువుకు చిరాకువేసినా, చదువుకున్న పిల్లకదా అని సర్దుకున్నాడు. అదీకాక ఆవిడ ఎదురగా ఇదికాదు అని చెప్పడం కష్టమేమో అని కూడా అనిపించింది ఆయనకు — ఇద్దరూ చాలా సేపు నిశ్శబ్దంగా ఉన్నారు. చుట్టూ ఉన్న గాలికూడా ఎక్కడ శబ్దమవుతుందో అన్నట్లు మందంగా ప్రవర్తిస్తున్నది.

ఇంటిదగ్గరనుండి ఉత్తరం వచ్చింది!' జానకే కలిపింది సంభాషణ! — కోడలు ఆప్యాయంగా తనతో మాట్లాడడానికి చేసే ప్రయత్నాలివన్నీ అని తనకు తెలుసు. తెలిసీ ఇట్లా విముఖంగా ఎందుకుంటున్నాడో అర్థం చెప్పుకోలేక పోయాడు. ఒక్కొకసారి తను మరీ కఠినంగా ప్రవర్తించి ఆ పసిమనస్సును నొప్పిస్తున్నా ననుకునేవాడు.

'అందరూ క్షేమమా?' —

'ఆ! కాని నాన్నకు కొంత ఒంట్లో బాగుండలేదట!' — ఆ కంఠ ధ్వనిలో ఏదో లోతు తెలియని ప్రేమ ఉన్నట్లు స్పష్టమైంది. ఇతమిత్థమని చెప్పలేని సానుభూతితో ఆయన హృదయం నిండిపోయింది. తనకు బాగాలేదని ఉత్తరం వ్రాస్తే సరళ కూడా ఇట్లానే అనుకుంటుందా అనుకున్నాడు. కాని ఆ ఊహతో ఆయనకు ఏవేవో సందేహాలు కలిగినయ్! ఏనాడు కూతుళ్లు దగ్గర తను చనువు చూపించింది? ఈ కోడలు నిజంగా తనను వెలుగులోకి తెస్తున్నది! — ఇన్నాళ్లనుంచీ తను చేసింది నిజంగా పొరపాటేనేమో అనుకున్నాడు. ప్రశాంతంగా ఉన్న జానకి ముఖంలో దూరానఉన్న సరళ గిఱ్ఱున తిరిగింది. ఆవిడ కళ్ళల్లో ఉన్న పవిత్రత అతణ్ణి ముగ్ధుణ్ణిచేసింది.

‘ఆయన్ని చూడాలని లేదూ! వెళ్ళి వస్తావా?’—జానకి నవ్వింది.

‘నేనిక్కడికి వచ్చి మూడునెల్లైనా కాలేదు—వెళ్ళితే అందరూ వెక్కిరిస్తారు!—’

‘ఎట్లా మరి?—’ ఆ ప్రశ్నలో ఇటువంటివాళ్లు పెళ్లెందుకుచేసుకోవడం అన్న అర్థం ధ్వనించింది. జానకిమాత్రం లోతుగా ఆలోచిస్తున్నది. ఆవిడ వైఖరీ ఆ మూకతా చూచి కోడలు బాధపడుతున్నట్లు గ్రహించాడు. సహజమైన పితృప్రేమ తనకు తెలియకుండానే పొంగింది. ఇక్కడ నీకు బాగుండలేదు కాబోలు అందామనుకున్నాడా అనడానికి మళ్ళీ అభిమానం అడ్డువచ్చింది. ఇంతలో నిశ్శబ్దాన్ని చెదరగొట్టి జానకే అడిగింది.

‘కోడలుగా ప్రవేశించి కూతురుగా మెలగడానికి ఎవరికే హక్కు లేదా మామయ్యా!—’ ఆ ప్రశ్న ఎందుకు వేసిందో అతడికి అవగతమైనా జవాబు చెప్పే శక్తి తనలో లేదనిపించింది. జానకి కళ్లనిండా నీళ్లు పెట్టుకుని లేచి లోపలికి వెళ్లిపోయింది—అది గమనించినా ఏం చెయ్యడానికీ ఆయనకు పాలుపోలేదు. వెనుకటి సంగతులన్నీ గిర్రున మనస్సులో తిరిగినయ్. జానకి ఆయింటికి రావడానికి తనే మొదట అభ్యంతరం పెట్టాడు. అట్లా చెయ్యడంలో చెడు పని చేశానని ఆయనా అనుకోలేదు లోకమూ అనలేదు. తండ్రి కష్టాలను గమనించే కొడుకే అయితే రాముకూడా తన మాట వినేవాడే!— పెడసరపు మనిషి కాబట్టి కోరి ఆవిడను ఇంటికి తెచ్చాడు.

రఘురామయ్యగారిది పెద్ద కుటుంబం. పెద్దకొడుకు రాముమీద దంపతులిద్దరికీ పంచప్రాణాలు. తండ్రి కొడుక్కి తొమ్మిదేళ్లు వచ్చేదాకా ఎత్తుకుతిరిగేవాడు. కాలచక్రభ్రమణంలో ఏళ్లు దొర్లినయ్. పిల్లవాడు పెద్దవాడయ్యాడు. పరీక్షా ఫలితాలు ప్రచురించబడ్డనాడు తండ్రి హృదయం తేలికపడ్డది— సాధారణంగా మగవాళ్ళ మనస్తత్వాలు విచిత్రమయినవి. ఏన్నాళ్ళనుండో భరిస్తున్న బరువు సందు దొరికితే దించుకోవాలనుకోవడం వాళ్ళకు సహజం. చేతికి అందిరాదగ్గ బిడ్డలమీద పసినాటి ప్రేమ వాళ్ళు చూపించరు. తల్లికి మాత్రం వాళ్లు గడ్డాలు వచ్చినా పసిబిడ్డలే! రఘురామయ్యగారికి కొడుకు బాధ్యత నెత్తిన వేసుకోదగ్గవాడుగా ఆనాడే కనిపించాడు.

‘ఏమిటోయ్ నీ భవిష్యత్తు’—తీరికగా కదిలించిచూచాడు ఆ రోజే!

‘ఏమి. లేముంది? ఇంకా చదువుతాను!’ అంతా స్థిరం చేసుకున్నట్లు పెళుసరంగా జవాబు చెప్పాడు కొడుకు. తండ్రి ఏమీ మాట్లాడ లేదు. తన కష్టాల నర్థంచేసుకోలేని కొడుకు అనుకుని ఊరుకున్నాడు. ఫలితంగా రాము బి. యల్ పరీక్ష ఇచ్చాడు.

ఇంకొక గడ్డుసమస్య వచ్చిపడింది ఆయనకు. రెండో కూతురు సరళ పెళ్ళి చెయ్యాలి. కట్నం ఇవ్వందే కన్య ఇల్లు వెళ్లని రోజుల్లో రఘురామయ్యగారి ఆశంతా కొడుకుమీదే ఉంది. పిల్లవాడికి వచ్చిన డబ్బుతో పిల్ల ఇల్లు వెళ్తుంది లేదా కుంపెమార్పిళ్ళ పద్ధతైనా జరగాలి అనుకున్నాడు. ఒక సంబంధం వచ్చింది. డాక్టరీ చదివే అబ్బాయికి ఒక చెల్లెలు కూడా ఉంది. చక్కగా, నాజూకుగా ఉన్న పిల్లే కాకుండా ఇంటరు కూడా పాసయింది. దీనికి కొడుకు ఒప్పుకోడేమో అన్న అనుమానం కలగను కూడా లేదు. రాముని కదిలించి చూచాడు.

‘నాకూ సరళకూ లంకె పెట్టకండి నాన్నా! ఈ వ్యవహారాలు నాకిష్టమే లేదు.’ - ముహం చిట్లించుకుని కళ్లు విరిచి పుల్లు జవాబు చెప్పాడు.

‘ఎట్లాగోయ్, కాస్త తండ్రి అన్నవాడి కష్టసుఖాలు చూడకపోతే!’

‘నాకంటే సరళ మరీ చిన్నదైతే, లేక నా పెండ్లి ఎప్పుడో అయిపోయి ఉంటే?’

‘కాలేదుగాబట్టే - ఇప్పుడిది తప్పితే చెల్లెలి పెళ్ళెట్లా చేస్తావ్!’ గద్దించాడు తండ్రి.

‘మహారాజులాగ! ఎవ్వరూ అట్టే ఉండిపోరులెండి’ దురుసుగా జవాబు చెప్పి అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. రఘురామయ్యగారికి కొడుకు మనస్తత్వం అవగాహన కాలా. తన్ను కట్నాలు తీసుకోమన లేదుగా! పోనీ, కురూపినీ, ముద్దుమూ తెచ్చి అంటగట్టటం లేదు. చిన్ననాటి నుంచీ పెంచిన తలిదండ్రుల కోసం, ఇంట్లో ఉన్న చెల్లెలికోసమైనా, ఒప్పుకోకపోవడం దురన్యాయమనిపించింది.

తర్వాత సరళకు పెళ్ళయింది. తన ఊహాలకు అనుగుణంగా, ఒక పిల్లను ఏరికోరి కట్టుకున్నాడు రాము. ఆవిడే జానకి. సరళ ఒరువుతీరినా, కొడుకూకోడలూ అనురక్తులుగా ఉన్నా ఆవిడను చూచినప్పుడల్లా మామగారి గుండెలు కలకబారేవి! - జానకి నిజంగా వింత సమస్య అయిపోయింది అతనికి! మొదట మొదట, ఆపిల్లని ద్వేషించాలనీ, అసహ్యించుకోవాలనీ అనుకున్నాడు. కాని తన ఊహకు భార్య కూడా కలిసి రాలేదు. సుభద్రమ్మగారు ఇరుగుపొరుగువారితో, ‘మాజానకి కూతురు కాని కోడలా’ అనడం చాలా సార్లు అతనికి తెలిసినవిషయమే! - జానకి కూడా చిత్రంగామార్చి వేస్తున్నది తన హృదయాన్ని తనకు సంబంధించిన అన్ని పనులూ కోడలే చెయ్యడం మొదలు పెట్టింది!— కూతురనుకుంటూనే కోడలితో తెగరాని సంబంధాన్ని కల్పించుకుంటున్నానేమో అనుకున్నాడు.

3

జానకి రాలా!—ఇంటికి రాగానే కోటువంకెకు తగిలిస్తూ భార్యను ప్రశ్నించాడు రఘురామయ్య—

‘లేదండీ! ఇంకా బస్సు రానట్టుంది! లేటేమో!—’

‘బండి దగ్గరి కెవరన్నా వెళ్లారా!—’

'ఎవరో ఎందుకూ! అబ్బాయికి కాలు నిలిస్తేనా?—ఇద్దరూ ఈ క్షణానికో ఆ క్షణానికో రారూ!—'

రఘురామయ్య మొహం కడుక్కున్నాడు—కాఫీకి పిలిచింది సుభద్రమ్మగారు.

'వాళ్ళు వస్తారుగా! రానీలే!—' భర్త ఇట్లా అనడం సుభద్రమ్మకు బాగా ఆశ్చర్యంవేసింది. సంతోషమో, భ్రమో ఏదో తెలియని భావం ఆవిడలో తొణికిసలాడింది.

పుట్టింటికి వెళ్లిన జానకి ఆ రోజే వస్తున్నది. వాళ్ల నాన్నకు కొంత నలతగా ఉందనీ, కుమార్తెను చూడాలని ఆశపడుతున్నారనీ విన్నాక ఆవిడప్రాణం నిలవలేదు. వచ్చి మూడునెల్లన్నా కాకముందే మళ్లీ ప్రయాణమా అని ప్రాణాలు ఉగ్గపట్టుకుని ఊరుకున్నా, మనస్సులో కలవరాన్ని భర్త పసిపట్టేశాడు. తనకు కూడా చెప్పని రహస్యాలా అని కోపగించుకుని వెళ్లిరానన్నాడు. అత్తమామల అనుజ్ఞతోనే బండెక్కిన జానకి నాలుగోనాడు తిరిగి వస్తున్నది—వెళ్ళిన రోజునుండీ రాముకు కాలం సాఫీగా నడవకపోవడంలో చిత్రం లేదు. కాని మామగారికి కూడా ఆ లోటు కనిపించడంలో కొడుక్కు కూడా ఆశ్చర్యం కలిగింది.

ప్రతిరోజూ కోర్టునుంచి వచ్చిన దగ్గర నుండీ కోడలు ముఖం వందసార్లు కనపడేది. ఆయనకు నీళ్ళూ, కాఫీ ఫలహారం అన్నీ ఆవిడ చేతిమీదుగా వచ్చేవి—మొదట ఆవిడ ఎంతగా నిరసించేవాడో, అంతగా అలవాటు పడ్డాడు. జానకి ఇంటికి వెళ్ళిన మొదటి రోజు సుభద్రమ్మగారు కాఫీ తెచ్చింది.—ఆయన కావేళ ఏదీ రుచించలేదు. దాదాపు ఇరవై అయిదేళ్లుగా అలవాటైన భార్య పరిచర్యలో విముఖత ఈనాడు కలుగుతున్నదా!—హఠాత్తుగా ఆ వేళే కూతుర్ని అత్తవారింటికి పంపించినట్లు ఫీలయ్యాడు—జానకి తన మనస్తత్వంలో ఎంత మార్పు తెచ్చిందో ఆ క్షణంలో అవగాహన అయింది ఆయనకు—

తలుపు కదలిన శబ్దం చెవులవరకూ తాకింది. రఘురామయ్య కళ్లు కన్నాలు చేసుకుని అటు వేపు తిరిగాడు. చిరునవ్వు చిందులాడే ముఖంతో జానకి గుమ్మం లోపలికి వస్తున్నది. మూడు గంటల ప్రయాణంవల్ల వాడిన ముఖంలో కాంతి తిరుమకొస్తున్నట్టుంది. బస్సు దుమ్ము పడడంవల్ల కళ్లు నులుపుకున్నది కాబోలు కాటుక చెంపలవరకూ వచ్చి వింతగా మెరిసింది. తల్లో పువ్వులు కలకలలాడుతూ, ఆవిడ సౌభాగ్యాన్ని చాటుతున్నట్లు నవ్వుతున్నయ్—వచ్చి అత్తగారికి వంగి దణ్ణం పెట్టింది. సుభద్రమ్మ కోడల్ని గుచ్చి కౌగిటిలోకి తీసుకుంటుంటే చూస్తూ కూర్చున్నాడు రఘురామయ్య.

'బాగున్నారా మామయ్యా!'— కాళ్లకు నమస్కరిస్తూనే అడిగింది. ఆయనకు మాట పెగల్లేదు. కళ్లలోమాత్రం వెయ్యి ఆశీర్వాదాల వెలుగులు ప్రవాహాలు కట్టి కోడల్నీ పక్కనున్న కొడుకునీ ముంచెత్తినయ్.

'అన్నయ్య క్షేమమేనా?'—

'ఆ!— ఉత్త గాబరా! - మరీ అంత ఓపలేని ప్రాణమైతే ఎట్లానమ్మా మీ అన్నయ్యకు!—మాటిమాటికీ ఆ తింటి కోడళ్లు పరిగెత్తుకు వస్తారా!'—కిలకిల నవ్వింది.

'వెళ్ళగల శక్తిమంతురాలివి కాబట్టే, మామయ్య కలవరించారు!'— గొణిగాడు రాము.

'ఆ! నీకు లేదూ శక్తి!'

'నేను పోనని చెప్పానుగా!'

గుసగుసలాడుతున్నా ఈ మాటలు స్ఫుటంగా రఘురామయ్య చెవిన పడుతూనే ఉన్నయ్ - 'భార్య ఆ విషయం తనకెప్పుడో చెప్పింది. 'ఆ ప్రయత్నం అబ్బాయి ఎట్లా మానుకున్నదీ ఏమిటి!' అసలా ఘడియనుంచీ కోడలిమీద ప్రేమ పెరిగి వర్ధిల్లిందేమో అని ఆయనసందేహం!

'ఇంట్లోకి పదండి! ఎప్పుడు తిన్నన్నమో! కాఫీ లయింతర్వాత కబుర్లాడుకోవచ్చు!' కోడలు మొహం చూడకుండానే కుర్చీలోంచి లేచి ఈ మాటలంటూ ఆయన లోపలకు వెళ్ళిపోయాడు భార్య సుభద్రమ్మ కవ్వాడు కాఫీలసంగతి జ్ఞాపకం వచ్చింది.!

'మీకోసం ఆయనా ఏమీ పుచ్చుకోలేదర్రా! ఇంకా ఆలస్యమా! పదండి! పదమ్మా కాళ్ళుకడుక్కో. చిన్న దంపతులిద్దరూ ఒకరి మొఖాలు ఒకరు చూచుకున్నారు. తృప్తి మెరిసిన వాళ్ళ కళ్లు ఒకే జతగా శోభించినయ్. ★

దూరపుకొండలు నునుపు

ఆఫీసువర్కూ, హెడ్ గుమాస్తా వాంగారూ, నడుము ఒక్కిరిబిక్కిరియై వేడెక్కిన మెదడుతోను, అలసిన శరీరంతోను ఇల్లు చేరుకున్నాడు గోపాలం. మెట్లెక్కుతూ కటాలున ఆగిపోయాడు. లోపల్నుండి పాటలు, నవ్వులు వినవచ్చాయి. బాబు పాడుతున్నాడు గట్టిగా. 'గోపాలం, చిన్న నాన్న-గోలపత్తి కేశావా-లెమ్మంటె లేవేమి. లేకుంటే నాకేమి' అంటూ చిట్టి భోం! భోం! అంటోంది. గోపాలం పెదవులపై చిరునవ్వు మెరసింది. అతని శరీరపు బడలికంతా ఎటో మాయమై హృదయం ఉల్లాసపూరితమైంది. లోపలికి వెళ్లగానే బాబు నాన్నని చూసి పాట ఆపి సిగ్గుతో బియ్యమేరుతున్న తల్లివొడిలో దాగాడు. బొమ్మలపెళ్లి చేస్తున్న చిట్టి బొమ్మలో మూల పారవేసి నాన్నారూ! అంటూ గోపాలం దగ్గరకి ఒక్క గెంతు గెంతింది. 'మీరు రాగానే బాబు చూశారా, పాట మానేసి ఎలా దాక్కున్నాడో,' అంటూ శాంత చిరునవ్వు ముఖంతో లేచి వంటింట్లోకి వెళ్లింది కాఫీ తెచ్చేందుకు.

గోపాలం కాఫీతాగి పడకకుర్చీలో జారబడి కూర్చుంటే చిట్టి, బాబు చేరి ఏవేవో కబుర్లు చెప్పసాగేరు. చిట్టి, మాటిమాటికి సిల్కుగౌను సంగతి జ్ఞాపకం చేయసాగింది తండ్రికి. శాంత రాగానే 'రామం ఉత్తరం వ్రాసేడు. ఈ ఊరు ట్రాన్సఫర్ అయి వస్తున్నాట్ట' అన్నాడు గోపాలం కవరు పైకి తీస్తూ. తరువాత చాలసేపటివరకు ఇరువురూ రామారావు విషయమే మాట్లాడుకున్నారు. రామారావు బి. ఏ. లో గోపాలం క్లాసుమేటు. స్వతహాగా తెలివితేటలు లేకపోయినా కాసుల ప్రభావంవల్ల పరీక్షలు గెలుపొంది పెద్దపెద్దవాళ్ల సహకారంవల్లా, లక్ష్మీ ప్రభావంవల్లా అచిరకాలంలోనే గొప్ప ఆఫీసరై కూర్చున్నాడు. మంచి పలుకుబడి, ఆస్తి, ఇళ్లు సంపాదించాడు. ఇక గోపాలం సామాన్య మానవుడు. *Studies* లో ఎంత గొప్ప తెలివితేటలు ప్రదర్శించినా రామంలాగే తానూ పాసయ్యాడు. అతి కష్టం మీద క్లార్కు ఉద్యోగంలో ప్రవేశించి 80 రూ॥ జీతం మీద భార్య, ఇరువురు పిల్లల తన యొక్క జీవన భారాన్ని మోస్తున్నాడు. జీవితయాత్రలో అడుగడుక్కీ ఎదురయ్యే కష్టాల్ని అవాంతరాల్ని ఎదుర్కోలేక సతమతమవుతూ జీవితంమీద విసిగిపోతూ తన్ను తాను నిందించుకుంటుంటాడు. కాని క్షమాస్వరూపిణి శాంత, అతని నీరస హృదయాన్ని ఉల్లాసపరచే చంద్రికాజ్యోతి. అతని చీకటిహృదయాన్ని ప్రకాశింపజేసే ఆశాకిరణాలు చిట్టీ బాబులు. రాత్రి పదకొండు గంటలకి మెలకువ వచ్చి శాంత లేచేసరికి గోపాలం ఇంకా మేలుకొనేఉండి ఏదో ఆలోచిస్తూ కూర్చునున్నాడు. దగ్గరకెళ్లి 'ఏమిటి అలా కూర్చున్నారు? నిద్రపోలేదా? అని అడిగింది. గోపాలం మాట్లాడలేదు. శాంత మళ్లా 'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అని అడిగింది. గోపాలం నిట్టూర్పు విడిచి ఏముంది. రాము ఎంత అదృష్టవంతుడు. ఎవరికోగాని అలాంటి సుఖజీవితం రాదు. జీవితంలో కావలసినవన్నీ వాడికి లభించేయి రాములాంటివాళ్లకి బియ్యం కుంచం ఎన్ని రూపాయలయినా లెక్క లేదు. బట్టలెంత ఖరీదయినా భయం లేదు. జీవితమంటే అలాంటివాళ్లదే. నేనూ వాళ్ళలా జీవించిఉన్నవాణ్ణే. రేపు జీతం అందుతుంది. ఇంటివాడికి, పాలవానికి, చాకలికి, షావుకారుకి బియ్యానికి పోను మిగిలేదేముంది? చిట్టికి సిల్కుగౌను కూడ కొనలేని నాకూ పిల్లలూ, సంసారం. అబ్బా! అని బాధగా మూలిగాడు. అతని హృదయంలో ఏదో సంకుల సమరం జరుగుతున్నట్లుగా వుంది. ఆ హృదయ వేదనంతా అతని ముఖంలో ప్రతిఫలమవుతూంది. గోపాలం అన్నమాటలు విని శాంత నిట్టూర్పు విడిచింది. భర్త తలపై చేయిపెట్టి నిమురుతూ 'మీరెందుకలా విచారపడుతుంటారు? చిట్టికి గౌను సిల్కుది లేకపోతే ఏంకొంప మునిగింది? భగవంతుడు మనకిచ్చిందేదో మనకిచ్చాడు. ఉన్నదానితోనే సరిపుచ్చుకొని మన జీవితాలని గడపాలి. ఎవరో సుఖపడిపోతున్నారని మనకు లేదని చింతిస్తూంటే మన జీవితాలు మరింత దుర్భరమవుతాయి. సంతోషం లేశమయినా లేకుండా కృశించిపోతాము. మన కెదురుగా కనపడే మానవులు ధరించే విలువయిన సూట్లవల్లా—ఖరీదయిన చీరలవల్లా, వాళ్లు తిరిగే కార్లవల్లా వాళ్ల విలువల్ని—సంతోషాన్ని మనం కనిపెట్టలేం. వాళ్ల పై వేషాల్నిబట్టి వాళ్లు సంతోషజీవులని అనుకోకూడదు. పైకి ఎంత డాంబికంగా, సంతోషంగా, మోదాలో తిరుగుతూన్నా వాళ్ళ ఆంతరంగికజీవితం విచారాలతోను, అశాంతితోను నిండిఉంటుంది. నిజానికి ఆలోచిస్తే వాళ్ళకన్న మనలాంటి సామాన్య జీవితాలే ఎన్నో వేలరెట్లు నయం. దూరానికి కొండలు ఎంతో నునుపుగా అందంగా కనపడతాయి. దగ్గరకెళ్లి చూస్తే వాటి నిజస్వరూపం ఎంత భయంకరంగా ఉంటుందో గోచరిస్తుంది.' అంటూంటే

> ఉన్నదానితోనే సరిపుచ్చుకొని జీవితం గడపాలి. ఎవరో సుఖపడిపోతున్నారనీ మనకు లేదనీ చింతిస్తుంటే జీవితం ఎలాగడుస్తుంది?

ప్రేమలీల

శాంత గొంతుక దుఃఖంతో వణకింది. చిట్టి నిద్రలోనుండి లేచి 'అమ్మా' అని పిలచింది. శాంత చటుక్కున లేచి 'లేవండి. ఇక పడుకోండి. పిచ్చి పిచ్చి ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోకండి.' అని చిరునవ్వుముఖంతో అతని ముఖాన్ని తనవైపు తిప్పుకుంది. ఆ మందహాస వదనం అతని ఉన్మత్త హృదయాన్ని ఏ అమృత రస వీధుల్లోకో గొనిపోయింది. రామారావు ఆ ఊరు వచ్చి వారంరోజులయినా, గోపాలానికి ఆఫీసుపనివల్లా, రామారావు కీయబడే సన్మానాలు, స్వాగతాల మీటింగుల వల్లా స్నేహితుని కలుసుకొనే అవకాశం కలగలేదు. అప్పుడప్పుడు మీటింగుల్లో కలసికొనినా తీరిగ్గా మాట్లాడేందుకు వీలవలేదు. సొసైటీలో రామారావుకు గల స్థానాన్ని అతనికీయబడే గౌరవాన్ని - అతను కనపరచే హోదాను - తిరిగే కారువంకా విస్తుపోయి చూచేవాడు గోపాలం. అనుకోకుండానే అతని పెదవులనుండి 'అదృష్టవంతుడు' అనే పదం దానంతటదే దొర్లుకుంటూ వచ్చేది. ఆవేళ సాయంకాలం గోపాలం తీరుబడి చేసుకొని రామారావింటికి బయలుదేరాడు. అతని హృదయమేమీ నెమ్మదిగా లేదు. బాబుకి కొస్త జ్వరం వచ్చింది. అంతవరకూ బాబు దగ్గర కూర్చొని కాస్సేపు స్నేహితునితో గడపాలని బయలుదేరాడు. రామారావు బంగళా సమీపించే సరికి అప్పుడే డాక్టరు గేట్లోనుండి బయటికొచ్చి కారెక్కుతున్నాడు. 'ఎవరికి జబ్బుగా ఉందో' అనుకుంటూ, గోపాలం లోపలి కెళ్ళేటప్పటికి ఆఫీసురూంలోనుండి బయటికొస్తున్న రామారావు ఎదురై స్నేహితునితో మళ్లా లోపలికి వెళ్లాడు. ఇల్లంతా ఏ ఇరవై పాతికమంది మనుష్యులతోనో నిండి పిల్లల గోలలు ఏడుపులతోను, ఆడవాళ్ల కేకలతోను నిండి సందడిగా ఉంది. 'అంత గోలల్లో ఆఫీసు పని ఎలా చూస్తున్నాడా' అని ఆశ్చర్యం వేసింది గోపాలానికి. లోపల్నుండి చంటి పిల్ల ఏడుపు గట్టిగా వినిపించింది. గోపాలం రామం వంక తిరిగి 'జబ్బు చేసిందేమిటి రామం ఎవరికయినా? డాక్టరు వచ్చాడు' అన్నాడు. రామారావు నిట్టూర్పు విడిచాడు. 'నీకిది ఈ వేళ క్రొత్తగా ఉంది కాబోలురా గోపీ, నాకు మామూలే. మా ఇంటికి డాక్టరు రాని రోజు లేదు. మందు వాడని గంట లేదురా. ఇందిర బొత్తిగా రోగిష్టిదయింది. ప్రతి నెలా ఏ జబ్బో, నీర్సమో. ఇహ ఉన్న వాళ్లంతా తిని పెట్టేవాళ్ళేగాని ఏడుస్తున్న పిల్లల్ని కొస్తయినా చేరదీయరు. అంతా నేనే చూచుకోవాలి' అంటూ ఒసే అప్పీ అమ్మాయినిట్లా తీసుకురావే! అన్నాడు...అంతసేపటివరకూ ఇంటి పెంకు లెగిరిపోయేలా గోల పెట్టిన పిల్ల తండ్రి బుజమెక్కగనే ఊరుకుంది ఏడుపు మాని.

అంతలో ఎవరో సూటువాలా వాళ్ళ ముందునుంచే బయటకెళ్లాడు. వామం అతన్ని చూపిస్తూ 'మా మూడో బావమరిది. వ్యాపారంలో నష్టం కల్గిందంటూ మూడు వేలు రొక్కం తక్షణం సహాయం చేయాలని వచ్చి కూచున్నాడు. దానికోసం ప్రయత్నిస్తున్నాను అన్నాడు. స్నేహితులిరువురూ అలా మాట్లాడుకొంటూండగనే సందె చీకట్లు నలువైపుల వ్యాపించాయి. గోపాలం స్నేహితుడి దగ్గర సెలవు తీసికొని ఇంటి ముఖం పట్టాడు. అతని హృదయంలో ఏవేవో ఆలోచనలు బయలుదేరాయి. గొప్ప వాళ్లకి ఎన్ని కష్టాలు, రోగాలు వచ్చినా వాళ్లు తట్టుకొని నిలుస్తారు. ఆ శక్తి వాళ్లకుంది. తనలాంటి వాళ్ళకే అలాంటివి వస్తే...? బాబుకి జ్వరంగా ఉంది ఎలా ఉందో అనే ఆదుర్దాతో గోపాలం ఇంటిలో ప్రవేశించాడు. కిల కిలలాడుతూ ఆడుకుంటున్న బాబు, చిట్టీలని చూడగానే 'అమ్మయ్య' అనుకున్నాడు ప్రశాంత హృదయంతో. ఆవేళ ఆదివారం. గోపాలంకి ఆఫీసు పని లేదు. ఆవేళే చిట్టి పుట్టిన రోజు. శాంత ఏవేవో పిండి వంటలు రెండు మూడు చేసింది. భోజనాలయిన తర్వాత అంతా హాల్లో కూర్చున్నారు. బాబు వింత వింత చేష్టలకి పాటలకి శాంత, గోపాలం విరగబడి నవ్వుతూన్నారు చిట్టి నాన్న గార్కి డాన్సు చేసి చూపిస్తోంది. అక్క చేస్తోందని బాబు కూడా చేతులు తిప్పుతూ తిరగ సాగాడు. అది చూచి శాంత, గోపాలంలు నవ్వాపుకోలేక విరగబడి నవ్వసాగేరు. ఇంతలో 'గోపాలం' అని పిలుస్తూనే రామారావు లోపలికి వచ్చాడు. అతన్ని చూచి శాంత లోపలికి వెళ్లిపోయింది. చిట్టి, బాబు ఆట మానేసి రామారావు కేసి చూడసాగేరు గోపాలం చిరునవ్వుతో రామారావు నాహ్వానించి కూర్చోబెట్టాడు. చిట్టి రామారావువంక ఒక నిముషం చూచి 'నమస్కారమండి' అని నమస్కారం పెట్టి లోపలికి పారిపోతూంటే బాబు కూడ చేతులు జోడించి 'నమత్కాలం' అని తుర్రున పారిపోయేడు. రామారావు చిరునవ్వుతో వాళ్లు పోయినదెస చూడసాగేడు. "చాలా సంతోషం రామం, మాయింటికి వచ్చినందుకు" అన్నాడు గోపాలం. రామారావు తన దృష్టి గోపాలంమీదికి మరల్చుకొని 'అరగంటనుండే బయట చాటుగా నించొని మీ సంతోషాన్ని చూస్తున్నానురా. ఇక పట్టలేక వచ్చేశాను. మనస్సంతా చీకాకుగా ఉందని నీతో కాస్సేపు గడుపుదామని వచ్చానురా. నాలోని చీకాకంతా ఏమూలకో ఎగిరిపోయిందిరా గోపీ! నిజంగా నీవెంత అదృష్టవంతుడివి. ఎవరికోగాని ఇలాంటి అదృష్టం దొరకదు దేనికయినా పెట్టిపుట్టాలి' అంటూ నిట్టూర్పు విడిచాడు. అతని హృదయంలో ఏదో పెద్ద కల్లోలం బయలుదేరింది. ముఖం వివర్ణమై పోయింది. గోపాలం రామువంక తెల్లబోయి చూశాడు. 'అదేమిటి రామం! అలా అంటావు. నీకన్న అదృష్టవంతు డెవరుంటారు? నివే అలాఅంటే మాలాంటి సామాన్యుల గతేమిటి? నీకేం రామం సుఖమయిన, ఏచీకూ చింతా, నిత్యావసరాల బాదరబందీ లేని జీవితం. నేనా అదృష్టవంతుణ్ణి ...' అన్నాడు గోపాలం. రామారావు ఇంకా వేడి నిట్టూర్పులు విడుస్తూనే ఉన్నాడు. 'పిచ్చిగోపీ, నీవేదో ఊహిస్తున్నావు, నేనేదో సుఖపడిపోతున్నానని, జీవితంలో ఏ విచారమూ నా కంటదని!' అది వట్టి భ్రమ మాత్రమే. నాది వొట్టి రసహీనమయిన, సంతోషరహితమయిన మొద్దువారిన జీవితం. సంతో

కుమంటే, హృదయానందమంటే ఏమో ఎరగని మొరటువారిన జీవితంనాది. నాలో మానవత్వమే లేదు. తెరిపిలేని ఆఫీసుగొడవల్లోనూ, రోగిష్టి భార్యతోను, పిల్లల గోలల్లోను, పీల్చుకుతినే బంధువుల్లోను, నాజీవిత దినాలు గడిచిపోతున్నాయి. ఒక్క సంతోషంలేదు ఒక్క ఆనందంలేదు. ఆ గోలల మధ్య ఎలా ఉంటున్నానో నాకే అర్థంకాదు. ఆ నిస్పృహ జీవితానికి అలవాటయిపోయిన యంత్రాన్ని. నీలాంటి, ప్రతివాళ్లు అనుకుంటారు రామంలాంటి అదృష్టవంతుడు లేడని. నే ననుకుంటుంటాను, 'భగవంతుడా! పగవాళ్లకయినా ఇలాంటి జీవితం వొద్దని.' హృదయంలో ఎంత విచారమున్నా పైకిమాత్రం ఆడంబరంగా తిరుగుతుంటుంటాను. లేకపోతే ఈ సొసైటీలో ఎలా తిరగడం? నాహోదాని నాపై వేషాన్ని చూచి నీవేదో ఊహిస్తున్నావ్ గోపీ. నిజమయిన సంతోషాన్ని, సుఖజీవితాన్ని ఈ వేళ నేను ప్రత్యక్షంగా చూచాను, అనుభవించాను.' రామారావు ఊరికే ఆయాసపడుతున్నాడు. గోపాలం అతని వాక్ప్రవాహాన్ని ఏ విధంగానూ నివారించ లేకపోయాడు. 'ఇలాంటి సుఖంకోసం, సంతోషంకోసం శాంతివంతమైన జీవితం కొరకు నా హృదయ మూరికే తపిస్తూంటుంది. నేనెంతగా దాన్ని కోరుతున్నానో అంతగా ఊపిరి తిరగని రొంపిలో రోజురోజుకూ దిగబడిపోతున్నా. 'బయటంతా ఆడంబరం, అధికారం, హోదా, వ్యవహారాలు. ఇంట్లో రోగాలు, ఏడుపులు, గోలలు. రాబందుల్లా పీల్చుకుతినే బంధువులు. వీటి మధ్య నాజీవితం నలిగిపోతూ మానవత్వాన్నే గోల్పోయిన యంత్రంలా అయిందిరా గోపీ' అని రామం నిస్పృహతో అంటూంటే గోపాలానికి ఒకనాటి రాత్రి తను తన దురదృష్టానికి చింతిస్తూంటే వణికే గొంతుకతో శాంత 'మనుష్యుల పై వేషాల్ని బట్టి ఎప్పుడూ వాళ్ల విలువల్ని-సుఖాల్ని కనిపెట్టలేం. దూరానికి కొండలు నునుపుగా అందంగా కనపడతాయి. దగ్గరికెళ్లి చూస్తే వాటి నిజాకృతి ఎంత భయంకరంగా ఉంటుందో గోచరిస్తుంది' అన్న వాక్యాలు చెవుల్లో మారుమ్రోగసాగేయి మళ్లీ మళ్లీ. ఇంతలో చిట్టి లోపల్నుండి కాఫీ తెచ్చి ఇరువురికి ఇచ్చింది. రామారావువలె గోపాలం హృదయంలో కూడ ఏదో మహా కలవరం బయలు దేరింది. రామం కేసి ఊరికే తేరి పార చూడసాగేడు. శాంత అన్న మాటలు పదే పదే అతని చెవుల్లో వినబడసాగేయి.

తన ఇంట్లో ఉన్న స్వర్గాన్ని జీవితంలో ఉన్న సంతోషాన్ని ఈ నాడు తాను అర్థంచేసికో గలుగుతున్నాడు. తన జీవితంలోని శాంతిని-ఆనందాన్ని గుర్తించుకో కుండా ఇన్నాళ్లూ తన దురదృష్టాన్ని గూర్చి చింతిస్తూ ఎవరో సుఖపడి పోతున్నారని, తనకా అదృష్టం లేదని పిచ్చి భ్రమతో హృదయాన్ని అసంతుష్టితో నింపుకొని నిట్టూర్పులు విడిచేవాడు. 'ఇహ వెళ్లొస్తానురా గోపీ! చాలా పనులున్నాయి. ఏరీ, నీ పిల్లలు?' అని రామం లేచాడు. గోపాలం ఊహాప్రపంచంలో నుండి తుళ్లిపడి లేచి 'చిట్టీ!' అని పిలచాడు. పిల్లలిరువురూ రాగానే ఇద్దరినీ ఎత్తుకొని ముద్దు పెట్టుకొని దించాడు రామారావు. 'అరే! గోపీ, వెడతానురా ఇహ' అంటూ సైకిల్ ఎక్కాడు. గోపాలం రామం కనిపించే వరకు అలాగేచూస్తూ నుంచున్నాడు. రామారావు దారిలో ఎవరెవరో పెడుతున్న నమస్కారాలు అందుకుంటూ చిరునవ్వుతో ఆంతరంగిక వేదనని కప్పుకుంటూ పోతున్నాడు. గోపాలానికి స్నేహితుని నిస్పృహమయిన భారమైన జీవితంపై జాలి సానుభూతి కలిగాయి. హృదయానికి సంతోషం కలిగించలేని సంపదలు అధికారాలు, ఆడంబరాలు మరి దేనికి? కర్తవ్యాల నడుమ, బాధ్యతల మధ్య నిర్జీవమైన జీవితాన్ని దొర్లిస్తున్న నిరాశాజీవి రామారావు. 'ఏమిటి చూస్తున్నారు. మీ, స్నేహితుడు వెళ్లిపోయారా?' అని శాంత గొంతు వినిపించేసరికి గోపాలం జాగ్రదవస్థలోకి వచ్చి వెనుదిరిగి చూసేడు. చిరునవ్వుతో శాంత అతనివంక చూస్తూ నుంచుంది. ఆ అరుణకాంతిలో ఆమె వదనం ఎంత సౌందర్యాన్ని విరజిమ్ముతూంది. గోపాలం ఆమె కళ్ళల్లోకి చూస్తూ 'శాంతా! ఆనాడు అన్నావు చూశావా! 'దూరానికి కొండలు నునుపుగానే ఉంటాయి, దగ్గరి కెళ్లితే వాటి నిజస్వరూపం బయల్పడుతుందని.' ఆ వాక్యంయొక్క నగ్నసత్యాన్ని ఈనాడు రామం జీవితంవల్ల గ్రహించాను. నిజమయిన సంతోషం, ఆనందం, సుఖాన్ని-అవి ఎలా వస్తాయో ఈనాడు గ్రహించాను. అర్థంచేసికొన్నాను. 'నా మార్గజ్యోతివి నీవు' అంటూంటే, చిట్టి, బాబు అమ్మా! అంటూ గరుగెత్తుకొని వచ్చారు. శాంత, గోపాలంలు వాళ్లవైపు చూచేరు. వాళ్ళ పసిచేతుల్లో ఏదో పదిరూపాయిల నోటూ ఉంది. 'అమ్మా! ఇందాక వచ్చినాయన ఇచ్చారే మేము సినిమాపేపరు కోసం వెళుతూంటే' అంది చిట్టి. శాంతా గోపాలంలు అప్రయత్నంగా ఒకరి మొహం మరొకరు చూచుకొన్నారు.

ఆ సంధెచీకట్లో తులసికోట దగ్గర శాంత ఉంచిన దీపం దివ్యంగా ప్రకాశిస్తూ వింత కాంతుల్ని చిమ్ముతూంది. ★

నాటిక:

నందివర్ధనం పువ్వు

[మొగ పెళ్లి వారు బస్సు దిగి స్వగృహం చేరి పది నిముషాలవుతుంది. పెద్దకోడలు, చిన్న కోడలు, కూతురు ఒకచోట చేరేరు.]

పెద్ద కోడలు: 'దూరపు కొండలు నునుపు' అని ఊరికే అన్నారా పెద్దలు! 'వేసేవి పులిగురకలు మేసేవి గడ్డి పరకలు' అని ఎవరికి తెలుసు? చాల్చాలు పెళ్ళి సరదా తీరిపోయింది!

కూతురు: 'నిజమాడితే నిష్ఠూరం' గాని పెళ్ళి. 'గొడ్డుదానికేం తెలుసు బిడ్డలతీపి' అని అనుభవంలేంది లేనట్టు ఊరుకుందా! 'గడ్డి వేషానికి గడ్డం మీసం తీయించాడ'ని ఎంత అల్లరి చెయ్యాలో అంతా చేసి...

చిన్న కోడలు: అయినా ఆడ పెళ్ళివారని చెయి లోకువగా ఉండకుండా మొగుడ్ని కొట్టి మొగసాల ఎక్కిందని మీద మీదకు వస్తేనూ? పెట్టిందీ లేదు చేసిందీ లేదు. 'ఒట్టిగేదికి అరుపు లెక్కువ'ని ఊరికే అన్నారా? ఉండండి, మామగారొస్తున్నట్టున్నారు.

కూతురు: ఛ! ఎంత మాటన్నావ్! ఆవిడ నలుగురిలోనూ పడి అయిన వాళ్లకు ఆకుల్లోనూ కాని వాళ్ళకు కంచాల్లోనూ పెట్టి' ఎలా చేసినా 'ఇంత బతుకూ బతికి యింటి వెనకాల చచ్చినట్టు మనం అలా వేలెత్తి చూపనిస్తామా? ఏవమ్మా పెద్ద వదినా, అన్ని సామాన్లూ వచ్చినట్టేనా?

పెద్ద కోడలు: నేను వెళ్ళేటప్పుడు అన్నీ లెఖ్ఖ పెట్టేనమ్మా! (ఏడుస్తున్న కొడుకుతో) వెధవ! 'తిండికి తిమ్మరాజు.. పనికి పోతురాజు'ను పోయి ఆడుకో...

లేదమ్మా అక్కా!

పెద్దకోడలు: వదినా, 'అనుమానం పెనుభూతం' అన్నారు. ఒక చిన్న అనుమానముంది. అడుగుతా, మరోలా అనుకోరుగదా?

కూతురు: అయ్యో, 'ముసుగులో గుద్దులాటా, చీకట్లో చిందులాటా ఎందుకు?' అడుగు. దానికేమిటి?

పెద్దకోడలు: అబ్బే, ఏమీ లేదు. 'చల్లకొచ్చి ముంత దాచడ మెందుకు?' మీ వంటావిడ గురించే 'చవగ్గా వచ్చిందని మాఘ పెళ్లాన్ని పెళ్లాడే'డని యీవిడ ఎక్కడ దొరికింది మీకు?

కూతురు: బాగుందిహ్మోయ్. చవగ్గా ఎక్కడ దొరికింది? 'సజ్జం సుద్దేనయినా దాశాకి లోటు లేద'ని నెలా తిరక్క ముందే ముప్పై అక్కడ పెట్టవలసిందే!

పెద్దకోడలు: అబ్బ, అది కాదమ్మా! 'అల్లం ఉందా కోమిటి? అంటే బెల్లం వుంద'న్నట్టు ఒకటడిగితే ఒకటి చెబుతారేం మొగుడూ పోయి, వయసూ యించుమించు మళ్ళినా 'చింత చచ్చినా పులుపు చావలే'దన్నట్టు యింకా యీవిడకీ షోకులు వదలలేదే, 'కళ్ళు తెరుచుకు గంగలో దిగినట్టు' చూస్తూ, చూస్తూ యీవిడ్ని మీ రెలా పెట్టుకున్నారని?

కూతురు: బాగుందమ్మా! మన బంగారం మంచిదికానప్పుడు కంసాలిని అనేం లాభం? మనకు చేతకానప్పుడేం చేస్తాం మరి? 'వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నా'డని అవసరం కొద్దీ అనేకం చెయ్యవలసి వస్తుంది. మా అమ్మ 'మూలుగులు మునపట్లాగా, భోజనాలు ఎప్పట్లాగా' అన్నట్టు ఎన్ని మందులిప్పించినా ఒళ్లలా ఉంది. ఎంత వెతికినా యిది తప్ప మరొకరు దొరికేలా లేరు. 'ఏమీ లేనిచోట ఆముదపు చెట్టే మహావృక్షం' అని దీన్ని తెచ్చుకు పెట్టుకున్నాం. 'పత్యపు నోటికి పచ్చడిబద్దే పరవాన్నం!' ఏం చేస్తాం మరి?

పెద్దకోడలు: నిజమే. 'కరువులో అధిక మాసమని' యీ వంట వాళ్ళుకూడా కరువైపోయారు. 'ఆ బోతుల్లో గేదె శ్రీ మహాలక్ష్మి' ఎవరూ లేనప్పుడు ఏం చేస్తారు?

కూతురు: లేకపోతే 'శతకోటి జంగాల్లో బోడి జంగాన్ని నే నెరుగుదునా?' అని యిది తప్ప మరొకరు దొరుకుతేదీని అవసరమే ఏమిటమ్మా? 'గతి లేనమ్మకు గంజే పానకం' అనుకుని చేయించుకుంటున్నాం.

చిన్నకోడలు: అయినా 'కుక్కజూచి సామి కొలుచుట నేర్చుకో' అని దాని వంట బాగుందా లేదా అన్నది కావాలి గాని.. ఆ వ్యక్తిలో ఉన్న మంచి చూడాలి గాని ఎంతసేపూ 'ఆత్మ స్తుతీ, పరనిందా' అయితే ఎలాగ? ఏదో వండుతూందా లేదా? ఎవరూ లేనప్పుడు ఏం చేస్తాం మరి? 'కొండ ముచ్చుల్లో కోటి రంభ.'

కూతురు: సరేలే, ఎందుకొచ్చిన కబుర్లు మా నాన్న వింటే విసుక్కుంటారు. ఏవమ్మా సుబ్బమ్మా? ఇంకా మడి గట్టుకో లేదా?

[వంటింటి వైపు వెడుతుంది. కోడళ్ళు అనుసరిస్తారు.]

ఛీ! 'మంచి మనిషి కొకమాట, మంచి పశువు కొకదెబ్బ' ఓసారి చెబుతే చాలదూ? 'మనుసు లెన్ని చెప్పె నామాయ పక్కలో నే అని' నీకెన్ని మార్లు చెప్పినా పదిదాటుతే గాని మడి గట్టుకోవా ఏమిటి?

సుబ్బమ్మ: ఎందుకమ్మా, 'చస్తాంటే సంధి మంత్రమని' సామ్మ పోయి నే నేడుస్తూ ఉంటే అలా అంటారు?

చిన్నకోడలు: అదేమిటే, ఓహో అదా 'చుట్టూ తిరిగిరావే నా చిట్టితల్లీ' అని 'మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు' ఆ దురదృష్టం నిన్నే చుట్టుకుందా? పోయిన పెట్టె మీదేనా ఏమిటి?

సుబ్బమ్మ: అవునమ్మా, దిక్కుమాలిన మరుపు. 'పెద్దింటి సొమ్ము, పెద్ద చెరువు నీరు, ఏమయినా బాధ లేదని మాలాంటి వారికి ఒకటి పోయినా...

కూతురు: అదేం మాటలే. 'ఎంత చెట్టు కంత గాలి' ఎవరికి తగ్గ ఖర్చులు వారికున్నాయి అయినా 'చెట్టుకి కాయలు బరువా?' నీకున్న ఆ ఒక్క పెట్టె వదిలేసి చక్కా వచ్చావుటమ్మా? ఒకవేళ పెళ్లివారింట్లో వదిలేశావేమో!

సుబ్బమ్మ: ఏమో తల్లీ! అంత అదృష్టమా? 'దురదృష్టవంతుల్ని బాగుచేసేవాడూ లేడు, అదృష్టవంతుల్ని పాడు చేసేవాడూ లేడు!' అయినా దిక్కుమాలిన మరుపు! 'పుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదని' నే చచ్చేదాకా యీ మరుపు నన్ను వదలేలా లేదు తీసుకొచ్చినట్టే జ్ఞాపకం. ఇక్కడా అక్కడా లేక 'గొందిటికి చెడ్డ రేవడి'లా ఎక్కడపడిపోయిందో! ఇంతకీ 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అన్నారు. రాధాస్వామి.

[అల్లుడు వచ్చి]

అల్లుడు: ఏమిటర్రా? 'అడుగులో నే పిడుగుబడ్డట్టు' ఏం జరిగిందేమిటి?

కూతురు: సా—రే! 'రెడ్డొచ్చె మొదలాడమన్నారు' సుబ్బమ్మగారి పెట్టెటండీ పోయిందిట.

అల్లుడు: అయ్యో! పాపం ఆవిడ అన్నిటికీ కంట తడిపెడుతూనే ఉంటుంది. 'గోరు చుట్టు మీద రోకలి పోటులా' ఇదొకటి కాబోలు. పాపం, ఎక్కడ పోయిందమ్మా?

సుబ్బమ్మ: 'ఆయనుంటే మంగలెందుకని' ఎక్కడ పోయిందో తెలుస్తే ఈ బాధ దేనికి నాయనా? ఇంతకీ 'బుద్ధిః కర్మానుసారిణీ' అన్నారు. ఎక్కడవదలేశానో!

అల్లుడు: 'కన్నెర్రగా ఉన్నా, మిన్నెర్రగా వున్నా నీళ్ళు తప్ప వంటూరు.'

పాపం, సుబ్బమ్మగారికి ఏ సుఖమూ లేకుండా వస్తూన్నట్టుంది. అదృష్టం! పిలిస్తే పలుకుతుందిగదా.

కూతురు : బాగుందండీ! 'దురదున్నవాళ్ళు గోక్కుంటారు, దుఃఖమున్నవాళ్ళు ఏడుస్తారు' ఆవిడ కెంత కష్టంగా ఉందో ఏమిటో! 'మోసే వాడికి గాని కావిడి బరువు తెలుస్తుందా?' సొమ్ము పోయి ఆవిడేడుస్తూంటే, 'నిప్పు మీద ఉప్పేసినట్టు' మీ పరిహాసాలేమిటి?

సుబ్బమ్మ : బాగుందమ్మా! 'పిల్లికి చెలగాటమూ ఎలక్కి ప్రాణ సంకటమూను! అయినా 'మొగుడు కొట్టేడని ఏడవక తోటికోడలు నవ్విందని ఏడవడ మెందుకులే?' ఇంతకీ 'నుదుట రాసిన రాత నూరేళ్ళు చింతించినా తప్పదుగదా!'

చిన్న కోడలు : అక్కడ తిండీ తిప్పలూ లేక నానా అవస్థలూ పడి యిక్కడికొచ్చాం. 'పండుగనాడూ పాత మొగుడేనా' అని యిక్కడా యీ అల్లరేనా?'

కూతురు : 'పరిగెత్తి పాలు తాగే కన్నా నిలబడి నీళ్లు తాగమన్నార'ని యిల్లు చేరుకున్నాం యింత చారూ అన్నం తిందామని. 'స్వర్గానికెళ్ళినా సవితిపోరు తప్పలేదని' యిల్లు చేరుకున్నా యీ అల్లరేనా? 'ఉభయ భ్రష్టత్వం, ఉపరి సన్యాసం' అన్నట్లయింది మనపని! ఇంతకీ పెట్టె ఏమైందో ఏమిటో!

సుబ్బమ్మ! ఏమైందో మరి? వాళ్ళింట్లోనూ లేక మనింట్లోనూ లేక ఏమయింది! 'అంతా వైష్ణవులే అయితే గంపెడు రొయ్యలూ ఏమైనట్టు?'

పెద్దకోడలు : బాగుందమ్మోయ్! మామీద దొంగతనం కట్టడం ఒకటా? 'వెయ్యాకవెయ్యాక కన్నమేస్తే మంగలం దొరికిందని' నీ పెట్టే దొంగలించాలా? సరే, అయిందేదో అయింది పిల్లలు గోలెడుతున్నారు. లేచిపదండి.

సుబ్బమ్మ : ఏం వండనమ్మా? 'ఇనుము విరుగుతే అతుక్కుంటుందిగాని మనసు విరిగితే అతుక్కోదుగదా?'

చిన్నకోడలు : బాగుందమ్మా! పెట్టె పోతే అంత హడావిడిచేస్తా వేమిటి! ఇంతకన్న పెద్దపెద్ద సామానులే, వెండిబంగారాలే పోయినవాళ్ళున్నారు. 'కందకిలేని దురద బచ్చలికెందుకని' వాళ్ళకైనా లేని బాధంతా నీకు చుట్టుకున్నట్టుం దేమిటి? చాల్చాలులే. లే. 'గోళ్ళతో మీటే దాన్ని గొడ్డళ్ళదాకా రానిస్తా వెందుకూ? ఊఁ లే!

పెద్దకోడలు : అయ్యో! మా మరిదిగారు మడిగట్టుకున్నట్టున్నారు. 'ఆలూ లేదు, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగమని' ఆయన రావడమెలా ఉందో, బెల్లంకొట్టిన రాయిలా ఈవిడ కదలకపోడమూ అలాగే ఉంది లేవమ్మా! వెళ్ళవమ్మా! 'తనకు తోచదు ఒకరుచెప్తే వినదు' అన్నట్టుంది మీ తంతు. మీ పెట్టెఖరీదెంతో మామగారు యిచ్చేస్తారు లేవమ్మా! 'అమ్మపెట్టే నాలుగూ పెట్టేదాకా అబ్బాయికి అన్నం సయించలేదుట.' మామగారు వచ్చి యింకా మీరు మడికట్టుకోలేదని తెలిస్తే' అగ్గిమీద గుగ్గిలం వేసినట్టు' భగ్గుమనేదాకా మీరు లేచేటట్టులేదు.

కూతురు : ఎందుకమ్మా వదినా, అలాగొంతుక చించుకుంటావ్! (పక్కకు పిల్చి) అయినదానికీ కానిదానికీ మిన్నూ మన్నూ ఏకంచెయ్యడం ఆవిడ కలవాటే! 'కొయ్యగూరకి లేదని కొడవలికే లేకపోవాలా సిగ్గు?' రావమ్మా మనమేనా వండుకుందాం.

(పదినిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి. అబ్బాయి వచ్చాడు)

అబ్బాయి : ఏమిటేఅక్కా, సుబ్బమ్మ పెట్టె పోయిందటకదూ? 'పెడుగుకీ బియ్యానికీ ఒకే మంత్రము'ని ఆవిడా ఏడుపేమిటి?

కూతురు : ఇంకేముంది నాయనా, 'వేరుమీద గోరుమొలిచింది, వేరుండరా వెర్రి మొగుడా' అందిట. సుబ్బమ్మగారి పెట్టి పోయింది! ఇంక ఆశలేదు, మనం పస్తులుండవలసిందే!

అబ్బాయి : 'చేతగానిదానికి శౌర్యమెక్కువని' పెట్టె స్వయంగా పారేసుకున్నందుకు 'తేలుకుట్టిన దొంగలా పడుండక భోజనాలవేళ' 'అర్ధరాత్రి అంకమ్మ శివాలెత్తినట్టు' యీ అల్లరేమిటే? ఇందులో ఏదో ఉంది!

కూతురు : ఏమో బాబూ 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక.' ఎవరికి తెలుసూ? 'పత్తానికి కోసంటే గుణ్ణం విసురుకుంటుంది; తక్కినవాళ్ళమీద విసురుతే ఊరుకుంటారా?' ఆవిడతోపాటు కూర్చోడానికి ఎవరికి ఓపికఉంది?

అబ్బాయి : అదికాదే: యిందాకల ఏమయిందా?:—

* * *

అబ్బాయి : ఏ సుబ్బమ్మగారూ! పాపం అసలే బీదవారు. 'తగిలిన వేలుమీదే దెబ్బతగిలినట్టు' పెట్టిపోయిందిటకదూ?

సుబ్బమ్మ : అవున్నాయనా. పెట్టిపోయింది, మతీపోయింది. 'గోడ్డకిపూసిన సున్నం, సానికి యిచ్చినసొమ్ము' వస్తుందా అన్నట్టు పోయినవస్తువు దొరికినవాళ్ళెంత అదృష్టవంతులు! దొరకకపోయినా బాసుందును!

అబ్బాయి : అదేమిటలా అన్నారు?

సుబ్బమ్మ : అది ... కాదది కాదు. అబ్బె.. బ్బె. మనసు బాగుండక ఓమాట కోమాట అన్నాను. 'యధార్థవాదీ బంధు విరోధీ' అని సొమ్ముపోయినా 'కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని...' గట్టిగా ఏడవడానికయినా వీల్లేదు యీ యింట్లో.—

అబ్బాయి : ఎంతమాట! ఇంతలా దుఃఖపడుతున్నారు. 'కారణం లేందే తోరణం

కట్టరన్నారు' ఇంతకీ ఆ పెట్లో ఏముందో?

సుబ్బమ్మ: (గతుక్కుమని) ఏం...ఏం లే. దు. 'సత్రం భోజనం, మఠం నిద్ర' అయిన మాలాంటివారికి ఏముంటుంది నాయనా? ఇంతకీ 'ఋణం తీరిపోతే తృణం' అయినా ఉంటుందా?'

* * *

అబ్బాయి: విన్నావా? ఏమీ లేకపోతే ఆవిడ 'గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకోడ మెందుకూ'? 'తాడి చెట్టు ఎందుకెక్కావంటే దూడగడ్డి కోసమన్నట్లు' 'దొరక్కపోయినా బాగుండును' అని ఆజవాబేమిటి? ఇందులో ఏదో ఉంది. 'నిప్పులేకపోతే పొగ వస్తుందా?'

కూతురు: ఓరి వెధవా! చూశావుటమ్మ

చిన్నవదినా: అందుకే అన్నారు 'పొట్టి వాడికి పుట్టెడు బుద్ధుల'ని. నిజం నిలకడ మీద తేలక పోదులే. అయితే ఆ పెట్టెలో ఏముందంటావ్? 'నీరు పల్లమెరుగు. నిజము దేవుడెరుగు' అన్నారు.

అబ్బాయి: అదే... అదే... 'గాలిలో దీపంపెట్టి నీదేభారం దేవుడా!' అని కూర్చో అదే తెలుస్తుంది.

కూతురు: అవును మరి, 'మంత్రానికి చింతకాయలు రాల'ని మాట నిజమే! అయితే నన్నేం చెయ్యమంటావ్?

అబ్బాయి: 'ఉపాయం లేనివాళ్ళని ఊళ్ళోంచి వెళ్ళిపొమ్మన్నారు.' ఏదో ఒకటి ఆలోచించాలి. అదిగో నాన్న వస్తున్నారు.

[ఇంటిపెద్ద, వచ్చి]

ఇంటిపెద్ద: మీ అమ్మవాళ్ళూ రాత్రి బండిలో వస్తున్నారుటే, కబురు పంపించారు. సముఖంలో రాయబార మెందుకో? ఇదుగో యీ పెట్టికూడా ఎవరిదో మరిచి పోయారని పంపించారు. 'వెదుకుతున్న తీగ కాళ్ళకు చుట్టుకున్నట్టు' వచ్చిపడింది యీ పెట్టె. అక్కడ వదిలేసి 'ఉయ్యాల్లో పిల్లాడ్ని ఉంచి ఊరల్లా వెలికినట్టు' ఆవిడ యీమాత్రం దానికే 'కోతిపుండు, బ్రహ్మరాక్షసి' అంత చేసింది. తీసికెళ్ళి ఆవిడ మొహాన్ని కొట్టండి. (వెళ్ళిపోతాడు)

(గదితలుపు వేసి అబ్బాయి పెట్టె బద్దలు కొడతాడు. సుబ్బమ్మ వచ్చి కిటికీలోంచి చూసి ఖంగారుగా పరుగెడుతుంది)

కూతురు: అయ్యో! ఎంత ఆశ్చర్యం, ఎంత మోసం! 'ఏకు కదా అని తీసి కొప్పులో పెడితే ఏకు మేకయిందిట.' కూడూ గుడ్డా యిచ్చి సరిగ్గా చూసుకుంటున్నందుకు తగిన ప్రాయశ్చిత్తం చేయించింది.

చిన్నకోడలు: అవ్వ! 'తిన్నింటి వాసాలు లెక్కెడుతుందని' ఎవరనుకున్నారూ?

కూతురు: 'తినేది ఇంటి మొగుడు సొమ్ము పాడేవి రంకు మొగుడు పాటలు' అని ఎవరనుకున్నారూ?

పెద్దకోడలు: 'చేసేవి గంగాస్నానాలు: దూరేవి దొమ్మర గుడిసెలు' అని ఎవరనుకున్నారు వదినే?

కూతురు: 'పానకంలో పుడక'లా అప్పుడు చెప్తే బాగుండదని ఊరుకున్నాను. ఆ పెళ్ళిలో పోయిన కోయంబత్తూరు ఎర్రజరీ చీర యిదేసుమా!

చిన్నకోడలు: మరే! నేనూ అలాగే యిలాంటి చిన్న చిన్నవి 'రామాయణంలో పిడకలవేట'లా ఆ పెళ్ళి హడావిడిలో చెప్తే బాగుండదని ఊరుకున్నాను గాని నాగవల్లి నాడు మా చెల్లాయి పారేసుకున్న తోలుక్కా యిదే సుమండీ! అందుకే 'నిప్పు తొక్కిన కోతి'లా అలా వర్రెత్తిపోయింది!

[అందరూ హడావిడిగా అక్కడికొస్తారు.]

అల్లుడు: 'పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతూ ఎవరికీ ఏం తెలీద'నుకుందిట. దొంగతనం, రంకుతనం ఎన్నాళ్ళు దాగుతాయి? ఈ పెట్టెలో యిన్ని బట్టలూ యిన్ని నగలూ ఉన్నాయి. 'సొమ్ముపోయిన వాళ్ళు పాపానబోదురని' ఈ వస్తువులన్నీ ఎవరివో?

ఇంటిపెద్ద: 'పిల్లలో పిడుగులో' అన్నారు. వాడికి కాబట్టి తోచింది. ఇంతకీ అదెక్కడ ఉందో చూడండి.

అల్లుడు: (చూసివచ్చి) ఇంకెక్కడుంది? అయ్య వచ్చేదాకా అమావాశ్య ఆగుతుందా? 'దొంగ పోయిన ఆరునెలలకి కుక్క భౌమన్నట్టు' యింతసేపూ మాటల్లో పడి యిప్పుడు వెడితే దొరుకుతుందా? 'పప్పులో గరిటె'లా ఎప్పుడు జారిపోయిందో!

పెద్దకోడలు: (గుండె బాదుకుని) ఆశ్చర్యం! ఇలాంటి వాళ్ళనుబట్టే 'పైనబడితే వర్షాలూ కింద పడితే పంటలూ లేవంటారు,' 'తలలు నున్ననైన తలపులు నున్నగా' అని ఊరికే అన్నారా రామకృష్ణులవారు? ★

బొమ్మరిల్లు



★ బుద్ధి బలము ★

శ్రీనివాసపురం నరసింహాచార్యులు

అనగనగా ఒకపూరిలో
అప్పాజీ వున్నాడు
అలవిగాని తెలివితోడ
మెలగుచుండు అతడెప్పుడు.
గొప్పగొప్ప వారెందరో
అప్పాజీ తెలివిగూర్చి
మెన్నో రీతుల జెప్పగ
విన్నాడా పూరి రాజు.
"తప్పకుండ వీని తెలివి
గొప్పతనముకందు" నంచు
సన్నమూతిగాను జేసి
వున్నకడవ దెచ్చాడు.
"నీ తెలివిని దీనిలోన
నిండించీ పంపు" మని
దగ్గరున్న బంట్రోతుల
ముగ్గురనంపించాడు.
భటులు చెప్పమాటల తను
బాగుగ నాలోచించి
అటులనె కానిమ్మంటూ
తెటుకునయిట్లన్నాడు.
"రెండునెలల నాటికిది
నిండించి వుంచుతాను
యిప్పటి కింటికి పొండి
తప్పకరం" డన్నాడు.
"పరిహాసముకొరకు రాజు
పంపినాడు బంట్రోతుల"
అంచు తనమనసులోన
ఎంచినాడు అప్పాజీ.
పెరటిలో వుండిన గుమ్మడి
పిందె కడవలో బెట్టాడు
తీగకురోజూ నీళ్ళుపోసి
బాగుగ దానిని పెంచాడు.
గడువుదాటగానె వారు
కడవకోసమై వచ్చారు
తొడిమ త్రుంచి ఆకడవను
యిచ్చుచు యేమో చెప్పాడు.
"సరే" నంటు రాజుకడకు
నరాసరిగ వెళ్ళికడవ
ఎదుటబెట్టి అప్పాజీ
యిట్లన్నాడని చెప్పారు.
"నా తెలివిటు పంపితిని
మీ తెలివితో యీకడవను
పగుల గొట్టకుండ కాయ
బైటకు యిట్టే తియ్యాలి"
అంటూ వారను మాటలు
వింటూ ఆ రాజు వాని
తెలివికి తనలోనె మెచ్చి
తలను వంచుకున్నాడు.
అవమానము చేయబోయి
అతడే అదిపొందినాడు
భువిలో మానవుల కెపుడు
బుద్ధిబలమె పెద్దబలము.
దేహబలముతోడ మనకు
దీరని పనులన్నియును
బుద్ధిబలము తోడ దీరి
పోవుగదా సులభముగా ★

★ వోల్టేర్ ★

ఈమాటు ఒక గ్రంథ కర్తని గురించి వ్రాస్తాను. కలం గొప్పదా కత్తి గొప్పదాఅని పూర్వం పశ్చిమ దేశాలలో చర్చలు జరిపేవారు. ఈ రోజుల్లో అటువంటి చర్చ అనవసరం. కలమూ, లెక్కలూ లేకపోతే సైన్సు అభివృద్ధి చెందడం, ఏటం బాంబు కనిపెట్టడం అసంభవం. కత్తి ఏనాడో మూల పడిపోయింది, కాని గొప్పకోసం కలమూ కత్తీ పోటీచేస్తున్న ఆ కాలంలో కత్తి కంటె కలమే పదునైనదని చూపించాడు వోల్టేర్. కత్తికంటె వాడిగా కలాన్ని వాడి యూరప్ అంతటినీ, ముఖ్యంగా చర్చి అధికారుల్ని గజగజ లాడించాడు.



వోల్టేర్ కలానికింత పదునెక్కడనించి వచ్చింది? అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని సహించరాదనే దీక్షవల్ల వచ్చిందని చెప్పాలి. “నువ్వు చెప్పేది నాకు నచ్చకపోవచ్చు కాని నువ్వు చెప్పదల్చుకున్న విషయాన్ని చెప్పనిచ్చితీరాలి. అడ్డుపెట్టే అధికారం ఎవరికీ లేదు” అన్నాడు వోల్టేర్. ఆ కాలంలో, అంటే పద్దెనిమిదో శతాబ్దంలో క్రైస్తవ మతాధికారులు ప్రజల్ని మూఢాచారాల మధ్య కట్టివేసి ఉంచి, స్వతంత్రంగా ఆలోచించేవారిని పీడించి కష్టాలపాలు చేసేవారు. ఫ్రాన్సుదేశంలో నేరస్థుల్ని విచారించే పద్ధతికూడా అక్రమంగా ఉండేది. ప్రజలు ఒకవంక మహారాజుకీ ప్రభుత్వాధికారులికీ, మరొకవంక క్రైస్తవ మతాధికారులికీ ఇంకోవంక దౌర్జన్యపరులికీ భయపడుతూ ఒదిగి ఒగిది ఉండేవారు. అతి చిన్నతనంలోనే వోల్టేర్‌కి ఇదిచూస్తే కోపంతో రక్తం ఉడుకెత్తిపోయేది. ‘నేను పుస్తకాలు రాయడం నేర్చుకుంటాను’ అని అతనంటే, తండ్రి కోప్పడేవాడు. ‘పుస్తకాలు రాస్తూ కూచోడమంటే ఆకలితో మాడ్డమన్నమాట అనేవాడు తండ్రి. కాని తండ్రిమాట వినకుండా తాతగారి సహాయంతో గ్రంథాలు పఠించడం మొదలు పెట్టాడు.

అతని అసలుపేరు ఫ్రాన్స్వా మారీ ఆర్వే. వోల్టేర్ అనేపేరు పెట్టుకుని రచనలు సాగించాడు. ఫ్రెంచి విప్లవానికి ముందు విప్లవభావాలను వ్యాప్తిచేసిన వారిలో వోల్టేర్ ఒకడు. ఇతడు 1694 నవంబరులో పారిస్‌లో జన్మించాడు. ఎన్నడూ అతని ఆరోగ్యం సరిగా ఉండేదికాదు. అయినా దీక్షతో గ్రంథాలు చదివేవాడు. పాతికేళ్ళకే రచయితగా ప్రసిద్ధికెక్కాడు. ఇతని నాటకాలను ఇతర గ్రంథాలను చాలా వాటిని ఫ్రెంచి ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వాన్ని, క్రైస్తవ మతాధికారులు ప్రచారంచేసే మూఢ నమ్మకాలను విమ

(34-వ పేజీ చూడండి)


సత్యప్రసంబద్ధం

నేను చెప్పులు కుట్టించుకుందామని చాలా నాళ్లనుండి అనుకొనుచున్నాను. నాపాత చెప్పులేమో చినిగి పూర్తిగా పనికి రాకుండ అయినవి. బాగా విచారించి తక్కువ ధరలో కుట్టే మోచి (చెప్పులు కుట్టువాడు) వద్దకు వెళ్లాలని అనుకున్నాను. విచారించినాను, "ఊరికి దూరంగా మూలనున్న మోచీఅయితే తక్కువలో కుడతాడని భావించి పాత చెప్పులు పాకెట్‌లో సాయంత్రం పెట్టుకుని అనుకున్న తీరున ఒక మోచి దగ్గరకెళ్ళి "చెప్పులు చేస్తావా?" అన్నాను. "ఎందుకు చేయనయ్యా తప్పకుండా చేస్తాను" అన్నాడు. "ఎంత ఖరీదులో చేస్తావు" అన్నాను. అడుగున మోటారుటైరు రబ్బరు వేస్తాను ఇదిగో చూడండి, మూడేండ్లుగావాలి అరగడానికి, పైతోళ్లు మీ ఇష్టం వచ్చినట్లు డిజైను వేస్తాను, అన్నాడు. కొంచెం సేపు ఆగి "రబ్బరుమీద అట్టవేస్తే రెండున్నర, తోలువేస్తే మూడున్నర అన్నాడు. బాగుందనుకున్నాను. మొత్తం మీద చాల చవక అవకంు ఆరు, ఏమి ద్యూలకు దొరికే చెప్పులు ఇక్కడ రెండున్నర, మూడున్నర," అని అనుకుని బేరం మొదలు పెట్టాను.

"వడ్డిరాజు"

(ఎందుకనగా పెద్ద పెద్ద దుకాణాల్లో బేరమాడలేం గనుక) తుదకు వాడన్నాడు "అయ్యా, కారు చెప్పులకు రెండున్నరకన్నా తక్కువైతే మాకు లాభం లేదుగాని, తోలు చెప్పులకు మాత్రం మీ కొరకు మూడు రూపాయలకు చేస్తాను." అన్నాడు. ఇక నేను

(31-వ పేజీ చూడండి)



గణపతి — ఏకరేఖాచిత్రం
చిత్రకారుడు: శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మ, వెల్లటూరు.

హకల్ బెరి ఫిన్

మార్క్ ట్వేన్

బొమ్మరిల్లు సీరియల్

9

జాక్సన్ ద్వీపం పరిశోధించాలని బయలుదేరినప్పుడే ద్వీపంమధ్య ఒక ప్రదేశం చూశాను. ఆప్రదేశం మళ్ళీ చూడాలని నేనూ జిమ్ మళ్ళీ బయల్దేరాము. ద్వీపం అంతా కలిసిమూడుమైళ్ల పొడుగు, పావుమైలు వెడల్పు కంటె ఎక్కువ లేనందున ఇట్టే చేరాం ఆప్రదేశం.

అది నలభై అడుగుల ఎత్తున్న చిన్నమెట్ట. దాన్నెక్కడానికి చాలా శ్రమపడ్డాము. ఎందుకంటే దాని పార్శ్వాలు సూటిగా గోడలు పెట్టినట్టున్నాయి. పైగా ఎటునించి ఎక్కాలన్నా దట్టమైన ముళ్లపొదలు తప్పించుకుని ఎక్కవలసి వచ్చింది. మెట్టయావత్తూ పరిశోధించాము. ఒకచోట ఒక బుల్లిగుహ కనిపించింది. గుహాద్వారం ఇల్లినాయిస్ తీరంకేసి వుంది. రెండు మూడు గదులు కలిపితే ఎంత వుంటుందో అంత విశాలంగా వుంది గుహ. జిమ్ నిటారుగా నుంచోటానికి తగినంత ఎత్తుందిలోపల. బయట ఎంత వేడిగావున్నా గుహాలోపల చల్లగా వుంది. నాసామానంతా గుహాలో దాచుదామన్నాడు జిమ్. గుహాలో మకాం పెడితే మాట మాట్లాడితే మెట్టఎక్కడం, దిగడం కష్టమని వాదించాను నేను. జిమ్ అనేదేమిటంటే, "పడవను ఎవరికీ కనబడనిచోట జాగ్రత్తచేసి, మిగతా సామానుతో గుహాలో మకాంచేస్తే ఎవరికన్నా కనిపిస్తా మేమోనని నిత్యమూ భయపడే అవసరం ఉండదు. ద్వీపంలో కెవరువచ్చి, ఎంత వెదికినా మేము కనిపించం. అదీగాక ఇంకాసేపట్లో వానవస్తుందని పక్షులు చెప్పుకుంటున్నాయని అన్నాడు జిమ్.

అందుచేత మెట్టదిగి వెళ్ళి పడవలో సామానంతా ఒక్కదెబ్బలో గుహాలోకి తీసుకొచ్చాము. మళ్ళీ వెళ్లి పడవను అడవిలతలు గుబురుగా అల్లుకున్న ఒక రహస్య ప్రదేశంలో దాచాము. మేమువేసిన వలల్లో చేపలు పడితే వాటిని తీసుకుని మళ్ళీ వలలు వేశాము. గుహాకు తిరిగి వచ్చాము.

గుహ ద్వారానికి ఒక పక్కగా నేల ఎత్తుగా, చదునుగా వుంది. దానిమీద మంటచేశాము. జిమ్ వంట వండాడు. కంబళ్లు నేలమీద పరిచి వాటిమీద కూర్చుని భోజనం చేశాము. నా సామాను యావత్తూ లోపల ఒకమూల భద్రం చేశాము. ఇంతలో చీకటి పడింది ఉరుములు, మెరుపులు వచ్చాయి. పక్షులు చెప్పుకుంటున్నది నిజమే నన్నమాట. వాన ప్రారంభమైకుండపోతగా కురిసింది. గాలి అంత వేగంగా వీచటం ఎప్పుడూ చూడలేదు నేను. వేసవి కాలంలో మామూలుగా వచ్చే గాలి వానల్లో ఇదొకటి. ఈగాలి వానల సమయంలో వీచేగాలికి ఎంత బలమైన చెట్లయినాసరే ఉండలు చుట్టుకుని దొర్లుకుంటూ తిరుగుతాయి. ఇంకా నిలదొక్కుకో గలిగిన చెట్లయితే

విరిగేదాకా నేలమీదికి వంగటం, లేవటం ఇదేపని. ఎంతంత పెద్ద కొమ్మలైనా సరే గాలి పటాల్లాగా గాలిలో కొట్టుకుపోతాయి. ఈగాలి వానల్లో పిడుగులు కూడా పడుతూ వుంటాయి. ఉరుములు చెప్పనే అక్కర్లేదు. ఆకాశం విరిగి పడుతున్నట్టు గొడవ చేస్తాయి. ఆకాశమనే మేడమెట్ల మీదనించి ఖాళీ పీపాలుకిందకి దొర్లిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆరాత్రికూడా అలాగే వచ్చింది గాలివాన. నేను జిమ్‌తో అన్నాను:

"జిమ్! ఈగుహాలో బలే హాయిగా వుందికదూ. వెచ్చగా అమ్మగారియింట్లో కూర్చున్నట్టే వుంది. ఇక్కణ్ణించి ఇంకెక్కడికీ పోను నేను. ఇక్కడే వుంటా ఎప్పుడూ. జిమ్! ఆ రొట్టెముక్క అందుకో ఇల్లా."

"చూశారా మరి నేనూరికే చెప్పానా? నేను చెప్పినట్టు వినకపోతే నేనూ, మీరూ నిష్కారణంగా ఈవానలో చచ్చిపోయి వుండేవాళ్ళం. వాన వస్తుందో లేదో పక్షులు కనుక్కోగలవు. వాటిమాట మనం తోసెయ్యటానికి వీల్లేదు."

ఆతరవాత పది పన్నెండు రోజులదాకా నది గట్లుదాటి పొంగుతూనే వుంది. ద్వీపంలో పల్లపు ప్రాంతాలన్నీ మూడు నాలుగడుగులలోతు నీళ్ళలో మునిగాయి. ఇల్లినాయిస్ రాష్ట్రంవైపు నది వెడల్పు చాలా మైళ్ళున్నట్లు తోచింది. మిస్సోరీ రాష్ట్రంవైపు మాత్రం నది వెడల్పు యథా ప్రకారంగానే, అంటే అరమైలు వెడల్పు మాత్రమే వుంది. ఎందుకంటే మిస్సోరీ తీరం అంతా కొండలగోడ.

ద్వీపం దాదాపు అంతా నీళ్ళలో మునిగి వున్నందున నేనూ, జిమ్ పడవలో యథేచ్ఛగా తిరిగే వాళ్ళం. చెట్లమధ్యనుండి పడవను తిప్పుతూ నడపటం

బలే తమాషాగా వుండేది. ప్రతి చెట్టుమీదా ఉడతలు పాములు ప్రాణభీతితో తలదాచు కుంటున్నాయి. రెండు మూడు రోజులయ్యేసరికి అవి ఆకలితో నీరసించి పోయాయో ఏమో ముట్టుకున్నా ఏం చెయ్య లేని స్థితికి వచ్చాయి. మా మెట్టమీద కూడా చాలా పాములు, ఉడతలు, ఇతర జంతువులు చేరాయి.

ఒకరోజున చీకటితో లేచి నేనూ జిమ్ నది ఒడ్డున కూర్చుని వున్నాం. ద్వీపం పడమటి వైపుగా ఒక కొంప నదిలో కొట్టుకు రావటం చూశాం. ఎంత దూరంనుంచి వస్తోందో ఏమో అది ఛాలా విచిత్రంగా కనిపించింది. అది రెండం తస్తులున్నది; కొయ్యతో కట్టిన ఇల్లు; కింది భాగమంతా శిథిలమై పోయివుంది. దాన్ని చూడగానే ఇద్దరం పడవెక్కి పోయి దాన్ని పట్టుకున్నాం. రెండో అంతస్తు కిటికీ లోంచి లోపలికి తొంగిచూశాం. కాని అప్పటికింకా చీకటిగా ఉన్నందున ఏమీ కనిపించలేదు. పడవను ఇంటికి కట్టివేసి తెల్లవారేదాకా ఎదురు చూడదలచుకున్నాము.

తెల్లవారింది. అప్పటికి ఆకొయ్య కొంప ద్వీపం అవతల చివరవరకూ వచ్చింది. మళ్ళీ కిటికీలోంచి చూశాము. ఒకమంచం, ఒకబల్ల, రెండు కుర్చీలు, నేలమీద చిందర వందరగా చాలా వస్తువులు కనిపించాయి. గోడకు కట్టిన దండెంమీద బట్టలు వేలాడుతున్నాయి. నేలమీద బోర్లాపడుకున్న మనిషి ఉన్నాడు. జిమ్ కేకేశాడు:

"ఏయ్...ఏయ్, ...నిన్నే..." కాని ఆమనిషి కదల్లేదు. నేనూ కేకేశాను. ఉహూ, లాభంలేదు. జిమ్ అన్నాడు:

"అబ్బే. వాడు నిద్రపోవటం లేదండి. చచ్చిపోయాడు. మీరిక్కడే వుండండి. నేను చూసి వస్తాను," అంటూ జిమ్ కిటికీ గుండా లోపలికి దిగాడు.

"నేను చెప్పలేదండి? మనిషి చచ్చిపోయాడు. తుపాకితో ఎవరో కాల్చి చంపారు. రెండు మూడు రోజులై వుంటుంది. మీరుకూడా రండి హక్‌గారూ! వాడిమొహంకేసి చూడకండి, భయపడతారు."

నేను ఆశవంకేసి చూడనైనా లేదు. కాళ్లు వణుకుతుంటే గట్టిగా అదిమి నుంచున్నాను. నేల మీద పేకముక్కలు పాతవి చెల్లాచెదరై వున్నాయి. విస్కీసీసాలు పగిలి దొర్లుతున్నాయి. ఒకమూల దొంగలు మొహానికి కప్పుకునే నల్లటి ముసుగులు కనబడ్డాయి. గోడలనిండా పిచ్చిరాతలు, పిచ్చిబొమ్మలు బొగ్గుతో గీయబడినవి వున్నాయి. దండెంమీద వున్న రెండుకోట్లు, ఆడవాళ్ల బట్టలు, లాగూలు తీసి పడవలో పడేశాము. నాకు సరిపడే టోపీ ఒకటి దొరికింది. అది తీసుకున్నాను.

ఇల్లంతా వెదికి ఒక పాతలాంతరు, మాంసం కోసే కత్తి, ఖరీదైన కొత్త చాకొకటి, బోలెడు కొవ్వొత్తులు, కొవ్వొత్తులు పెట్టుకునే సీనారేకు స్టాండు, మంచినీళ్లు తాగేకప్పు, దుప్పట్లు, సూదులు, దారం, గుండీలు, మేకులు, ఫస్టుక్లాసయిన చేపలవల, కుక్కమెడకి పెట్టేతోలుపటకా, ఇలాంటి వస్తువులు చాలా సంపాదించాము. అన్నీ పడవలో చేరవేశాము.

కొయ్యకొంపని దానిదోవన దాన్ని పోనిచ్చి చుట్టూ చూశాము. మా ద్వీపందాటి పావుమైలు వచ్చాము. సూర్యుడు బారెడు పైకెక్కి వచ్చాడు. అంత సామాను సునాయాసగా సంపాదించ గలిగినందుకు ఇద్దరం మురిసిపోయి చంకలు కొట్టుకున్నాం.

జిమ్‌ను పడవ అడుగున పడుకోమని చెప్పి వాడిమీద గుడ్డలు కప్పాను వాడు పైకి కనిపిస్తుంటే ఎంత దూరానున్న వాళ్లయినా ఇట్టే కనిపెట్టేస్తారు వాడు నీగ్రోబానిస అని. అందుకని ఈజాగ్రత్త తీసుకున్నాను అక్కణ్ణించి నేనే తెడ్డు వేసుకుంటూ కొద్ది సేపట్లో జాక్సన్ ద్వీపానికి వచ్చేశాను దోవలో ఏఅపాయమూ జరగలేదు; ఎవరూ ఎదురుపడలేదు. ఇద్దరం క్షేమంగా గుహకు తిరిగి వచ్చాం.

10

భోజనం చేశాము. తరవాత కొయ్యకొంపలోని శవం ఎవరై వుంటుందీ, ఎవరు చంపేసి వుంటారు, ఎందుకు చంపేసి వుంటారు మొదలైన సంగతులు జిమ్‌తో కాసేపు కులాసాగా మాట్లాడదామనుకున్నాను కాని జిమ్ వద్దన్నాడు. చచ్చినవాళ్ళనుగూర్చి మాట్లాడటం మంచికాదు, దానివల్ల కీడు మూడుతుందన్నాడు. ఆ చచ్చినాడి దెయ్యం రేపణ్ణించి మన్ని పట్టుకుని వదలదన్నాడు. ఎందుకంటే

సుఖంగా సమాధి చెయ్యబడిన దెయ్యాలైతే హాయిగా భూమిలో పడుకుని ఇక లేవవు. కాని దిక్కూ మొక్కూ లేని శవాలైతే వాటి దెయ్యాలు గాలిలోనే విహారం చేస్తూ వుంటాయిట. ఇది నిజం కావచ్చు ననిపించింది. శవంగూర్చి మాట్లాడ్డం మానేశాను. కాని ఎవరు చంపారు, ఎందుకు చంపారు అన్న ప్రశ్నలు నన్ను వేధించటం మానలేదు.

మేము తీసుకొచ్చిన బట్టలు శుభ్రంగా దులిపి బాగు చేశాము. దులుపుతుంటే ఒక పాతకోటు జేబులోంచి ఎనిమిది డాలరు నాణాలు ఘల్లుమంటూ కింద పడ్డాయి జిమ్ వాటినిచూసి 'ఆ కొంపలోంచి పారిపోయిన వాళ్ళకి ఈకోటు జేబులో డబ్బుందని తెలియదు. తెలిస్తే ఇదికూడా ఎత్తుకుపోయేవారే' అన్నాడు. 'అసలు డబ్బుకోసమే వాణ్ణిచంపి వుంటా' రన్నాను. కాని చచ్చినాణ్ణి గురించి ఛస్తే నోరెత్త నన్నాడు జిమ్. నే నన్నాను:

"చచ్చినాళ్లను గూర్చి మాట్లాడితే ఏం? మొన్న మనమెట్టమీద నాకు పాము కుబుసం దొరికింది. అది ముట్టుకుంటే ప్రపంచంలోవున్న ఆపదలన్నీ మన్ని చుట్టు ముట్టుతాయని శకునం చెప్పావు. ఇప్పుడు ఆశకునం ఏమైంది? ఇదిగో. ఇవ్వాళ తెల్లారాక మనకి ఎంత సామాను, ఎంతడబ్బు దొరికిందో. నీశకునం అబద్ధమైందా లేదా?"

"తొందర పడకండి హాక్ గారూ! ఈజిన్ చెప్పింది ఇంతవరకూ అబద్ధం కాలేదు. వస్తుంది దానికి కాలం వస్తుంది. అప్పుడే ఏమయింది? ఉండండిమరీ"

జిమ్ అన్నట్టే ఆపదలు వచ్చాయి. మంగళవారం పొద్దున పైవిధంగా మాట్లాడుకున్నామా? శుక్రవారం మధ్యాహ్నం భోజనమయ్యాక మెట్టమీద ఒక చెట్టుకింద కాసేపు పడుకుని చుట్టలు కాల్చుకున్నాము. తరవాత ఇంకోచుట్ట తెచ్చుకుందామని నేనొక్కణ్ణే గుహాలోకి వెళ్లాను. అక్కడ ఒక పెద్దపాము కనిపించింది. దాన్ని చంపేశాను. తరవాత దాన్ని చుట్టచుట్టి జిమ్ కప్పుకునే కంబళీలో దాచాను. వాణ్ణి కొంచెం జడిపించాలని తప్ప మరే దురుద్దేశ్యమూ లేదు. చీకటి పడేవేళకి పాముసంగతి మర్చిపోయాను. పడుకోబోయేటప్పుడు జిమ్ మామూలుగా కంబళీ తీశాడు. దాంట్లోంచి చచ్చినపాము, దాని మొగుడో పెళ్లామో ఇంకోపాము బయటపడ్డాయి. రెండోపాము జిమ్‌ను కాలిమీద కరిచింది. జిమ్ 'బాబోయ్' అంటూ ఎగిరిపడ్డాడు. పాము ఇంకోకాటు వెయ్యటానికి సిద్ధంగా వుంది వెంటనే కర్రతీసుకుని ఒక్క దెబ్బకి దాన్ని చంపాను. జిమ్ మానాన్న తాలూకు విస్కీ కూజాలం కించుకుని కాస్త తాగి, కాస్త పాముకరిచినచోట పోసుకున్నాడు.

ఇదంతా నామూలాన గదా అని ఎంతో విచారపడ్డాను. అసలు ఒక పామును చంపి ఒకచోట పారవేస్తే కొంతసేపటికి దాని జతపామువచ్చి చచ్చిన దాన్ని కావిలించుకుని ఏడుస్తూ పడుకుంటుంది. ఈసంగతి నాకు తెలుసు. కాని సమయానికి జ్ఞాపకం రాలేదు. జ్ఞాపకంవస్తే చచ్చినపామును జిమ్ కంబళీలో దాచేవాణ్ని కాదు.

జిమ్ బాధతో మూలుగుతూ తన్ను కరిచిన పాము తలకోసి దూరంగా పారెయ్యమన్నాడు. చర్మం వొలిచి ఒక ముక్క మెత్తగా ఉడకబెట్ట మన్నాడు. అలాగే చేశాను. ఉడకబెట్టిన భాగాన్ని జిమ్ ఉప్పులో నంచుకుని తిన్నాడు. అలాతింటే పాము కాటు దబ్బున నయమవుతుందట. జిమ్ చూడకుండా రెండు పాములనూ దూరంగా గిరాటేశాను. ఇదంతా నేను చేసిన పనేఅని జిమ్‌కు చెప్పదలుచుకో లేదు.

జిమ్ మధ్య మధ్య విస్కీ చప్పరిస్తూ మూలుగుతూ పడుకున్నాడు. బాధ భరించలేక పోయినప్పుడల్లా లేచి గంతులువేస్తూ పెడబొబ్బలు పెట్టేవాడు. కాలు, పాదం ఇంతలావున వాచిపోయాయి. కొంతసేపటికి విస్కీ నిషా తలకెక్కి అలాగే పడి నిద్రపోయాడు.

నాలుగు పగళ్లు, రాత్రులు జిమ్ బాధపడ్డాడు. అయిదో రోజుమంచీ వాపుతగ్గి మళ్ళీ లేచి తిరగ సాగాడు. ఆరోజున పాము కుబుసం ముట్టుకోవటం మూలానే యీకష్టం వచ్చిందని, ఇంకెప్పటికీ ముట్టుకోననీ నాలోనేను ఒట్టేసుకున్నాను. పాము కుబుసం ముట్టుకున్నదాని ఫలితం ఇంకా పూర్తికాలేదనీ, ఇంకా ముందు ముందు కష్టాలు రావచ్చునీకూడా జిమ్ శకునం చెప్పాడు. తనైతే 'ఎడమబుజం మీదుగా వెనక్కి తిరిగి విదియరోజు చంద్రుణ్ణి వెయ్యిసార్లైనా

చూస్తానుగాని పాము కుబుసం మాత్రం ఛస్తే ముట్టుకోను' అన్నాడు. నాకూ అలాగే అనిపించింది. విదియ చంద్రుణ్ణి ఎడమ బుజంపైనుంచి చూడటం చాలా చెడ్డ శకునమని నాకు జిమ్ చెప్పకుండానే తెలుసు. ఎందుకంటే ఒకసారి మానాన్న చెప్పాడు. హాంక్ బంకర్ అని ఒకడుండేవాడు మావూళ్లో. వాడొకసారి ఇలాగే చూశాడట. చూసి ఊరుకోకుండా తనకేం భయంలేదని గర్వంగా చెప్పుకున్నాడట. ఏమైంది? రెండేళ్లు తిరక్కుండానే ఒక రోజున తాగి ఒకగోపురం ఎక్కాడు. ఎక్కి కళ్లుతిరిగి కిందపడ్డాడు అంత ఎత్తునుంచి కింద పడినందున మనిషి ముక్కలు ముక్కలై పోయాడు. వాడిశవం పాతిపెడదామంటే ఎన్ని ముక్కలని ఎన్ని రోజులని వెతికి పోగుచేస్తారు? అందుకని వాణ్ని పాతి పెట్టడానిక్కూడ వీల్లేక పోయిందిట. అదిగో అల్లాంటి ఫలితాలు వస్తాయి ఎడమ బుజం మీదనుంచి విదియ చంద్రుణ్ణి చూస్తే.

కొన్నాళ్లిల్లా గడిచాయి. నదిలో వరదలు తగ్గిపోయాయి. ఒకరోజున కొయ్యకొంపలోంచి తెచ్చిన పెద్దగాలం నదిలో వేశాము. చచ్చిన ఉడత నొకదాన్ని చర్మంవొలిచి ఎరగాకట్టాము. గాలానికి ఒక పెద్దచేప చిక్కుకుంది. అది ఒకమనిషంతవున్నది. ఆరడుగుల రెండంగుళాల పొడుగూ, దాదాపు రెండు వందలపౌన్ల బరువూవుంది. దాన్ని ఒడ్డుకులాగేటంత ధైర్యం లేకపోయింది మాకు. ఎందుకంటే దానిచేతికి చిక్కామంటే ఇద్దర్నీ కలిపి తోకతో అవతలి ఒడ్డుకు విసిరేసేట్టుంది. అందుచేత ఒడ్డునేకూర్చుని దానికేసి చూస్తున్నాము. గాలంముల్లునుంచి వదిలించుకోటానికి ఆ చేప చాలా తిప్పలుపడింది. చాలసేపు తన్నుకుని తన్నుకుని చివరికి కిక్కురుమనకుండా చచ్చింది. అప్పుడు దాన్ని బయటికి లాగాము. మిసిసిపీనదిలో ఇలాంటి చేపలు చాలా తిరుగుతూవుంటాయి. కాని ఇంతపెద్ద చేపను తనెప్పుడూ చూడలేదన్నాడు జిమ్. మావూళ్లో మార్కెట్‌కిగనక దాన్ని తీసుకుపోయి అమ్మితే చాలాడబ్బువస్తుంది. ముక్కలుముక్కలుగా కోసి పౌను ఇంతఅని అమ్ముతారు. ఈచేపమాంసం తెల్లగా మంచులాగ వుంటుంది. వేయిస్తే బలేకమ్మటి రుచివస్తుంది.

ఆ మర్నాడు నాకు కాలంగడవటం కష్టమైపోయింది. నదిదాటి వూళ్లోకిపోయి కబుర్లు తెలుసుకు వస్తానని చెప్పాను జిమ్‌తో. వెళ్ళమన్నాడు, కాని చీకటిపడేదాకా ఆగమన్నాడు. ఇంకా కాసేపాలోచించి మరోఉపాయం చెప్పాడు. ఆడపిల్ల వేషంవేసుకుని వెళ్లమన్నాడు. కొయ్యకొంపలోంచి తెచ్చిన గౌనులున్నాయిగా. లాగూకాళ్లు పైదాకా మడిచాను. గౌను తొడిగాను. మెడకు రుమాలచుట్టాను. మొగ క్రాపింగ్ కూడా కనిపించకుండా ఆడపిల్లలు చుట్టుకునే రుమాలు తలకు కట్టుకున్నాను. అచ్చు ఆడపిల్లలాగానేవున్నాననీ, పగలుకూడా నన్ను ఎవరూ కనుక్కోలేరనీ మెచ్చుకున్నాడు జిమ్.

చీకటిపడేవరకూ ఆడపిల్ల ఎల్లాఉండాలో ప్రాక్టీసుచేశాను. మాట్లాడటం, నడవటం, సిగ్గుపడటం మొదలైనవన్నీ సరిగ్గానే కుదిరాయి.

చీకటిపడింది. పడవతీసుకుని మా గ్రామందిశగా బయల్దేరాను. పడవలరేవుకు కొంతదూరంలో పడవ దిగి ఒక చెట్టుకుకట్టాను. నదిఒడ్డునే ఊరివైపు నడిచాను. ఊరిచివర ఒకచిన్న ఇల్లున్నది. ఆ ఇంట్లో చాలాకాలంనుంచి ఎవరూ ఉండటంలేదు. ఇప్పుడందులో లైటు వెలుగుతున్నది. కొత్తగా ఎవరువచ్చారా అని ఆశ్చర్యపడ్డాను. నెమ్మదిగావెళ్ళి కిటికీలోంచి తొంగిచూశాను. ఒక నలభైఏళ్ళ ఆవిడ కుర్చీలో కూర్చుని బట్టలు కుట్టుకుంటోంది. టేబిల్‌మీద కొవ్వొత్తివెలుగుతున్నది ఆవిడ నంతకుముందెప్పుడూ చూడలేదు నేను. ఎవరో కొత్తగావచ్చినావిడే. ఇదీ ఒకందుకు మంచిదేఅయింది. ఊళ్లోవాళ్ళైఅయితే కొంతసేపటికైనా నాగొంతు గుర్తుపడతారు. ఎందుకంటే నన్నెరగనివాళ్లు మావూళ్ళో ఎవరూలేరు. ఈవిడగనక కనీసం రెండురోజుల్నించి వూళ్ళో వుంటున్నా నాకుకావలసిన సమాచారమంతా చెప్పగలదు. మా వూరు చాలాచిన్నదిగనక, వూళ్ళో ఎక్కడ ఎంతచిన్నవిషయంజరిగినా, ఆఖరికి పిల్లి సమర్తాడిందన్నా, అది ప్రతివాడికీతెలిసి వూరుకుంటుంది. అందుకని ఈవిడ కొత్తామెఅయినా ఈపాటికన్నీ తెలుసుకునేవుంటుంది. ఇలా అనుకుంటూ తలుపుతట్టాను. నేను ఆడపిల్లనని మరొకమాటు జ్ఞాపకంచేసుకున్నాను. (ఇంకావుంది.)

విజ్ఞానవిషయాలు:

మనుష్యులూ, జబ్బులూ

కొందరేమనుకుంటారంటే, రోగాలు మనుష్యులకేగాని పక్షులకూ జంతువులకూ రావని. ఇందుకు కారణాలుకూడా చెప్తూఉంటారు. కోపం, అసూయ, విచారం, పరాభవం మొదలైనకారణాలవల్ల మనుష్యులకు సత్తువతగ్గి రోగాలు పుట్టడానికి వీలుకలుగుతుందని కొందరంటారు. సుఖంగా సంతోషంగాఉండే వారిని జబ్బులు అంటవంటారు. జబ్బుచేస్తే చేసిన పాపాలకు ఫలితంఅని కొందరు విచారపడతారు. (పక్షులూ జంతువులూ పాపాలు చెయ్యవుగా!) కాని ఇదంతా పొరపాటు. పక్షులికీ జంతువులికీకూడా జబ్బులు మనకిమాదిరిగానే వస్తాయి. కోతులికి జ్వరాలువస్తాయి. వాతం కమ్ముతుంది. మనుష్యులికి వచ్చే జబ్బుల్లో దాదాపు అన్నీ కోతులికీవస్తాయి. పాపాలసంగతి మనంచెప్పలేం. మనుష్యులు చేసే తప్పులుకూడా పరిస్థితులవల్లనేనని చెప్తారు. కోపం, అసూయ, భయంవంటివి మనిషిలో బలహీనతకి లక్షణాలు ఈ బలహీనత మనస్సుకి సంబంధించినదీ, శరీరానికి సంబంధించినదీకూడా అయివుంటుంది. అయితే ఈ బలహీనతకి లోబడకుండామనిషి మనస్సుని అదుపులో పెట్టుకుని, గుండెని దిట్టపరుచుకోడానికి ప్రయత్నంచేస్తాడు. ఈ ప్రయత్నంలో పరీక్షపాసవడం వంటిదిఉండదు. పూర్తిగా ఎవరికీ నూరుమార్కులూ రావు, సున్నాలూరావు. కొందరికెక్కువ మార్కులూ కొందరికి తక్కువ మార్కులూవస్తాయి. పరిస్థితులు ఎంత మొత్తుతున్నా ధైర్యంగా నిలిచినవాడే మొగాడు. పక్షులూ జంతువులికికూడా భయం, కోపం, అసూయవంటివి ఉంటాయి. కుక్కల్ని పెంచేవాళ్ళకీ, పశువుల్ని పెంచేవాళ్ళకీ, పక్షుల్ని పెంచేవాళ్ళకీ ఇది బాగా తెలిసిన విషయమే. దీన్నిబట్టి ఏంతెలుస్తుందంటే పాపాలకీ, జబ్బులికీ ఎలాటి సంబంధంలేదు. పశువుల్నీ పక్షుల్నీ చంపికాల్చుకు తినడం పాపమనుకుంటే, ఈపాటికి మనుష్యులందరికీ, (అసలు ఒక్కణ్ణి విడిచిపెట్టకుండా) పెద్దపెద్ద జబ్బులువచ్చి ఉండాలి. మనుష్యులికే కాకుండా జంతువులికీ పక్షులికీ కూడా జబ్బులురావడం పరిశోధకు లెరుగుదురు. పక్షులికి టైఫాయిడ్ జ్వరంకూడా వస్తుందిట.

అసలు అనారోగ్యమనే దానినుంచి ఎవరూ తప్పించుకోలేరు. అపక్వాహారం అలవాటైతే ఏరోగాలూరావనీ, పాపకర్మంవల్లనే రోగాలువస్తాయనీ ఇటువంటి వాదాలన్నీ పొరపాటు. ఆరోగ్యంఅనేదీ అనారోగ్యంఅనేదీ శరీరంయొక్క స్థితులు. మనం తినే తిండీ, ఎండావానలు, చలి మొదలైనవి నిత్యం మారుతుంటే, ఆ మార్పుల ప్రకారం సరిపెట్టుకోడానికి మన శరీరం కృషిచేస్తుంది. ఆకృషిచెయ్యడంలో శరీరస్థితిలోకలిగేమార్పులు జబ్బుల రూపంలో మనల్నితట్టి, తిట్టి, కొట్టి చెప్తూఉంటాయన్నమాట. అంతే. జబ్బులికి భయపడనూ కూడదు, బెంగపెట్టుకోకూడదు. తగిన చికిత్సచాలవరకూ శరీరమే స్వయంగా చేసుకుంటుంది. తరుచు దీనికి చికిత్స సహాయం అవసరమౌతూ ఉంటుంది.

పిల్లలూ! మీ రంతా హరి కథలు వినే ఉంటారు. హరి దాసు, 'అంత వైశం పాయనుడు జనమేజయునితో ఇలా చెపుతున్నాడు' అని చెప్పడంకూడా వినే ఉంటారు, అయితే ఈ వైశం పాయను డెవరో జనమేజయు డెవరో, ఎందుకు చెప్తున్నాడో మీకు తెలియదు కానీ, కథవింటూ ఆ సంగతే మర్చిపోతారు. ఈ కథలో అంతా తెలుస్తుంది చదవండి.

అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు. పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు. జనమేజయుడు రాజ్యము పరిపాలించుచుండగా ఒకరోజున వ్యాసమహర్షి వచ్చెను. జనమేజయుడు వ్యాసుని పూజించి తరువాత ఇట్లనెను "మహాత్మా! కురుపాండవులకు నమానులైన మీరు భారత యుద్ధము ఏల ఆపలేదు"

'కాలకర్మవశమున నా మాటలు విన'లేదని వ్యాసముని చెప్పెను.



"త్రికాల వేదులయిన మీరు చెప్పినను వినకపోవుట ఎట్లు" అని జనమేజయుడు వ్యాసుని ఎగతాళి చేసెను.


'గ్రహస్థితి బాగా లేనప్పుడు, ఎటువంటి వాడు మంచిమాటలు వినడు. నీవే నామాటలు వినవు' అని వ్యాసుడు బదులు చెప్పెను. 'మహర్షివర్యా; నే నెన్నడును మీ మాటలు జవదాటను. ఆవిషయమేమో శెలవిండని' వచించెను.

'రాజా! నీ పురమునకు చక్కని గుఱ్ఱమును వర్తకులు తెచ్చెదరు. నీవు దానిని కొనకు. కొనినను దానిపై ఎక్కకు. ఎక్కినను పడమటి దిక్కుకుపోకు పోయినను అచ్చట కన్పించు స్త్రీతో మాట్లాడకు. మాట్లాడినా ఆమె చెప్పినట్లు చేయకు. ఇక రెండవది. నీవొక కారణమున మూడవ అశ్వమేధ యాగము చేయ తలపెట్టెదవు. అది విఘ్నమగును కావున ఆ ప్రయత్నము మానుము; అని చెప్పి వ్యాసుడు వెడలిపోయెను.

కొంత కాలము తరువాత హస్తినా పురమునకు చక్కని గుఱ్ఱమును వర్తకులు తెచ్చిరి. చూడ ముద్దుగావున్న ఆగుఱ్ఱమును చూసినంతనే జనమేజయునకు వ్యాసుని మాటలు జ్ఞాపకము వచ్చెను కాని సాలలో ఉంచిన నష్టమేమని అట్లు చేసెను. కొంత కాలము తరువాత, అతడు దానిపై ఎక్కి పడమటి దిక్కుకుపోక తూర్పునకు పోయిన తప్పేమని, దానిపై ఎక్కెను. అది వెంటనే వాయువేగముతో పడమటి దిక్కుగానే పోయెను. రాజు దానిని మరలించలేక పోయెను. కొంత దూరము వెళ్లిన తరువాత గుఱ్ఱము మెల్లిగా నడువ ప్రారంభించెను.

అంత రాజునకు చక్కని సంగీ

తము వినవచ్చెను. జనమేజయుడు గుఱ్ఱము దిగి సంగీతము వచ్చు వేపుగా పోయెను. అచ్చట అతనికి ఒక గంధర్వ సుందరాంగి కని పించెను. జనమేజయుడామె అంద మునకు చకితుడై, మోహించి తన కోర్కె ఆమె కెరింగించెను. ఆమె అంగీకరించి, రాజా! నేను రోజు వీణ వాయించుకొను చుండ, ఆపుట్టనుండి ఒకపాము వచ్చుచ్నుది దానిని చంపలెననిచెప్పెను వెంటనే



జనమేజయుడు ఆపుట్టను తెగవేసెను. పాముతోపాటు, పుట్టలో తపము చేయుచున్న ముని శిరము తెగి పడెను. జనమేజయుడు ఈసంగతి ఆమె నడిగి తెలుసుకొన వలెనని వెనుకను తిరుగునంతలో, ఆస్త్రీ, గుఱ్ఱము మాయమయ్యెను. ఇదేదో మోసమనుకొని రాజు పిచ్చి వాని వలె అడవులలో తిరుగుచుండెను. రాజుకోసమై వెదకుచున్న భటులు రాజునునగరమునకు తీసుకొనిపోయి రి. కొంతకాలము తర్వాత జనమే జయునకు బ్రహ్మహత్యా దోష ఫలితముగా కుష్టురోగము వచ్చెను. అది ఎన్ని మందులకు తగ్గక పోవుటచేత, అశ్వమేధ యాగము తలపెట్టెను.

అతని యాగాశ్వము నెవ్వరు అడ్డలేదు. కాని ఇంద్రుడు యాగము విఘ్నము చేయుదలచి, మరణించిన యజ్ఞాశ్వములో దూరి రాణి క్రియలు చేయుచున్నపుడు గుఱ్ఱము సకిలించి రాణిపై బడునట్లు చేసెను.

జనమేజయుడు రాణిపైన పురో హితులపైన కోపించి దేశ భ్రష్టులు కండని ఆజ్ఞాపించెను. ఇంతలో విశ్వావసువనెడి గంధర్వుడు ప్రత్యక్ష మయి, జరిగిన దంతా జనమే జయునకు చెప్పెను. జనమేజయుడు నొచ్చుకొని రాణిని పురోహితులను క్షమించమని వేడుకొనెను.

అంత కొంతకాలమునకు వ్యాస మునివచ్చి, "నే వెనుక చెప్పినది అనుభవమయ్యె కదా! రాగల ఆపదలనుభవింపక తప్పదు" అని నుడివెను.

అందుకు జనమేజయుడు అల్పుడ నని మునిని వేడుకొని, తన కుష్టు వ్యాధి నివారణకు మార్గము చెప్పు మని వేడెను.

తాను రచించిన ఇతి హాసమును దీక్షతో విన్న కుష్టు రోగము నశించుననియు, వినుచూ, అనుమానములు తీర్చుకొనవలె ననియు, చెప్పి అందుకు తన శిష్యు డైన వైశంపాయనుని నియమించెను. అంత వైశంపాయనుడు భరత వంశీ యుల గాధలను కురుపాండవుల గాధలతో కలిపి భారతమును గ్రంధ మును జనమేజయునకు వినిపించెను. ఆ తరువాత, జనమేజయునికి కుష్టు రోగముపోయి ఎప్పటి మనిషిగా మారెను. ఎంతవారికయినను రాగల ఆపదలను అభవించక తప్పదు కదా! ★

సత్యమైన అబద్ధం

(26-వ పేజీ తరువాయి)

విచారించడం మొదలు పెట్టాను, అట్టవేసిన చెప్పులు కొనేదా, లేక తోలువేసిన చెప్పులు కొనేదా? అని. ఎందుకనగా వాడు అట్టచెప్పులైతే ఇప్పుడే అరగంటలో ఇస్తానంటున్నాడు, తోలుచెప్పులైతే రేపురావాలట. ఇంకా నేను విచారిస్తూనే యున్నాను, ఇంతలో వాడన్నాడు "ఏమండోయ్, ఇలా కూర్చోండి, ఇదిగో అనవసరంగా రూపాయి పాడుచేసుకోకండి తోలులేదు, అట్టాలేదు, రేపు మీరు వచ్చేవరకు ఇవ్వే తోలువని చెబితే మీరు ఏర్పాటు చేస్తారా? అన్నాడు వాడు నవ్వుతూ. "నిజమే ననిపించింది నాకు. అట్లానైతే రెండున్నర పెట్టి అట్ట చెప్పులే, కావాలనిపించినది. వాడేదో మంచివాడు కాబట్టి చెప్పాడు. లేకపోతే అనవసరంగా రూపాయి నష్ట పరుచుకుంటాడా అనుకున్నాను. "సరే" కుట్టమన్నాను. అరగంటలో కుట్టి వేశాడు. అట్టవేస్తూ అన్నాడు "మీ ముఖంచూస్తే మోసంచేయ బుద్ధి కాలేదుండి" అని. సరే ఎట్లానైతేనేం, చెప్పులు కొనుక్కొని అట్లానే మా స్నేహితుడి ఇంటికి వెళ్లి లేడని తెలుసుకుని మళ్లీ దుకాణం ముందర నుండి వస్తున్నాను. కొన్ని మాటలు విని తెల్లబోయినాను. "ఇంత తెలియదా ఏమిటినాకు? అబద్ధం చెప్పినా అంత తెల్లగా వాండాలి, లేకుంటే రేపు పురొస్తారా?" అని. ★

వోల్తేర్

(24-వ పేజీ తరువాయి)

శ్శించి నందుకు అతన్ని ప్రభుత్వం రెండుసార్లు ఖైదులో పెట్టింది. తరవాత ఇంక ఫ్రాన్సులో ఉండలేక ఇంగ్లండ్ వెళ్లాడు. "మానవులందరూ సమానులే. స్వేచ్ఛగా ఎవరివృత్తిని వారనుసరించి స్వతంత్రంగా బ్రతకడం అందరికీ జన్మ హక్కు" అని ప్రచారం చేశాడు. అంటే మానవుల హక్కుల్ని గురించి అమెరికాలో థామస్ పెయిన్, జెఫర్సన్ మొదలైనవారు ఉద్యమం ప్రారంభించడానికి ముందే వోల్టేర్ అటువంటి అభిప్రాయాలను ప్రచారం చేశాడన్నమాట. హాస్యమైన సంభాషణలతో, వ్యంగ్య పదాలతో ఆనాటి సమాజాన్ని అవహేళన చేస్తూ వ్రాసేడు. క్రమక్రమంగా అతని రచనల్ని అందరూ గౌరవించడం మొదలు పెట్టారు. రష్యన్, ప్రష్యన్ పరిపాలకులు మొదలు సామాన్యజనం వరకూ అందరూ అతని సలహాలు తీసుకోవడం మొదలుపెట్టారు. కాని అధికారుల గర్వాన్ని దౌర్జన్యాన్ని సహించేవాడు కాదు. అందువల్ల తిరిగి అన్ని దేశాలూ అతన్నే బహిష్కరించాయి. చివరికి జినీవాలో నివాసం ఏర్పరచుకోవలసి వచ్చింది. ముసలితనం వచ్చేవరకూ అక్కడే ఉన్నాడు. వోల్తేర్ తన రచనలద్వారా సాగించిన ఉద్యమం వల్లనే, యూరప్‌లో చాల దేశాలు నేరవిచారణకు సంబంధించిన శాసనాల్ని మార్చుకున్నాయి. ఎనభైనాలుగో యేట అతను తిరిగి స్వదేశం చేరుకున్నాడు. అప్పుడతనికి పారిస్ నగరం అఖండమైన సన్మానమిచ్చింది. కాని ఆపైన నాలుగు మాసాలకంటె అతడు జీవించలేదు. 1778 మే 30 వ తేదీన వోల్తేర్ చనిపోయాడు. చర్చి అధికారులు అతనిశవాన్ని మతాచారాల ప్రకారం సమాధి చెయ్యనివ్వలేదు. వారికి తెలియకుండా పారిస్ నగరానికి దూరంగా పాతిపెట్టవలసి వచ్చింది. అయితే ఫ్రెంచిదేశ ప్రజానీకం అతన్ని మరిచిపోలేదు. ఫ్రెంచివిప్లవ సమయంలో విప్లవవీరులు అతనిశవాన్ని తీసి ఊరేగింపుతో నగరానికి తీసుకువచ్చి ఫ్రెంచి మహాపురుషులకు ప్రత్యేకింపబడినచోట సమాధి చేశారు. మానవులకు భావస్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహావీరుడని అతన్ని ఫ్రెంచిదేశస్థులారాధిస్తారు. ★

ఏచిలక్కి ఆపలుకు

(7-వ పేజీ తరువాయి)

గారి ఇంట్లో వాలాడు. ఖర్చులన్నీ తనే భరాయించి ఖర్మలన్నీ ఎంతో ఘనంగా చేయించాడు. ఇన్ని చేసినా వదినగారు ఏమున్నా నే - కడుపులు నింపేయిరా బాబూ - ఇక సుఖంగా నిద్రపోతారా నాయినా' - శోకాలు పెడుతూ సూటిగా సీతారామయ్యను నిందిస్తూ మాటలువిసిరేది.

ఆ! అంటున్నమాటలు తననే అని గ్రహించుకున్నా సీతారామయ్య కిక్కురుమనకుండా వూరుకునేవాడు. ఆది లక్ష్మిని చూచి ఆడదానిలా ఆ వురుమని ఏడ్చేవాడు. తనతో ఇంటికి రమ్మనివదిన గార్ని ఎంతో ప్రాధేయపడి అడిగాడు. ఆమె తిరస్కరించింది. తుదకు సరస్వతిని తీసుకుపోతానన్నాడు. ఏమనుకుందో ఏమో ఆ మాటకు మౌనంగా వూరుకుంది.

శంకర్రావు సరస్వతులు చిన్నప్పుడు మొగుడుపెళ్లాల ఆట ఆడుకుంటుంటే చాటుగా చూచి ఎంతో ఆనందించేవాడు సీతారామయ్య. ఆటలో మునిగిన ఇద్దరి ఎదుటా పడేవాడు. వాళ్లుసిగ్గుతో బుర్రలు వంచుకుని నిలబడితే దగ్గరకు తీసుకుని ఓప్రక్క సంతోషిస్తూ ఓ ప్రక్క చనిపోయిన తోబుట్టువుల్ని స్మరించుకుంటూ కళ్లంట నీళ్లు కార్చేవాడు.

శంకర్రావును 'బి. ఏ' వరకూ చదివించాడు. చిన్నప్పుడే తమ బాంధవ్యాన్ని స్థిరపర్చుకున్న సరస్వతీ శంకర్రావులవివాహం చేశాడు.

వివాహమయిన మొదటినెలలో 'ఉద్యోగంచేస్తాను మావా' అని శంకరం అంటే మతిగాని పోయిందా ఏమిట్రా! అంత ఉద్యోగంచేసి ఎవర్ని పోషించాలి? ఇదంతా ఎవరిది? మీరిద్దరూ చిలకాగోరువంకల్లా మానట్టింట హాయిగా వుండాలని మేమనుకుంటుంటే నీకీ దుర్బుద్ధి ఎలా పుట్టిందిరా? జాగ్రత్త! ఇటువంటి పిచ్చివేషాలు మానేయి. సీతారామయ్య మేనల్లుడిని కొట్టినంత హంగామా చేశాడు. అప్పట్లో శంకరం అనుకున్నాడు, నిజంగా మావదేవతా స్వరూపుడు.

కాలచక్రం గిర్రున తిరిగింది అప్పుడే పదిహేను పంచాంగాలు మారాయి. ఈపదిహేనేళ్ల కాలంలోనూ సీతారామయ్య కుటుంబంలో ఎన్నో మార్పులు జరిగాయి. పెండ్లయిన రెండో సంవత్సరంలో పుట్టిన కొడుకు తప్ప మిగతా నాల్గు కాన్పులకూ పుట్టిన పిల్లలు పురిటిలోనే చస్తూ అయిదో కాన్పుకు పురిటిలో పిల్లను విడచి సరస్వతి తనువుచాలించుకుంది.

సరస్వతికంటె మూడేళ్లు ముందుగా సీతారామయ్య వదినగారు చనిపోయింది. తల్లిచనిపోయినా ఆమె గుణాల వాతావరణంలో పెరిగిన ఆది లక్ష్మి పినతండ్రి ఎంత బ్రతిమిలాడినా 'నీకూ - నాకూ సంబంధం లేదని' ఆ స్తంతా పోగా మిగిలిన రెండు ఇళ్ళను అద్దెకిచ్చి తనో ఇంట్లో వుంటూ ఒకర్తే కాలక్షేపం చేసుకుంటుంది.

ఇంతలో సరస్వతి చనిపోవడంవల్ల మనస్సులో ఇష్టంలేకపోయినా పినతండ్రి ఇంట్లో ఆదిలక్ష్మికి కాలుపెట్టక తప్పింది కాదు. అడుగుపెడ్తూనే కలహాలకు త్రోవ తీసింది. ఎన్నివివాదాలు వచ్చినా సీతారామయ్య ఏమాత్రమూ చలించకుండా మొదటినుంచీ అన్నగారి కుటుంబ మనస్తత్వాన్ని అవగాహన చేసుకున్న వాడవ్వడంవల్ల ఆదిలక్ష్మి గిల్లి కయ్యానికి కాలుదువ్వినా లెక్కచేయకుండా అటు తనవారినందర్నీ లోలోపల సమాధానపరుస్తూ, పూర్తిగా ఆదిలక్ష్మిదేతప్పయినా బహిరంగంగా ఆమెనే సమర్థిస్తూ, ఇప్పుమీద నీళ్లు జల్లినట్టు ఆతగువులన్నీ నిట్టే పరిష్కారంచేసేవాడు.

పినతండ్రిని ఎలాగైనా వీధిని పెట్టి ఆభాసు చెయ్యాలని మొదటినుండీ పట్టుదలతోనున్న ఆదిలక్ష్మి తననుకున్నట్టు ఏపనీ కార్యరూపందాల్చి అమలులోకి రాపోగానే ఆమెపట్టుదల మరీ హెచ్చయింది.

ఏమైనాసరే పినతండ్రిని బాధపెట్టి తీరాలి. ఆనాడే తన చనిపోయిన తల్లిదండ్రుల ఆత్మలకు శాంతి లభిస్తుంది. ముఖ్యంగా తన తల్లి ఆశయాల్ని నెరవేర్చాలి. 'తన బ్రతుకు ఇలా నడివయస్సులో నీళ్లు కారిపోవడానికి కారణం తన పినతండ్రేగా? అన్నగారు చనిపోగానే తమను అనాథలను చేసి తల్లీ కూతుళ్లనుపైకి గెంటింది ఈ సీతారామయ్యేగా. తడిగుడ్డతో గొంతుకలు కోసే ఘాతకుడు. తన తల్లి బ్రతుకున్న రోజుల్లో తనతో అన్న ఈమాటలు సింహావలోకనం చేసుకుంది ఆదిలక్ష్మిలోని పట్టుదలఆవేశరూపందాల్చింది.

సరస్వతి చనిపోయినపదిహేనో రోజున మేడమీద వంటరిగా కూర్చుని గత జీవిత ఘట్టాల్లోని మధురస్మృతులను స్మరించుకుంటూన్న శంకర్రావుని ఆదిలక్ష్మి పలకరించింది.

"ఏమోయి శంకరం ఏం! అలా దిగాలుగా కూర్చున్నావు? పోయినదానికి విచారిస్తే లాభం ఏముంది? ముందుగతి ఆలోచించు. నీ పిల్లల భవిష్యత్తు ఎలా పరిణమిస్తుందో అన్న ఆలోచనలో పడు."

శంకర్రావు ఆదిలక్ష్మికేసి ఆశ్చర్యంగా చూచాడు. వదినగారి మాటల్లోని భావం సహస్రాంశమైనా అర్థం కాలేదన్నట్టు అమాయకంగా అన్నాడు. మీరేమిటంటున్నారో నాకు అర్థమవలేదు."

"అవును. ఇందులో నిన్ననవలసిన పనేమీ లేదు. వాడు నిన్నిలా తయారుచేశాడు. అయినా నేను చూస్తూ ఈ అన్యాయాన్ని సహించలేను. ఏమిటోయి పిచ్చివాడిలా అలా చూస్తావేం? ఇప్పుడు కాపోయినా సీతారామయ్య తదనంతరం అతని సంతానం నిన్నూ నీ పిల్లలనీ 'మీ మార్గం మీరు చూచుకోండంటే' నీవేం చెయ్యగలవు? నీ పిల్లల గతేం కాను? బాగా ఆలోచించుకో" ఆదిలక్ష్మి తీవ్రంగా అంది.

"అయితే మావ నన్నూ నా పిల్లలనీ అన్యాయం చేస్తాడంటావా?" శంకరం అదోమాదిరిగా అసంతృప్తి కనబరచే స్వరంతో ప్రశ్నించాడు.

అతని ప్రశ్నాధోరణికి ఆదిలక్ష్మి కొంత జంకినా పైకి కనబర్చకుండా తన ఆశయాన్ని నెరవేర్చుకోవాలన్న ఆవేశంతో "ఇంకా ఏం కావాలోయి? ప్రత్యక్షంగా కంటికి కనిపిస్తుంటేను. ఈ ఇంట్లో నీకూ నీ పిల్లలకూ వున్న హక్కు ఏమిటి? ఏదీ మచ్చుకు చూద్దాం! ఈ వస్తువు నీదీ అని అనగలుగుతావేమో చూడు? పిచ్చివాడా! ఏదో తియ్యటి మాటలు అంటున్నాడు అంతే చాలునని మహాదేవుడని సీతారామయ్యను పూజిస్తున్నావు? మాట వరసకి చెప్తున్నా

విను. అవతల వీధిలో వున్న పెద్దమేడ మీ అమ్మకు తాతగారు వ్రాసియిచ్చేరు. ఈ సంగతి ఇంతవరకూ నీకు తెల్సా? నీకే కాదు కుటుంబంలో ఒక్క సీతారామయ్య భార్యాభర్తలకుతప్ప మరెవ్వరికీ తెలియదు. మీ అమ్మ అవసాన కాలంలో మాటల సందర్భంలో ఈ రహస్యం పైకి తేలింది. అయినా అప్పట్లో ఈ విషయమై అంతగా ఎవరూ పట్టించుకోలేదు. కాలం జరిగిపోయింది. ఈవిషయం తెల్సున్న మా నాన్నా అమ్మలుకూడా గతించేరు. ఇక తెల్సున్న వాళ్లు సీతారామయ్య అతని భార్యాను. అడిగేవాళ్లు లేరుకదా అని వాళ్ళూ మాట్లాడకుండా వూరుకున్నారు. నిజంగా నీమీద ఏమాత్రం ప్రేమాభిమానాలున్నా ఈ విషయం నీతో సీతారామయ్య ఏనాడో చెప్పివుండాల్సింది. దాని అంతరార్థం నీవే గ్రహించుకో. ఈ విషయం మా అమ్మ చనిపోతూ నాతో మరీ మరీ చెప్పింది. ఎన్నో పర్యాయాలు నీతో చెప్పుదామనుకున్నా అవకాశం చిక్కలేదు. ఇప్పుడా అవకాశం లభించింది. నీతో చెప్పాను. తర్వాత నీ ఇష్టం. సీతారామయ్య ఇన్నాళ్ళూ నీమీద ప్రేమచేతనే ఓ చిల్లుకానీ గడింపు లేని నిన్ను పోషించేడనుకుంటున్నావు. అది పొరపాటు. నీ విషయంలో కాని నీ కుటుంబవిషయంలో కాని అతను తన స్వంతంలోది ఓ గవ్వకూడా ఖర్చు చెయ్యలేదు. ఆ మేడ మీద వచ్చే మూడు వందలరూపాయల అద్దీ ఇన్ని సంవత్సరాల బట్టీ లెక్క చూచుకుంటే ఖర్చులుపోను ఇంకా ఎంతో డబ్బు నీకే రావలసి వుంటుంది ఏం అలా చూస్తున్నావు? అబద్ధమనా? నిజం తెల్సుకోవాలంటే సీతారామయ్యనే అడుగు. బాగా ఆలోచించుకో. పనుంది వస్తాను" మెల్లిగా మెట్లు దిగి ఆదిలక్ష్మి వెళ్లిపోయింది.

శంకర్రావు నిశ్చేష్టితుడయ్యాడు. అతనిలో ఏదో తెలియని ఆందోళన ప్రారంభమయ్యింది. తన వదినగారు అన్నట్టూ ఆ ఇల్లు తన తల్లిపేర వుండడంవల్లే సీతారామయ్య తనను పోషిస్తున్నాడు ఆమె అన్న ప్రతీ మాటా అక్షరాలా నిజం అనిపించింది. ఈ విషయం ఒక్కనాడుకూడా సీతారామయ్య తనతో చెప్పలేదు. అబ్బ! మావ ఎంత లోతుగుండేవాడు. అతను వున్నంతకాలం ఎలాగో ఓలాగు కాలం వెళ్లిపోతుంది. అతని తదనంతరం తన బ్రతుకేం కావాలి? ముఖ్యంగా తన పిల్లలు ఏమయిపోతారో? ఏమైనాసరే దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం మంచిది! శంకర్రావు హృదయంలో తర్జన భర్జనలయ్యాయి. తుదకు వదినగారు చెప్పినట్లు మావను అడగాలనుకున్నాడు. వదినగారు నిజంగా తనకు మార్గదర్శకురాలయ్యింది. లేకపోతే తను ముందుకు ఏమయ్యేవాడో?

సాయంత్రం ఎక్కడికో బయలుదేరుతున్న సీతారామయ్యతో మేడ మెట్లు దిగుతూ మెల్లిగా అన్నాడు "మావా! ఒక్క మాట." ఆ రెండు ముక్కలూ అనడానికి శంకర్రావు గొంతుకు ఎందుకో తడబడింది.

చెప్పులు వేసుకుంటున్న సీతారామయ్య ఎంతో ప్రశాంతంగా "ఏంరా! ఏమైనా పనుందా? ఏం కావాలి?" చిన్నప్పటి నుంచి శంకర్రావుకు ఏదైనా అవసరంవుండి సీతారామయ్యను పలుకరించినప్పుడు సీతారామయ్య ఏధోరణిలో అయితే 'ఏం కావాలని' అడిగేవాడో అదే ధోరణిలో ఇప్పుడూ అడిగేడు.

"అబ్బే ఏం లేదు మావా? ఓ ముఖ్య విషయం నీతో మాట్లాడాలి?" శంకర్రావు లోలోపల ఎంత ధైర్యంగా వున్నా సీతారామయ్య ముఖం చూడగానే ఏదో తెలిని భయం అతన్ని ఆవేశించి నోట్లోనుంచి ప్రతీ మాటా నీళ్లు కారుస్తున్నట్టయింది. అప్పట్లో తను ముఖాముఖీగా వదినగారు చెప్పినట్లు మావను అడగగలనా అని అధైర్యంలో పడ్డాడు. అయినా రోటిలో తలమార్చి రోకటిపోటుకు వెరవడం దేనికని ఏమైనాసరే ఈ అవకాశం జారబెట్టుకుంటే తన పిల్లలు ఏమయిపోతారో అన్న భయంకొద్దీ మావను ఈ విషయమై అడిగి తీరాలన్న నిర్ధారణకు వచ్చాడు.

మేనల్లుడు అలా నీరుకారుస్తూ మాట్లాడుతుంటే సీతారామయ్య ఎంతైనా జాలి పొందేడు. తనలో అనుకున్నాడు. 'పాపం! మొదటినుంచీ వాడి అదృష్టం ఒకలాగే వుంది. పురిటిలోనే కన్నవాళ్లు కనబడకుండా పోయారు. పోనీ ఏదో పెద్దవాడయ్యాడు సుఖంగా కాలం జరిగిపోతుందంటే మళ్ళీ ఇప్పుడీ ఖర్మ. సరస్వతి పోవడం మూలాన్న వాడు పూర్తిగా బెంగ పెట్టుకున్నాడు. "అప్రయత్నంగా అతని కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. కాని శంకర్రావు చూస్తుండగా తను ఏమాత్రం కంట తడిపెట్టినా పుండుమీద పుల్లగుచ్చినట్టు ఎంత క్షోభపడ్తాడో అని ఆ పూరివ నీటిని అలానే ఇముడ్చుకుని ఎంతో గాంభీర్యంగా"అయితే నాతో రారా. త్రోవలో మాట్లాడుకుందాం లేకపోతే పార్కుకి పోదాం అలానైనా కాస్త మేనల్లుడు శాంతపడతాడని సీతారామయ్య శంకర్రావుని తనతో రమ్మన్నాడు.

పార్కు చేరేవరకూ శంకర్రావు ఏమీ మాట్లాడలేదు. మధ్యమధ్య సీతారామయ్య మాత్రం శంకర్రావు కుమారుల చిలిపి చేష్టల్ని పొగుడుతూ తన మనుమలు ఎంతైనా గొప్ప అదృష్టజాతకులని ఇంకా ఏమిటేమిటో చెప్పతూ మేనల్లుడు ఆహ్లాదకరంగా ఉండేటట్టు చెయ్యాలని ప్రయత్నించాడు.

ఇద్దరూ పార్కులో ఓమూల జనసంపరకంలేని జాగాలో కూర్చున్నారు. 'సీతారామయ్య చుట్టముట్టిస్తూ "ఏంరా! ఏదో మాట్లాడాలన్నావు?"

ఈ ప్రశ్నతో శంకర్రావు గుండెల్లో పిడుగుపడ్డట్టయింది. ఇంతవరకూ తన కుమారులను ఎంతగానో ప్రశంసించిన సీతారామయ్య మాటలు ఇంకా తన కర్ణకుహరాల్లో గింగిరులు పెడుతూనే వున్నాయి. పొత్తిళ్లలోని తనని పెంచి ఇంతవరకూ పెద్దవాడినిచేసిన మావతో తాను ఏమని ●డగగలడు? ఇంకా ఎన్నో అనుభూతులు శంకర్రావు హృదయాన్ని పూర్తిగా గిజగిజలాడించాయి. ఓప్రక్క ఆదిలక్ష్మి చేసిన హెచ్చరిక ఓ ప్రవక్త హితబోధలా రెచ్చగొడుతుంది. ఆఖరుకి నిశ్చయానికి వచ్చాడు. ఎలానైనాసరే ఈ విషయమై ఏదో తెగతెంపులు చేసకోవాలి. మెల్లిగా అన్నాడు. "అబ్బే ఏం లేదు మామా! ఓ చిన్న విషయం. అవతల వీధిలోవున్న పెద్దమేడ మా అమ్మదని విన్నాను. నిజమేనా?"

చుట్ట కాలుస్తున్న సీతారామయ్య శంకర్రావు నోటంటవచ్చిన మాటలతో గతుక్కుమన్నాడు. చుట్ట పొగనుగట్టిగా లోపటికి లాగాడు. పొగను జోరుగా వదుల్తూ చుట్టమసిని చేతితో దులుపుతూ శంకరాన్ని అదో మాదిరిగా చూస్తూ "ఇప్పుడు దాని అవసరం ఏమొచ్చిందిరా? ఊఁ! నిజమే అది మీ అమ్మదే కాని ఆమె తదనంతరం ఆ హక్కులు నావి. నీకుగాని, నీ సంతతికిగాని ఆ ఇంటిమీద ఏమాత్రమూ అధికారంలేదు. మానాన్న వీలులో ఆమె బ్రతికున్నంతకాలం అనుభవించడానికే వ్రాశారు" శంకరం తనను ఆ ప్రశ్న ఎందుకు వేశాడో పూర్తిగా అవగాహన చేసుకునే భోగట్టా అంతా తిరిగి శంకరం మరో ప్రశ్న వేయకుండా సీతారామయ్య చెప్పేడు. అతను వెంటనే అనుకున్నాడు కూడాను ఈవిషయంలో ఆదిలక్ష్మి ముఖ్య పాత్ర ధరించిందని.

సీతారామయ్య ఇచ్చిన జవాబులో శంకరం మరేమీ మాట్లాడలేదు. మాట్లాడ్డానికి అవకాశంకూడా ఎక్కడా కని

పించలేదు. మెల్లిగా లేచాడు. "ఇంటికి పోతాను మావా ?"

వెళ్తావన్న శంకరాన్ని సీతారామయ్య మరేమీ అనకుండా మౌనంగా వూరుకున్నాడు. శంకరం మెల్లిగా ఇంటిముఖం పట్టేడు.

మేడ మెట్లెక్కుతున్న శంకర్రావు వెనకాలే ఆదిలక్ష్మి బయలుదేరింది. మెల్లిగా అడిగింది. "ఏమోయి. అడిగావా ?"

"ఆ! అడిగాను. నాకేమీ వొక్కలేదన్నాడు" నిరుత్సాహంగా సీతారామయ్య తనతో అన్న యావత్తు విషయమూ శంకర్రావు ఆదిలక్ష్మితో చెప్పాడు.

ఆదిలక్ష్మి కళ్లు పెద్దవిచేస్తూ చూశావా నేను అన్నంత పనీ అయింది ముందే చెప్పేను. వాళ్ళంతా మేకవన్నె పులులు. ఇప్పటికైనా బోధపడిందా? ఇదుగో! నే చెప్పినట్టూ విను. నీ పిల్లలతో మా ఇంటికి వచ్చేయి. ఆ తర్వాత సంగతి ఆలోచిద్దాం. ఆ ఇల్లు నీకు ఎలా రాదో చూస్తాను. ఈ దెబ్బతో సీతారామయ్య ఎలాంటివాడో లోకానికి తెలిసిపోతుంది. అందరూ మహా మంచివాడని ఎంతో పొగిడి కొండమీద కూర్చోబెడతున్నారు. మాట్లాడితే, నిన్నూ నీ సంతానాన్నీ ఉపమానంగా తీసుకుని, మిమ్మల్ని పెంచి వేస్తున్నాడని ఎంతో ఆదర్శప్రాయుడని చెప్పుకుంటున్నారు. కదులు. ఆలశ్యం చేస్తే లాభంలేదు రా. ఇప్పుడే పోదాం. మీ పెద్దబ్బాయి రాడని అనుమానం పడుతున్నావేమో? వాడు నే నెలా చెప్తే అలా వింటాడు. నన్ను విడచి ఒక్క క్షణం కూడా వుండలేడు. నా చెల్లెలి పిల్లలు నాకొక్కవాలి కొని మరిం కెవరికైనా ఎంత ఆప్తులైనా ఎందుకవుతారు? నేను ఇంట్లో కాలుపెట్టిన దగ్గరనుంచీ వాడు నన్ను అమ్మ అని పిలుస్తూ ఒక్క నిముషంకూడా విడువలేదు వాడిని నానుంచి వేరు చేద్దామనీ ఈ ఇంట్లో చాలామంది ప్రయత్నించి విఫలులయ్యారు. మీ మావ పెళ్ళాం ఓపర్యాయం నామీదకు దెబ్బలాటకూడా వచ్చింది. కుర్రవాడికి డబ్బు లిచ్చి పాడు చేస్తున్నావని. ఆడుకునే కుర్రాడు. ఇంకా పట్టుమని పన్నెండేళ్లయినా నిండలేదు. తోటికుర్రాళ్లంతా అవసరమైన వస్తువులు కొనుక్కుంటుంటే వాడు చూస్తూ నోట్లో వేళ్లు కుక్కుకొని కూర్చోవలసిందే. మొన్న ఎదురింటివారి కుర్రాళ్ళు పీసు మిఠాయి కొనుక్కు తింటుంటే వాడు అమాయకంగా గోడకు జార్లపడివాళ్లను చూస్తుంటే నా హృదయం తరుక్కుపోయింది. నేనూ చూస్తూ వాళ్ళలా ఎలా వూరుకోగలను? అందులోను తల్లిలేని కుర్రాడు. నా చెల్లెలు కొడుకు. అప్పుడప్పుడు అణా అర్ధణా ఇస్తే తప్పా, నీ వింకా ఏమిటో అనుకుంటున్నావు? లే! వేగం త్వరపడు. సీతారామయ్యవస్తే నీ మనస్సు మారిపోతుంది. బండి పిలిపిస్తాను" శంకర్రావు జబాబుకైనా ఎదురు చూడకుండా ఆదిలక్ష్మి చరచరా క్రిందకు దిగి వెళ్ళిపోయింది.

చీకటిపడినతర్వాత ఇంటికి వచ్చిన సీతారామయ్యకు ఇల్లంతా ఎందుకో ఖాళీగా కన్పించింది. తర్వాత భార్య కొడుకులు జరిగినసంగతి అంతా శంకర్రావు తనసంతానాన్ని తీసుకుని ఆదిలక్ష్మితో వెళ్లిపోవడం గురించి జరిగింది జరిగినట్లు చెప్పారు. సీతారామయ్య నిల్చున్నపాటున అగాధంలోకి కూరుకుపోతున్నట్లయింది. మాటలురాని పశివాడు ఎక్కడో తప్పిపోయినట్టనిపించింది. దీని కంతకూ కారణం ఆదిలక్ష్మి. ఆమె తనమీద అంతద్వేషం పూనడానికి కారణం ఏమిటో? అన్ని విధాలా వాళ్లందర్నీ బాగుచేద్దాము మొదటినుంచీ తనవుద్దేశ్యమైనా వాళ్లందరూ తనంటే ఓ కడజాతివానిలా చూస్తూ తను దగ్గరవుతున్న కొలదీవాళ్లు దూర దూరంగా పోతున్నారు. ఎడతెరిపిలేని ఆలోచనలతో నిస్పృహాగా భార్యను అడిగాడు "వాడువెళ్ళిపోతుంటే చూస్తూ వూరుకున్నావా ?"

"ఇంకా నయం చూస్తూ వూరుకున్నాము. ఆఖరుకి వంటివాడినైనా ఉంచేయమన్నా అబ్బే! పనేమీరావల్ల కాదని శంకర్రావుకంటె ముందు ఆదిలక్ష్మిగట్టిగా కేకలువేసుకుంటూ 'మీరు ఇంతవరకూ చేసిందే చాలు. ఇంతకుమించి ఇంకేం చెయ్యగలరు? ఆ అమాయకుడిని చూచి ఇంతవరకూ ఇష్టంవచ్చినట్టూ ఓ నాటకం ఆడేరు" ఇంకా ఏమిటేమిటో నోటికి వచ్చినట్లూ కూసి వంటివాడ్ని తీసుకువెళ్లిపోయింది. ఆవెనకాలే శంకర్రావుకిక్కురుమనకుండా మేం ఎన్ని విధాలా బతిమిలాడుతున్నా తుదకు మీరు వచ్చేవరకూ వుండమన్నా లెక్కచేయకుండా బండి ఎక్కేడు.

భార్యచెప్పినమాటలను వింటూ నీర్సంగా సోఫాలో సీతారామయ్య కూలబడ్డాడు. తనశరీరావయవములలో ఏదో కొరత ఏర్పడినట్టనిపించింది. తనలో అనుకున్నాడు. 'పోనీ ఇదీ మంచికేవచ్చింది. ఆదిలక్ష్మికి మిగిలిన ఆ ఒక్క ఇల్లూ ఆఖరుకి వాడికైనా దక్కుతుంది. ఒక్క పర్యాయం తనతో సమానవాటాగా పంచుకున్న అన్నగారి ఆస్థి హరించిపోయిన సంగతులన్నీ జ్ఞాపకం తెచ్చుకుని కళ్ళనీళ్లు కార్చేడు. ఇంకా ఏమిటేమిటో ఆలోచించుకుంటూ ప్రపంచాన్ని మరచివున్న సీతారామయ్య "ఏమండీ భోజనానికి లేవరూ ?" అన్న భార్య మాటలతో బాహ్యలోకంలో పడ్డాడు. పైమీద తువాలు చేతితో పట్టుకుని తనగదిలోకి వెళ్లిపోయాడు.

శంకర్రావు ఆదిలక్ష్మి ఇంటికివచ్చిన దగ్గరనుంచీ ఎక్కడో కీకారణ్యంలో వున్నట్టనిపించింది. ఎన్నో పర్యాయాలు అనుకున్నాడు తిరిగి వెళ్లిపోదామని. సీతారామయ్య కాళ్లమీద పడి క్షమించమని ఏడుద్దామనుకున్నాడు, "పాపం! అత్తయ్య! తల్లి అంటే ఏమిటో తెలియని తనకు మాతృస్థానమలంకరించి ఆలోటు తీర్చింది. తనుబండి ఎక్కుతున్నప్పుడు 'ఏమోయి శంకరం మీ మావయ్య వచ్చేవరకైనా వుండు' ఎంతో ప్రాధేయపూర్వకంగా అడిగింది. అప్పట్లో ఏడుస్తూన్న ఆమె ముఖంలోని దైన్యం ఇంకా తన కళ్లల్లో ఆడి కలవరపెడుతూనే వుంది. తన హృదయం అప్పట్లో అంత కరుడు కట్టుకపోవడానికి కారణం ఏమిటో? నిజంగా ఆదిలక్ష్మి తన పట్ల ఓరాక్షసిలా దాపురించింది. ఇప్పటికే విషాదంలో పొర్లాడుతున్న తన జీవితాన్ని విషాదాంతం చెయ్యాలని చూస్తుంది. తిరిగి ఇంటికి వెళ్లిపోతే మావ ఆదరిస్తాడా? ఏముఖం పెట్టుకుని వెళ్ళగలను? ఏమో! ఒకవేళ మావతనను పిలవడానికి వస్తాడేమో? ఆదిలక్ష్మి అన్నట్టు మావయ్య మమకారం ప్రత్యక్షంగా తేలిపోతుంది. నిజంగా మావకు నాయందు ప్రేమాభిమానాలుంటే తప్పకుండా వస్తాడు" ఆలోచించుకుంటూ సీతారామయ్య తనగురించి వస్తాడేమోనని వంటరిగా వరండాలో వెర్రివాడిలా కూర్చుని త్రోవంట పోయేదారిని పరీక్షిస్తూ గంటల తరబడి కూర్చునేవాడు.

శంకరం కొడుకు అప్పుడప్పుడూ తాతా అమ్మమ్మలదగ్గరకు పోతానని మారాంచేస్తే ఆదిలక్ష్మి ఏదో మాటలలో పెట్టి వాళ్లు చాలా దుర్మార్గులని, తమందర్నీ ఎంతైనా అన్యాయం చేశారాని, ఇంకా వున్నవి లేనివి ఎన్నో ఆపశిహృదయానికి హత్తుకునేటట్టు చెప్పి అప్పటికి సమాధానపరచి చేతినిండా డబ్బులుపెట్టి పైకి పంపించేది.

డబ్బులుచేతిలో పడగానే నిజంగా తాతా అమ్మమ్మలకంటే పెద్దతల్లే ఎంతో మంచిదని, పెదతల్లి చెప్పినట్టూవాళ్లు మంచివారుకారనే అపోహలో పడి చేతిలో డబ్బులుండడంవల్ల ఆనందంతో పైకి వెళ్లిపోయేవాడు.

ఆదిలక్ష్మికూడా, చిన్నప్పటినుంచీ సీతారామయ్య భార్యాభర్తలచేతుల్లో

పెరిగి వారి ప్రేమాభిమానాలు హత్తుకుపోయిన ఆపశిహృదయంలో వీలైనంత మట్టుకు వారిపై అసహ్యత చెందేటట్టు చెయ్యడానికి గట్టిగా ప్రయత్నించేది.

శంకర్రావు తనతో ఇంత సులువుగా బయలుదేరి పిల్లలతో సహా వచ్చేస్తాడని ఆదిలక్ష్మి కలలోకూడా అనుకోలేదు. ఈ దెబ్బతో సీతారామయ్య పరువు బయటపడి వీధిని పడతాడన్న నమ్మకం కుదిరింది. అనుకున్నట్టుగా అన్ని పనులూ సక్రమంగా జరగడంవల్ల ఎక్కువ ఉత్సాహంతో సమయం దొరికినప్పుడల్లా ఇరుగు పొరుగు వాళ్ళతోనే కాకుండా అప్పుడప్పుడు పుళ్ళుత్తొపంపడి మావ దగ్గరకు వెళ్ళిపోదామన్న నిర్ధారణకు వచ్చికూడా అత్తయ్య ముఖం ఎలా చూడగలనా అని అభిమానంతో క్రుంగిపోయే శంకరం దగ్గర కూడా అత్తయ్య మావయ్యలకు తనయందు ఎంతో ప్రేమాభిమానాలు కలవన్న అతని లోని నమ్మకం నాశనం అయ్యేటట్టు వాళ్ళను విమర్శించేది.

వదినగారు కోర్టులో దావా వెయ్యమని తనతో జూ హెచ్చరిక చేస్తున్నా శంకర్రావుమాత్రం మొదట్లో మావ తన దగ్గరకు వస్తాడేమోనన్న నమ్మకంతో వినీవిన్నట్టు మౌనంగా వూరుకున్నాడు. కాలం జరుగుచున్న కొందీ ఆ నమ్మకం నశించింది. వదినగారు అన్న మాటలు అక్షరాలా నిజం అనిపించింది. ఆఖరుకి తుది నిర్ణయానికి వచ్చాడు. మావమీద దావా వెయ్యాలని.

తన నిర్ణయాన్ని వదినగారితో చెప్పాడు. ఆదిలక్ష్మి పర్వతం ఎక్కింది. వెంటనే కోర్టు ఖర్చులకని అయిదువందల రూపాయలు శంకరం చేతిలో పెట్టింది. ఈవార్త ఇరుగుపొరుగువాళ్లతో ఎంతో ఉత్సాహంతో అప్పుడే సీతారామయ్య దావాలో ఓడిపోయి ఆ మేడ అప్పగింతలు పెట్టేసినంత ఇదిగా చెప్పుకువచ్చింది. ఆనాడు శంకరానికి అతి ఆప్యాయమైన మైసూరుపాకు వెన్న కాచిన నేతిలో జాగ్రత్తగా తయారుచేసి అతను వద్దంటున్నా బలవంతంగా తినిపించింది. కుర్రాడికి జేబునిండా డబ్బులు పోసింది.

శంకర్రావు ఆది లక్ష్మి ఇంట్లో వున్నా ఆ సంవత్సరం సంక్రాంతికి మామ్మూలుగా అందరితోపాటు శంకర్రావు ఆదిలక్ష్మిలకు కూడా బట్టలు తీసి తనే స్వంతంగా తీసుకు వచ్చాడు. అయినా ఆదిలక్ష్మి శంకర్రావులు సీతారామయ్య కలలోకూడా అనుకోనంతగా అతన్ని అవమానపరచి బయటికి గెంటివేశారు. సీతారామయ్య ఎంతైనా బాధపడ్డాడు. అప్పట్లో అనుకున్నాడు 'పాముకు పాలుపోసి పెంచానని': ఆదిలక్ష్మి మాట అటుంచి శంకర్రావంటే పూర్తిగా అసహ్యత ఏర్పడింది. ఏమైనాసరే తను అనుకున్నట్టుగా శంకర్రావుపట్ల ఎంతమాత్రమూ ఇకముందు ఆచరించడం అసంభవం అన్న నిర్ధారణకు వచ్చేసరికి చనిపోయిన సరస్వతి తనవైపు దీనంగాచూస్తూ లీలగా కన్పించినట్టయింది. ఆనాడు చనిపోతూ తన చెల్లెలు చుట్టూ పెద్దన్నగారు మొదలయిన కుటుంబపెద్ద లున్నప్పటికీ తనను ప్రత్యేకంగా పిలచి పొత్తిళ్ళలోని శంకర్రావును తన చేతుల్లో పెట్టిన సంఘటన అతని స్మృతివీధిలో ఇట్టే మెరసింది. వెంటనే అతనికళ్లు చెమ్మగిల్లేయి. అప్పుడే కొంచం కరడుగడ్తున్న అతని హృదయం ఇట్టే కరిగిపోయింది.

పండుగవెళ్లిన పదోనాడు సీతారామయ్యకు కోర్టు సమనులు వచ్చాయి. సీతారామయ్య భార్య ఎంత మంచిదయినా ఆడవాళ్ళకుండే సహజ గుణానుసారంగా భర్తతో అంది "చూశారా! వాడు ఎంత పని చేశాడో! పోనీ ఆదిలక్ష్మి అంటే మొదటినుంచీ మనం అంటే చెడపురుగుల్లా చూస్తుంది. వాడికైనా బుద్ధి వుండొద్దూ? ఏమైనాసరే ఈ పర్యాయం మీరు ఈ విషయంలో పట్టుదలగా వుండాలి." సీతారామయ్య గుణాల్ని పూర్తిగా జీర్ణం చేసుకున్న దవ్వడంవల్ల ఒకవేళ ఆ మేడ శంకర్రావుకు వదిలివేస్తాడేమోనన్న అనుమానంతో చిన్న హెచ్చరిక చేసింది.

సీతారామయ్య చిరునవ్వుతో జవాబిచ్చాడు. "ఇందులో వాడి తప్పేముంది? ఇంకా చిన్నతనం. వా డెప్పుడైనా ఇలాంటి వ్యవహారాల్లో మెసిలాడా ఏం? లోకజ్ఞానంలేని కుర్రాడు."

అత వలా అంటుంటే ఆమె ఎంతైనా ఆశ్చర్యపోయింది. అతని ముఖంలోకి తీక్షణంగా చూచింది, ఆముఖంలోని పూర్తి ప్రశాంతత ఆమెను తిరిగి ఏమీ అననీయకుండా అడ్డుపడింది "ఏమో మీఇష్టం" మెల్లిగా అంటూ అక్కడినుంచి వెళ్లిపోయింది.

కోర్టులో శంకర్రావు కనిపిస్తాడేమోనని సీతారామయ్య కోర్టంతా కలయచూచేవాడు కాని ఒక్కనాడూ తుదకు ఆఖరి వాయిదానాడైనా కనిపించలేదు. సీతారామయ్య ఎంతైనా జాలిపొందేడు. మేనల్లుడు తన ముఖం చూడ్డానికి సిగ్గుపడుతున్నాడని.

దస్తాదేజుల్లో శంకరంతల్లి బ్రతికి వున్నంతకాలం ఆ మేడమీదవచ్చే ఆదాయం అనుభవించడానికేగాని ఆమె తదనంతరం ఆమె సంతతికి ఏమాత్రమూ హక్కు లేదని వ్రాసివుండడంవల్ల దావాలో సీతారామయ్య జయంపొందేడు.

దావాలో సీతారామయ్య జయం పొందాడన్న వార్త శంకర్రావు మెల్లిగా ఆదిలక్ష్మి చెవిలో వేశాడు. ఈ మాట వినడంతోనే ఆమె తారాపథానికి లేచింది. ఆమె నోటంట అనర్గళంగా సీతారామయ్యను అతని కుటుంబాన్ని ఎన్నో శాపనార్థాలు పెడుతూ ఏమిటేమిటో దూషిస్తూ వాటి కవే వడివడిగా దొర్లిపోతున్నాయి. ఇరుగుపొరుగువాళ్లు ఏమిటయిందోనన్న ఆతృతతో అరుస్తూన్న ఆదిలక్ష్మి చుట్టూ చేరారు. ఇంతలో ఎక్కడో ఆడుకోవడానికి వెళ్లిన శంకరం కొడుకు ఇంట్లో అడుగుపెడ్తూనే అరుస్తున్న పెదతల్లి చుట్టూ మూగిన జనాన్ని మూలను కుర్చీమీద బుర్ర రెండుచేతులతోనూ అదిమిపెట్టుకొని కూర్చున్న తండ్రినిచూచి ఆశ్చర్యపడుతూ అసలు సంగతేమిటో అర్థంకాక అమాయకంగా చుట్టూ మూగిన జనాన్ని తప్పించుకుంటూ పెదతల్లి దగ్గరకు చేరాడు.

అంతవరకూ అరుస్తూ నోటికి వచ్చినట్లు తిడుతూ వీరావేశంలోనున్న ఆదిలక్ష్మి కుర్రాడిని చూడ్డంతోనే గట్టిగా ఏడుస్తూ

'నాయినా మీ గొంతు కోసేశాడురా' అంటూ కుర్రాడిని గట్టిగా గుండెలకు హత్తుకుని రాగాలు తీస్తూ శోకాలు పెట్టింది. సంగతి తెల్సాక చుట్టూ మూగిన జనం ఎవరికి తోచిన విధంగా వాళ్లు సానుభూతిగా ఓ రెండు మాటలని ఎవరి త్రోవను వాళ్లు వెళ్ళిపోయారు.

అందరూ వెళ్లిపోగానే ఆదిలక్ష్మి స్వరస్థాయికూడా సన్నగిల్లింది. మెల్లిగా శంకరంతో అంది "అలా బుర్రపట్టుకుని దిగులు పడితే లాభమేముంది? ముందుకు మార్గం ఆలోచించు. ఇలా విడిచిపెట్టేస్తా మనుకున్నావేమో. ఎంత డబ్బైనా ఖర్చవ్వనీ తుదకు నా కొంపయినా అమ్మి ముప్పైమూడు కోర్టులూ తిప్పి మరీ విడిచిపెడతాం. క్రింది కోర్టులో గెలవగానే సంబరం కాదు హైకోర్టుకూడా వుంది. అప్పీలు చేద్దాం. ధైర్యం బెంగపడకు." దిగులుగా కూర్చున్న శంకరానికి ధైర్యం చెప్పింది.

శంకరం ఏ విధమైన జవాబూ యివ్వలేదు. అదో మాదిరిగా ఆమెను చూస్తూ వూరుకున్నాడు. కుర్రాడికి అసలు సంగతి పూర్తిగా అవగాహనయ్యింది. సీతారామయ్య తన తండ్రినీ పెదతల్లినీ అన్యాయం చేశాడని గ్రహించాడు. ఆలేత హృదయానికి సీతారామయ్య అంటే ఎంతైనా అసహ్యత ఏర్పడింది. నిజంగా సీతారామయ్య ఎదురుగా వుంటే చంపిపారేయా లనిపించింది. 'ఛీ! తాత ఎంత దుర్మార్గుడు! అనవసరంగా వుసురు పెడుతున్నాడు' తనలో అనుకుంటూనే పెదతల్లి వడిలోనుంచి లేచి వీధిలోకి వచ్చాడు.

ఎదురుగా సీతారామయ్య ఏదో కాగితాల కట్ట చేత్తో పట్టుకుని వీధిలో నిలబడ్డ శంకరం కొడుకుని దూరంనుంచే చూచి చిరునవ్వుతో ముందుకు మెల్లిగా అడుగు వేసుకుంటూ వస్తున్నాడు.

వస్తున్న సీతారామయ్యను చూడ్డంతోనే కుర్రాడి నరాల్లోని రక్తం వేడెక్కింది. ఆ సాయంత్రం పార్కు మైదానంలో చెప్పిన కమ్యూనిస్టు నాయకుని ప్రబోధం— గాంధీ మహాత్మ చెప్పినట్టూ మనం శాంతం ఓర్పుతో వుంటే లాభం లేదు. మనకు శత్రువుగా కనిపించే ప్రతీ వ్యక్తినీ చీడపురుగులా చూస్తూ నాశనం చేసి పారెయ్యాలి- ఆ కుర్రాడికి జ్ఞాపకంలో పడింది. వెంటనే ఇంట్లోకి పరుగులు పెట్టాడు. మూలనున్న కర్ర తీసి ఉత్సాహంతో గుమ్మం మెట్లెక్కుతున్న సీతారామయ్య బుర్ర మీద గట్టిగా బాదాడు. దెబ్బతో సీతారామయ్య "అబ్బ! ఎంత దెబ్బ కొట్టావురా! శంకరం!" గట్టిగా అరచి దెబ్బ తగిలి రక్తం కారుతూన్న జాగాను అరచేతితో గట్టిగా అదిమి అలానే మెట్లమీద కూర్చుండిపోయాడు.

గతించినదాన్ని సింహావలోకం చేసుకుంటూ లోకాన్ని మరచి కూర్చున్న శంకరం సీతారామయ్య కేకతో బాహ్యలోకంలో పడి అకస్మాత్తుగా వినిపించిన మావ అరుపుకు ఆశ్చర్యపడుతూ ఆతృతతో గబగబా పైకి వచ్చాడు.

ఎదురుగా కర్ర పట్టుకున్న కొడుకు రక్తం కారుతున్న సీతారామయ్య కనబడేసరికి జరిగిన సంగతి ఇట్టే గ్రహించాడు. గట్టిగా అరుస్తూ "ఛీ! వెధవా ఎంత పని చేశావు?" కుర్రాడి దవడమీద సత్తువకొలదీ చరచి 'మావా' అని గట్టిగా వెర్రికేక వేసి సీతారామయ్య బుర్రను వడిలోకి తీసుకున్నాడు. ఆవురుమని ఏడ్చాడు. అతని నయనద్వయంలోనుంచి నీరు కట్టలు తెగి ప్రవహించే మహానదిలా ఏకధారగా ప్రవహించి రక్తం డాగులు కట్టిన సీతారామయ్య బుర్రను కడిగివేసింది.

శంకరం వెర్రికేకతో ఆదిలక్ష్మి బయటకు వచ్చింది. ఎదురుగా కన్పించిన దృశ్యం చూసేసరికి ఆమె శరీరం పట్టుతప్పినట్టయింది. అప్రయత్నంగా ఆమె కళ్లంట నీరు జలజలా రాలింది. వెంటనే బొంగురుపోయిన గొంతుకతో "బాబాయి" అంటూ సీతారామయ్య పాదాలమీద వ్రాలింది.

సీతారామయ్య ఆదిలక్ష్మి బుర్రమీద చేతితో నిమురుతూ "లే అమ్మా! ఇంట్లోకి పోదాం" నీరు కారుతూన్న కళ్ళను ఓ చేత్తో తుడుచుకుంటూ, ఓ చేత్తో శంకరాన్ని ఆదుకుని లేచి నిలబడి మూలను నిశ్చేష్టితుడై నిలబడి అమాయకంగా చూస్తున్న శంకరం కొడుకుని చూచి "ఏరా తాతా కోపం వచ్చిందా? నిజంగా నీవు మగ్వాడి వనిపించుకున్నావురా. నీ కున్న కోపాన్ని ముఖాముఖీగా రుజూ చేసుకున్నావు. మీ నాన్న నీలా కాకుండా ఆడదానిలా పెంచానన్న విశ్వాసమైనా లేకుండా నేను బ్రతికినన్నాళ్లూ బాధపడేట్టు చెయ్యాలనుకున్నాడు. పాపం! మీ నాన్న గట్టిగా కొట్టినట్టున్నాడు. ఏరా! శంకరం కుర్రాడిని అంత దెబ్బ కొట్టుకుంటావా? ఇందులో వాడి తప్పేముంది ఏ చిలక్కి ఆ పలుకన్న సామెతగా మీరు చెప్పే మాటలనుబట్టే వాడూ కొట్టాడు. నీకంటె వాడే నయం దెబ్బతో ఏ బాధా లేకుండా చేద్దామనుకున్నాడు. ఏరా తాతా, అంతేనా. ఇదుగో, మీ నాన్నమ్మ మేడకాగితాలు తీసుకో, మీ నాన్నకుమాత్రం ఇవ్వకు" చిరునవ్వుతో కుర్రాడిని ఎత్తుకుని ఇంట్లోకి త్రోవ తీశాడు.

"నిజంగా ముసలివాడు దేవతా స్వరూపుడు" తడి ఆరని కళ్ళతో శంకరం ఆదిలక్ష్మిలు తమలో గొణుక్కుంటూ మెల్లిగా అడుగులు వేసుకుంటూ సీతారామయ్యను అనుసరించారు. ★




భరణీవారి 'ప్రేమ' లో భానుమతి

సినిమా:

ఇటాలియన్ చిత్రాలు

ప్రపంచంలోకెల్ల ఇటాలియన్ చిత్రాలు అత్యుత్తమమైనవని మొన్నటి అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనం నిరూపించింది. కథలను ఎంచడంలోనూ, ఆ కథలను సినీమాకు అవసరమైన రీతిని చిత్రించడంలోనూ ఇటాలియన్లలో ఒక ప్రత్యేకత కనపడుతుంది. రెండో ప్రపపంచయుద్ధంలో అన్నివిధాలా భంగపడిన దేశం ఇటలీ. యుద్ధం అనంతరం దుర్భరదారిద్ర్య స్థితిలో ప్రజలు రోజులు గడుపుతున్నారు. నేటి దారిద్ర్య స్థితికి హేతువేదో అందరికీ తెలుసును. జాతిగర్వం యుద్ధకాలంలో దెబ్బతిన్నది. ఆపైన రెండురకాల రాజకీయవాదులమధ్య పెనగులాట ప్రారంభమయింది. ఈ స్థితిలో తమ జాతీయజీవన విధానాన్ని, ప్రజల దారిద్ర్యాన్ని, మానవ స్వభావంలోని మంచిచెడ్డలను తరిచి చూసుకోడం ఆరంభమయింది. ఇదే వారి చిత్రాలలో బహుముఖాల గోచరమాతుంది.

మద్రాసులో ప్రదర్శించబడిన ఇటా



విజయావారి 'పెళ్లిచేసి చూడు' లో స్వప్నదృశ్యం సెట్స్‌మీద ఛాయాగ్రాహకుడు బార్ట్లే, డైరెక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రకాశరావు, కథకుడు చక్రపాణి, ఆర్ట్ డైరెక్టర్లు గోఖలే, కళాధర్, కవి పింగళి నాగేంద్రరావు మొదలైన వారు.



విజయావారి "పెళ్లి చేసి చూడు"లో గోవిందయ్య, భార్య (దొరస్వామి, సూర్యకాంతం)



అంజలివారి "పరదేశి"లో అంజలి

లియన్ చిత్రాలు అయిదు. ***1. Miracle of Milan*** *2. Naple's Millionaires 3. Open City 4. Bycicle Thief 5. Girl of The Marshes.* ఈ అయిదింటిలోనూ *Bycicle Thief* (సైకిల్ దొంగ) అందరినీ అధికంగా ఆకర్షించింది.

వీనిలో ప్రతిచిత్రంలోనూ వాస్తవ జీవనాన్ని ప్రతిబింబించడంలో అద్వితీయమైన ప్రతిభ కనపడుతుంది. ఏ కావ్యం కంటె కూడా వాస్తవ జీవితమే రసభరితమైనదని గోర్కీ అన్నాడు. ఈ సత్యాన్ని గోర్కీ తన ఆత్మకథలో నిరూపించాడు. ఇప్పుడు ఇటాలియన్ చిత్రాలు అదే సత్యాన్ని చాటుతున్నాయి.

'సైకిల్ దొంగ' అనే చిత్రంలో కథ అట్టే లేదు. ప్రభుత్వమిచ్చే భత్యంతో బ్రతుకుతున్న ఆంతోనియోకి దొరక్క దొరక్క రెండేళ్ల అనంతరం పని దొరుకుతుంది. అది గోడలకి పోస్టర్లు అంటించే పని. అయితే స్వంత సైకిల్ లేకపోతే ఆపని

★



భారతలక్ష్మీవారి 'ప్రియురాలు'లో లక్ష్మీకాంత, జగ్గయ్య



విజయ వారి

పెళ్ళి చేసి చూడు

నటులు : జి. వరలక్ష్మి, ఎన్. టి. రామారావు, సావిత్రి, జోగారావు, దొరస్వామి, డా. శివరామకృష్ణయ్య, రంగారావు, పుష్పలత, వెంకయ్య, కందు, బేబి గిరిజ, బాలకృష్ణ, పద్మనాభం వగైరా.



డైరెక్టర్....ప్రసాద్ .... నిర్మాతలు...నాగిరెడ్డి & చక్రపాణి



పీపుల్స్ వారి 'పల్లెటూరు'కి కృష్ణాజిల్లాలో "చెడుగుడు" షూటింగు. కారుమీద నిలబడ్డవారు డైరెక్టర్ తాతినేని, కామెరామన్ విఠల్, మేకప్ అసిస్టెంటు వీర్రాజు, కామెరా అసిస్టెంటు స్వామి.

కూడా ఇవ్వరు. అందువల్ల ఇంట్లో గుడ్డ లమ్మి వచ్చినడబ్బుతో తాకట్టుతీర్చి తన సైకిల్ తెచ్చుకుంటాడు. మన్నాడు పనికి వెళ్లి ఒకచోట పోస్టర్ అంటిస్తున్న సమయంలో ఒక దొంగ అతని సైకిల్ తీసుకుని పారిపోతాడు. ఆంతోనియో వెంట బడినా దొంగ ఇట్టే మాయమైపోతాడు. పోలీసులకు రిపోర్టిస్తే దొంగని సైకిల్తోసహా పట్టుకొని తీసుకొస్తే సైకిలిప్పించగలనని ఆఫీసర్ చెప్తాడు!

దొంగసొత్తులు అమ్మే బజారుకి మర్నాడు ఆదివారం మిత్రులతో సహా వెళ్లి గాలిస్తాడు. సైకిల్ దొరకదు, వాన రాగా ఎనిమిదేళ్ల కొడుకుతో కలిసి తలతడి




యం. కె. యం. వారి 'మరదలు పెళ్లి'లో మరదలు కృష్ణకుమారి, బావముక్కామల



అంజలివారి 'పరదేశి'లో మాతృమూర్తిగా అంజలి

యకుండా ఒకచోట నిలబడతాడు, వాన వెలిసిపోగానే అంతదూరంలో దొంగ సైకిల్ నిలిపి ఒక ముసలిదానితో మాట్లాడ్డం చూస్తాడు. అంతో నిహోపరుగెత్తి పట్టుకోబోతే దొంగమళ్లు పారిపోతాడు. వెనక్కి వచ్చి ఆచోటంతా వెతికి ముసలివాణ్ణి పట్టుకుంటాడు. దొంగపేరు నివాసం చెప్పకుండానే ముసలివాడు తప్పించుకుంటాడు చివరికి దొంగ కనబడినా పోలీసుని తీసుకు వచ్చి అతని ఇల్లు వెతికించినా సైకిలు మాత్రం దొరకదు. పేటలో జనంమాత్రం దొంగకి దొంగతనం కట్టినందుకు ఇతన్నే నిందిస్తారు! జరిగిన వంచన దిగ్రమింగకుని సమీపంలోఉన్న ఒక సైకిల్ని అంతో నిహో దొంగలించబోయి పట్టుబడతాడు. అందరూ ఇతన్ని దూషించి విడిచిపెట్టేస్తారు.

కథ ఆట్టే లేకపోయినా నిత్యజీవితంలో సహజంగా అందరికీ తటస్థపడే సన్నివేశాల సహాయంతో మానవహృదయాన్ని, దౌర్బల్యాన్ని, సుఖదుఃఖాలను దర్శకుడు మరచిపోలేని విధంగా చిత్రించాడు. కష్టంలో ఉన్నప్పుడు, విప్పలేని చిక్కులో పడినప్పుడు, వంచనలమధ్య పరాభవం



సినీ టెక్నీషియన్స్ ఎసోసియేషన్ వారు ఓపెన్ ఎ[illegible] (రు 300 పైగా) చెన్నపట్నం నీటిసప్లై వృద్ధికోసం ఇచ్చా[illegible] తీసుకుంటున్నవారు మేయర్ షిబ్గతుల్లా, ఇస్తున్నవారు ప్రభుత్వ అంతరంగిక కార్యదర్శి పుల్లారెడ్డి



ఏ. యు. ప్రొడక్షన్స్ వారి 'ఆడబ్రతుకు'లో కనకం, రఘురామయ్య



యువ . . .ి 'టింగ్ రంగా'లో కనకం, రేలంగి, సరళ, సీతారామయ్య, నల్ల రామమూర్తి

చెందినప్పుడు, ఆశ అల్లంతదూరంలో అందీ అందకుండా పరిభ్రమింపచేసినప్పుడు మనస్సు ఏ రీతిగా ఉంటుందో, పరిపరి విధాల ఎలా భ్రమిస్తుందో బహు కొద్దిమాటలలో అది సహజంగా చిత్రించబడింది.

ఆంతోనియోకి తన జీవనోపాధికి సైకిల్ ఎంత అవసరమో తెలుసును. ఉద్యోగంలో చేరబోతూ మేనేజర్ దగ్గిరకి వెళ్ళేటప్పుడు ఆంతోనియో సైకిల్ని భుజానికి తగిలించుకుని వెడతాడు. నేలమీద దించడానికి మనసొప్పనట్లు ప్రవర్తిస్తాడు.

వివిధ సన్నివేశాలను సృష్టించి నిర్వహించడంలోనూ, ముఖ్యంగా ఆంతోనియోనీ అంటిపెట్టుకుని తిరుగుతూ సైకిల్ కోసం వెతికిన ఎనిమిదేళ్ళ కొడుకు బ్రూనోతో జరిగిన సంఘటనలలోనూ దర్శకుని అసమానమైన ప్రతిభ కనపడుతుంది. జీవనమంతా సంగ్రామమైనప్పుడు వ్యక్తుల ప్రవర్తన, పసిబాలుర అమాయకత్వం క్షణికసుఖాల భ్రమకు లోనయ్యే వారి చిత్తవృత్తి, సమాజం వంచనకు లోనైనవారెలా దుర్వర్తనకు మొగ్గుతారో వాస్త



పద్మనాభన్ వారి 'రాజేశ్వరి'లో ఒకసన్నివేశం.

కంగా చిత్రించబడింది. కరుణరసాత్మక మైన ఈచిత్రం మన నిర్మాతలకు ఒక తెన్ను చూపుతోంది.

ఈ చిత్రంలో ఇంకొక ముఖ్యమైన అంశమేమిటంటే మొదటినుంచి తుదివరకూ ప్రతి దృశ్యంలో కనపడే నాయకుడు అంతో యిన్తో పాత్రను ధరించి నవాడు సినిమాల కృత్రిమ సంబంధించని వాడు. ఒక కార్మికుని తెచ్చి దర్శకుడు అంతో యింతో పాత్ర యిచ్చాడు. అయితే ఏ నటుడికంటే తీసిపోని ప్రతిభ నతడు ప్రదర్శించాడు. ఇంత్రికో నటులను ముఖ్య పాత్రలుగా తెచ్చి చిత్రానికి కృతకా కేవంపోసిన దర్శకుని ప్రశంస అనవసరం!

మద్రాసు డైరీ

(౪-వ పేజీ తరువాయి)

క పదుల్పత్తికి అన్ని ప్రాంతాలకు, సమాన మైన అవకాశాలు కల్పించబడ్డాయి. అనేకుండికి కృత్తి కల్పించబడ్డాయి. రాయల సీమలో ఖనిజసంపత్తి, పరిశ్రమల అభివృద్ధికి ఆ ప్రాంతంలో అవకాశా లున్నాయి. అయితే ఆ ప్రాంతానికి నీటి వసతి సిద్ధ్యర్థ్యం ఆవశ్యకమౌతుంది.

ఇదంతా ప్రవృత్తు సాధ్యపడేది కాదం టారు. నిజమే. కాని ఈముఖ్యాంశాల్ని దృష్టిలో పెట్టుకునే తాత్కాలిక కార్య క్రమాలనైనా నిర్ణయించాలి. ★

మరపురాని రవణ

(౫-వ పేజీ తరువాయి)

వాళ్లింట్లో శ్వాస మాయింట్లోకి మాయింట్లో శ్వాస వాళ్లింట్లోకి వినిపిస్తూనేవుంటాయి. నాకూ దెబ్బలు తగిలాయి, నోరంతా మండి పోతోంది. తలనిండా యిసుకమయం. నేనుపొందిన విజయానందములో పోటి నన్నింటినీ మరచిపోయాను. నా పట్టుదలే నెగ్గింది. కాని హృదయంమాత్రం క్షణ క్షణం బరువెక్కిపోతూంది. రవణని తలుచుకుని నాలో నేనే కుల్లి కుమిలిపోతున్నాను. ఇదేకాకుండా యీ అవతారంలో యింటికి వెళ్లితే బ్రతకనిస్తారా నాన్న గారన్న భయం అడుగడుక్కి నా హృదయాన్ని కలిచివేస్తూంది.

అదృష్టవశాత్తు నేనింటికి వెళ్ళేసరికి మా నాన్నగారింట్లో లేరు. ఎక్కడికో వెళ్లారు పనిమీద. అమ్మవుంది. నేను గడపలో అడుగుపెట్టి పెట్టడంతోటే మా అమ్మ, "అదేమిట్రా!...ఏమిటదంతా? ఒళ్లంతా యీ యిసుకేమిటి? యీ దెబ్బ లేమిటి? అసలేం జరిగిందో చెప్పరా! ఎవరితోనైనా పోట్లాడావా? ఎవరైనా నిన్ను కొట్టేరా? ఏం జరిగిందో చెప్పరా! అల్లా బెల్లం మొత్తిన రాయిలా కూర్చుంటావేం? మీ నాన్న చూస్తే యింకేమైనా వుందా?" అంటూ నన్ను తిప్పకుండా యేకరవు పెట్టింది. నేను మాత్రం ఏ ఒక్క మాటకి సమాధానం చెప్పలేదు. అమ్మ అప్పటికప్పుడు కుంకుడు కాయ కొట్టి తలంటనీళ్ళు పోసింది. దెబ్బలకి మందు రాసింది. వేడి వేడి అన్నం పెట్టింది. కాని జరిగిన సంగతిమాత్రం నేను చెప్పలేదు.

వారం రోజులు గడిచినాయి. రోజు రవణ నేను బడికి వెళ్తూనే వున్నాం. ఒకే బెంచిమీదనే కూర్చుంటున్నాం, కాని మాటలు లేవు. వారం రోజులూ మాముఖా ముఖ యేకమైంది. ముందు మాట్లాడవలసిం రవణ. కాని మాట్లాడలేదు. నేను మాత్రం యెందుకు మాట్లాడాలి?

రవణది పక్వంకాని పసిహృదయం. ఇట్టే కోపం వస్తుంది. కోపం నిలపెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. కాని నిలపెట్టలేడు.

అది రోజున ఏదవరోజు. మేం మాట్లాడుకోలేదు. రాత్రి భోజనం చేసి ... పుస్తకం ... లాంతరు ముందర కూర్చుని చదువుతున్నాను. ఇంతలో "సోకేయి లక్ష్మణా!" అని తలుపుదగ్గర యెవరో పిలిచినట్లనిపించింది. రవణ గొంతుకేమోనని అనుమానం. అయినా చూద్దామని వెళ్లి వీధితలుపు తీశాను. నే ననుకున్నట్టు అక్కడ నిజంగా రవణే! నా ఆనందం చెప్పతరంకాదు. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "ఏం, యెందుకొచ్చావ్?" అన్నాను గద్గదస్వరంతో కాస్త బెట్టుచేసినట్టు.

"ఒరేయి...నీతో మాట్లాడకుండా క్షణం వుండలేన్రా! అసలు సంగతి అర్థమైంది. ఆ చేసిందంతా ఆ విధంగా చెప్పడంమాటలువిని ముందు వెనకలు ఆలోచన లేకుండా నీతో విరోధం ... నా తప్పు క్షమించు. ఈ రోజు నుంచి మళ్ళీ మనిద్దరం స్నేహితులం" అన్నాడు దుఃఖంతో.

ఆ మాటలకి నా హృదయం పులకరించింది. రవణని బిగువుగా కౌగలించుకున్నాను.

ఆ పసితనపు బుద్ధులు, ఆ చేష్టలు ఒక్కసారి గుర్తొచ్చి నవ్వేను. అంతా అది నా అవివేకం తెలుస్తుంది. నవ్వుకారణం చెప్పాను. మళ్లీ మా జీవితాలు యథాపటికి మళ్లీనే గడిచిపోతూంది.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St ...